
స్వాగతం.. సుస్వాగతం...
ప్రజాగళం
ఎన్నికల శంఖారావంలో భాగంగా ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని
మార్కాపురం నియోజకవర్గంలో జరుగు ప్రజాగళం కార్యక్రమానికి
విచ్చేయుచున్న ప్రియతమ నాయకులు, మాజీ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి
మరియు అతిరథ మహారథులకు స్వాగతం... సుస్వాగతం...
ఈ రోజు జరుగు ప్రజాగళం బహిరంగ సభకు
తెదేపా, జనసేన, బిజెపి పార్టీల
నాయకులు, కార్యకర్తలు, యావత్ ప్రజానీకం విచ్చేసి
విజయవంతం చేయ ప్రార్థన...
బహిరంగ సభ :
31 మార్చి 2024 ఆదివారం మధ్యాహ్నం గం: 3.00 లకు
వేదిక :
గడియార స్తంభం సెంటర్, మార్కాపురం పట్టణం
మాగుంట రాఘవరెడ్డి
తెలుగుదేశం పార్టీ యువ నాయకులు
ఒంగోలు
కందుల నారాయణరెడ్డి
మార్కాపురం నియోజకవర్గ
తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి
మాగుంట శ్రీనివాసులరెడ్డి
పార్లమెంట్ సభ్యులు, ఒంగోలు
ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి
మాగుంట అభిమానులు - ఒంగోలు, ప్రకాశం జిల్లా



టీడీపీలో చేరిన వారితో మాగుంట, కందుల, రాఘవరెడ్డి



గిద్దలూరులో టీడీపీలో చేరిన వారితో అశోక్‌రెడ్డి

### » నేడు మార్కాపురంలో బాబు ఎన్నికల ప్రచారం

జిల్లాకు ఆదివారం టీడీపీ అధినేత నారా చంద్రబాబు వస్తున్నారు. జిల్లాలో తొలి ఎన్నికల ప్రచార సభను ఆయన మార్కాపురంలో నిర్వహించనున్నారు. పార్టీపరంగా తూర్పు ప్రాంతంతో పోల్చితే పశ్చిమం కొద్దిగా వెనుకంజలో ఉందన్న భావన అధిష్ఠానంలో ఉన్నట్లు సమాచారం. దీంతో తొలిసభను పశ్చిమప్రాంతంలో ప్రత్యేకించి మార్కాపురంలో చంద్రబాబు నిర్వహించడం ద్వారా అక్కడి కేడర్‌ను మరింత కదిలించేలా ఉన్నట్లు సమాచారం. కాగా టీడీపీ అధికారంలోకి వచ్చాక పశ్చిమప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టే యోచనలో ఉన్న విషయాన్ని చంద్రబాబు ఇప్పటికే పలుమార్లు వెల్లడించారు. ప్రధానంగా ఆ ప్రాంత ప్రజల చిరకాల కోరికలైన మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేసి సాగు, తాగునీరు అందించడం, నాలుగు నియోజకవర్గాల ప్రజల దాహార్తి తీర్చే వాటర్‌గ్రిడ్ నిర్మాణం, దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి నిమ్జ్ వంటి వాటి ద్వారా ఉపాధి మార్గాల పెంపు తదితర అంశాలపై మరోసారి మార్కాపురం సభలో బాబు మరింత స్పష్టత ప్రజలకు ఇచ్చే అవకాశం ఉంది.

# సమరోత్సాహం

## అన్నింటా ముందున్న టీడీపీ అభ్యర్థులు

## సూపర్ సిక్స్‌పై ప్రచారం

» క్షేత్రస్థాయి నేతలతో సమావేశాలు
» జనసేన, బీజేపీతో సమన్వయం
» నేడు జిల్లాకు చంద్రబాబు
» మార్కాపురంలో తొలిసభ



ఒంగోలు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం కనిపిస్తోంది. మరో పక్షంరోజుల్లో నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభం కానుండగా ఆలోపు ఆయా నియోజకవర్గాల టీడీపీ అభ్యర్థులు ఒక రౌండ్ ఎన్నికల ప్రచారం పూర్తిచేసేలా సాగుతున్నారు. గతానికి భిన్నంగా చాలా ముందుగానే అభ్యర్థులను అధిష్ఠానం ప్రకటించడంతో వారు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. దాదాపు ఏడాది కాలంగా అధినేత ఆదేశాలతో బాదుడే బాదుడు, బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ, యువగళం.. ఇలా పలురకాల కార్యక్రమాలలో ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, వారి సారథ్యంలో పార్టీ ముఖ్య నేతలు ప్రజల మధ్యనే ఉన్నారు. ఇక ఎన్నికల షెడ్యూల్ విడుదల సమయానికి అభ్యర్థుల ఎంపికను అధినేత కొలిక్కి తెచ్చారు. ఒక్క దర్శి మినహా మిగతా స్థానాలలో ఇన్‌చార్జిలుగా పనిచేస్తున్న వారినే ఎంపిక చేయగా, దర్శిలో కూడా తాజాగా ఆ ప్రాంతానికి సుపరిచితులైన గొట్టిపాటి కుటుంబానికి చెందిన మహిళను అభ్యర్థిగా ప్రకటించారు. మరోవైపు పార్లమెంట్ స్థానం నుంచి కూడా సుపరితమైన మాగుంటనే బరిలో దిగుతున్నారు. ఇవన్నీ టీడీపీకి కలిసి రానుండగా ఆయా నియోజకవర్గాలలో అభ్య ర్థులుగా నిలుస్తున్న వారు మరింత స్పీడు పెంచారు.

### వైసీపీ నుంచి కొనసాగుతున్న వలసలు

ఒక వైపు మండల, క్లస్టర్ స్థాయి ముఖ్య నేతలతో నిరంతరం సమావేశాలు, ఆయా ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షలు, ఇంకోవైపు అంతోఇంతో అసంతృప్తితో కాస్తంత దూరంగా ఉంటున్న వారిని దగ్గరకు చేర్చుకోవడం, ఇతర పార్టీల నుంచి టీడీపీలోకి వచ్చే వారిని గుర్తించి వారిని ఆహ్వానించడం చేస్తున్నారు. మరోవైపు పగలు ఆత్మీయ సమావేశాలు, సాయంత్రానికి బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో ఏదో ఒక ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. కొందరు అభ్యర్థులు ఇతర ప్రాంతాల్లో నివసించే తమ నియోజకవర్గానికి చెందిన సాఫ్ట్‌వేర్ రంగంలోని యువతతో పొరుగు ప్రాంతాల్లోనూ సమావేశాలు నిర్వహించి వారి నుంచి సహకారం పొందే ప్రయత్నం చేశారు. అదేసమయంలో కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉన్న బీజేపీ, జనసేన పార్టీల శ్రేణులను సమన్వయం చేసుకోవడంలో సక్సెస్ అయ్యారు. అలాగే అధికార వైసీపీ నుంచి పార్టీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. ఇలా పక్షంరోజులకుపైగా జిల్లాలోని వివిధ నియోజకవర్గాలలో బిజీబిజీగా అభ్యర్థులు, వారికి మద్దతుగా ముఖ్య నేతలు విస్తృత ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తుండటం టీడీపీ శ్రేణులలో జోష్ పెంచుతోంది.



కందుకూరులో ప్రచార పత్రాలను అందజేస్తున్న బీఎన్



ఒంగోలులో పార్టీలో చేరిన వారితో దామచర్ల, రియాజ్

### దర్శి శ్రేణుల్లో ఉత్సాహం

ఇప్పటివరకు అభ్యర్థి ఎంపికలో నెలకొన్న గందరగోళం తొలగిపోవడంతో దర్శి నియోజకవర్గ శ్రేణులు ఉత్సాహంగా కనిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఆయా నియోజకవర్గాలలో శనివారం కూడా ఒకవైపు వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు, మరోవైపు ఇంటింటి ప్రచార కార్యక్రమాలు జోరుగానే సాగాయి. ఈ నేపథ్యంలో అధినేత చంద్రబాబు జిల్లాకు వస్తున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్, ఇతర అధికారులు

# ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

» ఇప్పటివరకు రూ.75.47 లక్షల సొత్తు సీజ్
» ప్రచారంలో పాల్గొన్న ఒక ఉద్యోగి సస్పెన్షన్
» 20 మంది వలంటీర్లు తొలగింపు
» జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ వెల్లడి

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 30 : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేసేలా చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఈనెల 16వతేదీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు తీసుకున్న చర్యలను కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోలు రూంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. సీ విజిల్, సువిధ యాప్ ద్వారా ఇప్పటివరకు 334 ఫిర్యాదులు రాగా వీటిలో 211ని ఆమోదించామన్నారు. ఎన్నికల కమిషన్‌కు 29 ఫిర్యాదులు వెళ్లగా 25ను పరిష్కరించి నివేదికను సమర్పించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.75.47 లక్షల సొత్తును సీజ్ చేయగా అందులో రూ.29లక్షల నగదు ఉన్నదన్నారు. కోడ్ అమలులోకి వచ్చాక ప్రచారంలో పాల్గొన్న ఒక రెగ్యులర్ ఉద్యోగితోపాటు ఏడుగురు కాంట్రాక్టు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. 20మంది వలంటీర్లను తొలగించగా ఒక రేషన్ డీలర్‌పై కూడా వేటు వేసినట్లు పేర్కొన్నారు.

### ప్రలోభాలను అడ్డుకునేందుకు ప్రత్యేక బృందాలు

అభ్యర్థుల ఎన్నికల ఖర్చును పరిశీలించేందుకు, ఓటర్లను ప్రలోభపెట్టేలా డబ్బు, ఇతర వస్తువుల రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 2,183 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 486 సమస్యాత్మకమైనవిగా గుర్తించి ప్రత్యేక బలగాలను నియమించామని తెలిపారు. ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలో రిసెప్షన్, కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ అనంతరం ఐదు నియోజకవర్గాలకు ప్రత్యేకంగా రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తామని తెలిపారు. ఎర్రగొండపాలెంకు మార్కాపురంలో, దర్శి, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాలకు స్థానికంగా మధ్యంతర స్ట్రాంగ్‌రూంలు ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఆర్.శ్రీలత, సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ పాల్గొన్నారు.

## నియోజకవర్గ కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌లు

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 30 : సార్వత్రిక ఎన్నికల్లో ఏమైనా సమస్యలు ఉన్నా, ఫిర్యాదులు ఉన్నా వెంటనే తెలిపేందుకు నియోజకవర్గ కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ హెల్ప్‌డెస్క్‌లు 24 గంటలూ పనిచేస్తాయన్నారు. ప్రజలు ఎన్నికలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే ఈ హెల్ప్‌డెస్క్‌కు తెలియజేయాలన్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

| నియోజకవర్గం | ఫోన్/సెల్ నెంబర్లు |
|---|---|
| ఒంగోలు | 08592 288099 |
| సంతనూతలపాడు | 08592 273100, 6305621139 |
| కొండపి | 08598 294717, 9032319379 |
| దర్శి | 8639370180 |
| కనిగిరి | 630144912 |
| మార్కాపురం | 9281034442 |
| గిద్దలూరు | 8639383409 |
| ఎర్రగొండపాలెం | 6281735787 |
| జిల్లా సీసీఆర్ | 08592-288599 |

# కుంట భూమి ఆక్రమణకు మళ్లీ యత్నం

» నీరు బయటకు పంపేందుకు పైపుల ఏర్పాటు » పట్టించుకోని అధికారులు



తొలగించేందుకు తవ్విన కుంట కట్ట

దర్శి, మార్చి 30 : కుంట పోరంబోకు భూమిని ఆక్రమించేందుకు మళ్లీ ప్రయత్నాలు మొదలయ్యాయి. ఎంతో విలువైన ఈ భూమిని స్వాహా చేసేందుకు కొంతమంది పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. గతం నుంచి సాగు చేసుకుంటున్నామని, తమకు హక్కులు కల్పించాలని కొందరు ఎస్టీలు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అదేవిధంగా కొంతమంది ఎస్సీలు కూడా అందులో కొంత తాము సాగు చేసుకుంటున్నామని తమకు హక్కులు కల్పించాలని ప్రదక్షిణ చేస్తున్నారు. రికార్డుల ప్రకారం కుంట పోరంబోకు భూమిని అన్యాక్రాంతం చేసే అవకాశం లేనందున ఆ భూమిలోకి వెళ్లొద్దని అధికారులు తేల్చిచెప్పారు. దర్శి రెవెన్యూలోని 1071 సర్వే నెంబర్‌లో 6.50 ఎకరాల కుంట పోరంబోకు భూమి ఉంది. గతంలో ఆ ప్రాంత రైతుల అవసరాల కోసం మధ్యలో కుంటను నిర్మించారు. సాగర్ జలాలు వచ్చిన తర్వాత ఆ ప్రాంత భూములన్నీ మాగాణిగా మారాయి. కుంటతో అవసరం లేకపోవడంతో అందులో కొంతభూమిని పలువురు ఆక్రమించి అనుభవిస్తున్నారు. ప్రస్తుతం ఎకరన్నర భూమి మాత్రమే ఖాళీగా ఉంది. మధ్యలో కొంతభాగం కట్ట ఉంది. దర్శి - పొదిలి ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకొని ఈ భూమి ఉండడంతో అక్రమార్కులు ఎలాగైనా స్వాహా చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అక్కడ ఎకరం రూ.కోటి పలుకుతోంది. ఒకపక్క ఎస్టీలు, మరోపక్క ఎస్సీలు తాము సాగు చేసుకుంటున్నామని పోటీపడుతుండగా, ప్రస్తుతం ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు ఈ భూమిపై కన్నేసినట్లు తెలిసింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరి ఇష్టానుసారం వారు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఆ భూమిని చదును చేసి నీటిని పక్కకు మళ్లించేందుకు పైపులను సైతం సిద్ధం చేశారు. ఇప్పటికే కుంట కట్టను సగానికిపైగా ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. దశలవారీగా ఆ కట్టను పూర్తిగా తొలగించే సూచనలు కనిపిస్తున్నాయి. ఆక్రమణదారులు అక్కడకు వెళ్లి పనులు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎవరో ఒకరు ఫిర్యాదు చేస్తే తప్ప స్పందించడం లేదు. గతంలో అనేకసార్లు పలువురు ఆక్రమించేందుకు ప్రయత్నించగా అధికారులు వెళ్లి తాత్కాలికంగా నిలుపుదల చేశారే తప్ప పటిష్ట చర్యలు తీసుకోలేదు. గతంలో కుంట వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును ఆక్రమణదారులు తొలగించినా పట్టించుకోలేదు. ప్రస్తుతం ఎన్నికల తరుణం కావడంతో అధికారుల పట్టించుకోరన్న ఉద్దేశంతో కొందరు ఎంతో విలువైన కుంట భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.



నీరు మళ్లించేందుకు సిద్ధం చేసిన పైపులు



కబ్జాకు ప్రయత్నించిన స్థలం వద్ద మునిసిపాలిటీదంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

## ఈ స్థలం మున్సిపాలిటీది..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

» కబ్జాకు ప్రయత్నించిన ప్రాంతంలో హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు

కనిగిరి, మార్చి 30 : కనిగిరిలో రూ.30కోట్ల విలువైన భూమి కబ్జాపై అధికారులు కదిలారు. ఇది మున్సిపాలిటీ స్థలం అంటూ శనివారం ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం 'రూ.30కోట్ల స్థలం కబ్జాకు పన్నాగం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు స్పందించి కబ్జా చేసేందుకు చదును చేసిన మున్సిపాలిటీ స్థలంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయితే నామమాత్రపు ఫ్లెక్సీ ఎన్ని రోజులు ఉంటుందోనని స్థానికులు అంటున్నారు. ఆ స్థలంలో మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి డాక్టర్ ఉగ్ర ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో శిలాఫలకం వేశారు. దానిని కూడా కబ్జాదారులు ధ్వంసం చేశారు. మరి ఆ శిలాఫలకం సంగతేంటో మున్సిపల్ అధికారులే చెప్పాలి. ఆనవాళ్లుగా ఉన్న శిలాఫలకంతోపాటు, హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కమిషనర్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్, ప్రభుత్వ, పోరంబోకు స్థలాలు వంటివి ఆక్రమించడం చట్టరీత్యా నేరమన్నారు. వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

# కోడ్ ఉల్లంఘిస్తున్నా చర్యలకు వెనుకంజ

» వైసీపీ నేతల అండదండలతో మరింత రెచ్చిపోతున్న వలంటీర్లు
» అనుకూలంగా ప్రచారం చేస్తున్నట్లు ఆధారాలు ఉన్నా పట్టించుకోని వైనం
» మండల స్థాయి అధికారులు తొలగిస్తున్నట్లు ప్రకటిస్తున్నా చర్యలు శూన్యం

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 30 : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, ఒప్పంద ఉద్యోగులు, వలంటీర్లు అధికారపార్టీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నా చర్యలు శూన్యమయ్యాయి. కోడ్ వచ్చిన మొదటి రెండు, మూడు రోజులు కొన్నిచోట్ల మాత్రమే వలంటీర్లపై సత్వర చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత పట్టించుకుంటున్న పరిస్థితి లేకుండాపోయింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలతోపాటు ఒంగోలు కార్పొరేషన్, మార్కాపురం మునిసిపాలిటీ, కనిగిరి, చీమకుర్తి నగరపంచాయతీల్లో పట్టణ, గ్రామ వలంటీర్లు 90శాతం మందికిపైగా అధికార పార్టీ నేతలు చెప్పిన విధంగా నడుచుకుంటున్నారు. తమ గ్రూపుల్లో కాకుండా వ్యక్తిగతంగా వారి పరిధిలోని ప్రజలకు సమాచారం చేరవేస్తూ అధికార పార్టీకి అనుకూలంగా ఓట్లు వేయాలని, లేకుంటే పథకాలు తీసివేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే ఏకంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఆయా నియోజకవర్గాల అభ్యర్థులతో కలిసి ప్రచారంలో ముందుండి పనిచేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా సుమారు 100 మందికిపైగా వలంటీర్లు కోడ్‌ను ఉల్లంఘించి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే కేవలం పదిమందిని మాత్రమే తొలగించారు. ఎక్కడైనా వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులు వస్తే ఆధారాలు లేవంటూ వాటిని తొక్కిపెడుతున్నట్లు సమాచారం. ఇంకోవైపు అధికారపార్టీ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నట్లు ఫొటోలు బహిర్గతమైతే ఆ మరుసటి రోజు వారిని తొలగిస్తున్నట్లు అర్భాటంగా ప్రకటనలు ఇచ్చి ఆతర్వాత పట్టించుకోవడం లేదు. మండల స్థాయిలో తొలగించిన వలంటీర్ల వివరాలపై ఏరోజుకారోజు జిల్లా కేంద్రానికి సమాచారం ఇవ్వాల్సి ఉంది. కానీ ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీంతో వలంటీర్లు బహిరంగంగా అధికారపార్టీ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నా తమకు ఏమీ కాదులే అన్న భరోసాతో మరింత రెచ్చిపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శనివారం వైసీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గిద్దలూరు, మార్కాపురం వైసీపీ అభ్యర్థులు కుందురు నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబులు గిద్దలూరులో నిర్వహించిన ప్రచారంలో శ్రీవివేకానంద జూనియర్ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న సూరా మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. కేఎస్‌పల్లి గ్రామానికి చెందిన వలంటీర్ బొల్లు నవీన్ శుక్రవారం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో సభలో ముందువరుసలో కూర్చుని మద్దతుగా నిలిచాడు.





గిద్దలూరులో వైసీపీ ప్రచారంలో పాల్గొన్న జూనియర్ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి, కేఎస్‌పల్లిలో పాల్గొన్న వలంటీర్ నవీన్

## వైఎస్సార్‌టీఏ నాయకుడు జాలిరెడ్డి సస్పెన్షన్

రాజకీయ సమావేశంలో పాల్గొనడంపై ఈసీ సీరియస్

వివరాలు మెయిన్‌లో..

## ప్రమాదవశాత్తు సచివాలయ ఉద్యోగి మృతి

● భవనంపై నుంచి పడడంతో ఘటన



మార్కాపురం రూరల్, మార్చి 30: ప్రమాద శాత్తు మూండంతస్తుల భవనంపై నుంచి కింద పడి సచివాలయ ఉద్యోగి బేతం మల్లయ్య(35) మృతి చెందిన ఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. మల్లయ్య బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ఓ భవనంలో మూడో అంతస్థులో మల్లయ్య స్నేహితులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. శనివారం తెల్లవారుజామున తాను నివసిస్తున్న మూడవ అంతస్తులోని బాత్రూం వద్ద బట్టలు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన స్నేహితులు స్థానిక జిల్లా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మల్లయ్య పట్టణంలోని 12వ వార్డు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన స్వస్థలం నంద్యాల జిల్లా శ్రీశైలం మండలం పరిధిలోని సున్నిపెంట గ్రామం. ఆయన తండ్రి ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. తల్లి ఒక్కరు మాత్రమే సున్నిపెంటలో ఉంటున్నాడు. సోదరరుడు సచివాలయ సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. ఘటనా స్థలాన్ని పట్టణ ఎస్ఐ అబ్దుల్ రహమాన్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రెవెన్యూ అధికారుల తప్పిదం..!

● రైతుల మధ్య వివాదం ● ఒకరికి ఉన్న భూమి విస్తీర్ణం తగ్గింపు ● మరొకరికి లేని భూమి ఉన్నట్లు నమోదు

అనంతవరం (టంగుటూరు), మార్చి 30 : రెవెన్యూ అధికారులు చేసిన పొరపాటు ఇద్దరు అక్కా రైతుల మధ్య వివాదం సృష్టించింది. లేని భూమి ఉన్నట్లుగా ఇటీవల జరిగిన సర్వేలో చూపించడం ఇందుకు కారణమైంది. ఆలకూరపాడుకు చెందిన రైతు పమిడి చిన్నసుబ్బానాయుడు తన గ్రామానికి చెందిన వాకా అంకిరెడ్డి వద్ద అనంతవరం పంచాయతీలోని సర్వే నెంబర్ 187లో 1.50 ఎకరాల భూమిని 1999లో కొనుగోలు చేశారు. 25 ఏళ్లుగా చినసుబ్బానాయుడు ఆ భూమిలో రొయ్యల చెరువు సాగుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని నెలల క్రితం అనంతవరం పంచాయతీలో భూముల సర్వే జరిగింది. ఆ సమయంలో చినసుబ్బానాయుడు భూమిని తగ్గించి కేవలం 1.17 ఎకరాలుగా నమోదు చేశారు. ఇదేసమయంలో సుబ్బానాయుడుకి పక్కనున్న రైతు వాకా వెంకటేశ్వరరెడ్డి భూమి ఏకంగా 33 సెంట్లు పెరిగింది.

**డ్రైనేజీ కాలువ ఆక్రమణకు యత్నం**

సుబ్బానాయుడు, వెంకటేశ్వరరెడ్డి రొయ్యల చెరువుల మధ్య డ్రైనేజ్ కాలువ ఉంది. దీన్ని సుమారు 20 ఏళ్ల క్రితం చిన్నసుబ్బానాయుడు ఏర్పాటు చేసుకున్నాడు. ఇప్పుడు ఆ డ్రైనేజీలో తనకూ భాగం ఉందని వెంకటేశ్వరరెడ్డి ముందుకొచ్చారు. దీంతో వివాదం ఏర్పడింది. కాలువలో రెండు వైపులా తాను వేయించిన నాపరాళ్లను కూలీల ద్వారా తొలగిస్తున్న వెంకటేశ్వరరెడ్డిపై చిన్నసుబ్బానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువు వద్దకు చేరుకొని ప్రశ్నించడంతో కూలీలు ఆపివేసి వెళ్లిపోయారు. అయితే సమస్య అంతటితో సమసిపోలేదు. ఆలకూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా ఉన్న వెంకటేశ్వరరెడ్డి తన పాఠశాలలో పనిచేసే వారిని చెరువు వద్దకు పంపించి డ్రైనేజీ కాలువలోని నాపరాళ్లను తీసివేయాలని సూచించా రు. వారు వచ్చి కాలువలో మిగిలి ఉన్న నాపరాళ్లను తీసేసి వెళ్లారు. జరిగిన సంఘటనలపై రెండు పర్యాయాలు పోలీస్ స్టేషన్‌లో సుబ్బానాయుడు ఫిర్యాదులు చేశారు. అయినా వారు స్పందించ లేదు.

**రీ సర్వే చేయాలని విజ్ఞప్తి**

తన భూమిని రీసర్వే చేయాలని సుబ్బానాయుడు స్పందనలో అధికారులను కలిసి కోరారు. దీంతో తొలిగా అనంతవరం గ్రామ సచివాలయం సర్వేయర్, ఆతరువాత మండల సర్వేయర్ యలమందరాజు వివాదాస్పద భూమిని సర్వే చేశారు. కాలువంతా చినసుబ్బానాయుడు భూమిలోనే ఉన్నట్లు వారే దగ్గరుండి హద్దురాళ్లు వేయించారు. అయినా సరే వెంకటేశ్వరరెడ్డి పంతం వీడలేదు. వివాదం సద్దుమణగ లేదు. సమస్య తీవ్రం కాకముందే పోలీసుల సాయంతో రెవెన్యూ వారే పరిష్కరించాలని ఆప్రాంత రైతులు కోరుతున్నారు.



సర్వేయర్ వేసిన హద్దురాయి





## నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠ

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 30: మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం నుంచి నూతన ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభమవుతున్నట్లు ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. నాలుగు ప్రాకార గోపురాల కలిశ స్థాపన, నూతన ధ్వజ పునఃప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం వాస్తుహోమం, లక్ష్మీ హయగ్రీ హోమం, మంగళవారం నూతన ధ్వజం, కలిశాలకు వివిధ రకాల పూజలు, బుధవారం మహాసుదర్శన హోమం, లక్ష్మీనారాయణ హోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 4వ తేదీ గురువారం శిఖర ప్రతిష్ఠ, నూతన ధ్వజప్రతిష్ఠ, కుంభ ప్రోక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. గురువారం మధ్యాహ్నం నుంచి నాలుగుమాడ వీధులలో భక్తులకు అన్నప్రసాద వితరణ, శివాలయంలో బ్రాహ్మణ సమారాధన ఉంటాయన్నారు. ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రతి ఇంటి వారు ఆడపడుచులను పిలుచుకుని పసుపు, కుంకుమ, చీరెలు పెట్టాలన్నారు.

**చెన్నయ్య శాంతి కల్యాణం**

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 30: మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి వారికి శాంతి కళ్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణ ఘట్టాలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో గోలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.



ధ్వజస్తంభాన్ని పరిశీలిస్తున్న ఈవో

## వైఎస్సీపీ ప్రచారంలో అటెండర్

గిద్దలూరు టౌన్, మార్చి 30 : ఒంగోలు వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గిద్దలూరు, మార్కాపురం వైసీపీ అభ్యర్థులు కుందురు నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబులు గిద్దలూరులోని సీతారామ కళ్యాణ మండపం ఆవరణలో సభ నిర్వహించారు. ఈ సభలో పట్టణంలోని శ్రీవివేకానంద జూనియర్ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న సూరా మధుసూదన్‌రెడ్డి స్టేజీపైకి ఎక్కి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఆలింగనం చేసుకొని తన మద్దతు వైసీపీకి ఉంటుందని ప్రకటించారు. మీ విజయానికి కృషి చేస్తానని పేర్కొంటూ అక్కడే ఉన్న అభ్యర్థులు అన్నా రాంబాబు, కుందురు నాగార్జునరెడ్డిలతో కూడా చేతులు కలిపి ఫొటోలకు ఫోజులిచ్చాడు. ఇదిలావుండగా కే.ఎస్.పల్లె గ్రామానికి చెందిన వలంటీర్ బొల్లు నవీన్ శుక్రవారం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో సభలో ముందువరుసలో కూర్చుని వైసీపీకి మద్దతుగా నిలిచాడు.

**బెల్ట్‌షాప్ నిర్వహించడంపై చర్యలు**

తర్లుపాడు : మండలంలోని కేతగుడిపి పంచాయతీలోని బుడ్డపల్లెలో మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్న వలంటీర్ తమ్మిశెట్టి నారాయణను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో పి.చంద్రశేఖర్‌రావు తెలిపారు. శుక్రవారం రాత్రి పోలీసు ల దాడుల్లో మద్యం అమ్ముతూ తమ్మిశెట్టి నారాయణ పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు వలంటీర్ విధుల నుంచి తొలగించి నట్లు అయన పేర్కొన్నారు. మండలంలో ఎవరైనా వలంటీర్లు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్చరించారు.

**విధుల నుంచి వలంటీర్ తొలగింపు**

కంభం (అర్ధవీడు) : అర్ధవీడు మండలం కాకర్లలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న బల్లా బాలరాజును విధుల నుంచి తొలగిస్తూ ఎంపీడీవో ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి వ్యతిరేకంగా వైసీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి ఫొటోలు దిగినందుకు సదరు వలంటీర్‌ను విధుల నుంచి తొలగించినట్లు అర్ధవీడు ఎంపీడీవో సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన భాస్కర్‌రెడ్డితో కలిసి ప్రచారంలో ఉన్న ఉన్న ఫొటోలు వైరల్‌గా మారాయి. దీంతో విధుల నుంచి తొలగించాల్సిందిగ ఆర్‌వో నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

## వైభవంగా ఉగ్ర నరసింహస్వామి కల్యాణం

త్రిపురాంతకం, మార్చి 30: మండలంలోని జి.ఉమ్మడివరం గ్రామంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రనరసింహస్వామి ఉత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా లక్ష కుంకుమార్చన, విష్ణుసహస్రనామం, మహామంగళహారతి, తీర్థ ప్రసాదాల పంపిణీ నిర్వహించారు. అనంతరం వేదపండితులు వడ్లమాను ఆత్మానందకుమార్, అవంచ శివకుమార్ అవదాని ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రనరసింహస్వామి వారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**వీరబ్రహ్మేంద్రస్వామివారి విగ్రహ ప్రతిష్ఠ**

పెద్ద దోర్నాల : మండలంలోని కడపరాజుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శ్రీమత్ గణపతి సహిత గోవిందమాంబ సమేతశ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి,భక్త సిద్ధప్పస్వామి, నాగేంద్ర స్వామి, జీవధ్వజ శిఖరకలశ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా వేద పండితులు ఓరుగంటి సీతారామశర్మ పర్యవేక్షణలో గణపతిపూజ, ప్రత్యేక హోమాలు తదితర క్రతువులు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభ, కలశ స్థాపన చేశారు. ఈ వేడుకల్లో ప్రత్యేక ఆహ్వానితులుగా వీరబ్రహ్మేంద్ర స్వామి 7వతరం వారసులు వీరంభట్లయ్య పాల్గొన్నారు. గ్రామప్రజలతో పాటు పరిసర గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని తిలకించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

## మహిళ అరెస్టు

టంగుటూరు, మార్చి 30 : మండలంలోని కారుమంచిలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న చల్లా కోటేశ్వరమ్మను పోలీసులు అరెస్టు చేశారు. ఆమె వద్ద 38 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

**LOST OF PASSPORT**

I **Pokala Nanda Kishore, S/o. Vnekateshwara Rao**, residing at 47-1-4, Chivukulavari street, Ranguthota, Ongole, Prakasam Dt, A.P., I have lost my orizinal Pass Port bearing No : **B2677926** issued dt : 19-09-2000, Hyderabad while I was going from My house to take xerox at Kothapatnam Bus stand center ongole. If anyone found please inform at the above Address. (vide affidavit dated on : 27-03-2024 sworn before Notary P.Venkateswarlu, Ongole.

# టీడీపీ ఆవిర్భావం నుంచే బీసీలకు బలం..!

### జయహో బీసీ సమావేశంలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

కనిగిరి, మార్చి 30 : దశాబ్దాలుగా అణగదొక్కిన బీసీలకు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బలం పెరిగిందని టీడీపీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని శంఖవరం గ్రామంలో శనివారం రాత్రి జయహో బీసీ సమావేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, బీసీ సంఘాల నాయకులు చింతలపూడి తిరుపాలు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ టీడీపీకి బీసీల బలం.. బీసీలకు టీడీపీయే బలమని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో బీసీలకు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి బీసీలపై దౌర్జన్యం, దాడులకు కొనసాగించారని ఉగ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు బీసీల వంతు వచ్చిందని, ఎన్నికల్లో బీసీల బలమేంటో జగన్‌రెడ్డికి చూపించాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా కులవృత్తుల వారిని ఆదరిస్తూనే పేద కుటుం బాల్లో వెలుగు నింపారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో వారి వృత్తులపై దెబ్బకొట్టి వారి జీవనాన్ని కష్టాలు పాల్జేసింది జగన్‌రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ వర్గాలకు ఆదుకుంటమాని చెప్పిన జగన్ బీసీ కార్పొరేషన్‌నే నీరు కార్చేసి ఆయా నిధులన్నీ అనుయాయులుకు అప్పగించి వారి నుంచి తాడేపల్లి ఖజానా నింపుకున్నాడని ఆరోపించారు. నేడు బీసీల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. చేతివృత్తులకు, కులవృత్తులకు ఆదరణ లేకుండా పోయిందన్నారు. ఇసుక బంగారంగా మార్చి బీసీ వర్గాల్లో ఉన్న నిర్మాణదారుల కుటుంబాలను పస్తుల పాల్జేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణరం గం పూర్తిగా కుదేలైందన్నారు. నిర్మాణ రంగంలో ఎక్కువగా ఉన్న బీసీ వర్గాల కుటుంబాలు రోడ్ల పాలయ్యాయన్నారు. పరాయి రాష్ట్రాల్లో పనుల కోసం పరుగులు పెట్టాల్సిన దుస్థితికి తీసుకువచ్చిన జగన్ మాటలను మళ్లీ నమ్ముతారా అంటూ డాక్టర్ ఉగ్ర బీసీలను ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టకపోతే జగన్ అధికారంలోకి రాష్ట్రానికి పాడె కట్టేందుకు ఏమాత్రం వెనుకారన్నా రు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా ఐక్యంగా కదలాలన్నారు. బీసీ వర్గాలకు చెందిన నాయకులు డాక్టర్ ఉగ్రను వచ్చే ఎనికల్లో గెలిపించుకుంటామంటూనే చంద్రబాబు పక్షమే బీసీల పక్షమని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు డీ శివకాశయ్య, పల్లా మాలకొండరావు, చింతలపూడి తిరుపాలు, చిలకపాటి లక్ష్మయ్య, కేవిఎస్‌గౌడ్, సిద్ధాంతి బారాయిమాం, యలమంద, శంఖవరం బారాయిమాం, ఏనుగు శ్రీనివాసులురెడ్డి, అహ్మద్, గిఫ్ట్ ఆర్టికల్స్ కొండలు యాదవ్, కాసుల శ్రీరాంయాదవ్, పెన్నా చిన నాగయ్యయాదవ్, నాయకులు తమ్మినేని వెంకటరెడ్డి, జైభీం నాయకులు సూరే రాజు, తెలుగు మహిళలు షేక్ వాజిదాబేగం, కే నీరజ, తులసి, అమ్ములమ్మ, దొరసాని, స్వప్న, వెంకటలక్షమ్మ, ధనలక్ష్మీ, కరిమున్నీసా, నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర


ఉమ్మనపల్లిలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేస్తున్న ఎస్టీఆర్

### కనిగిరిని ఉపాధికి కేంద్రంగా చేయడమే లక్ష్యం..!

- డాక్టర్ ఉగ్రను ఆదరించి గెలిపించండి
- హనుమంతునిపాడు, కనిగిరిలో శ్రేణుల ఇంటింటి ప్రచారం

కనిగిరి : కనిగిరిని ఉపాధికి కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా డాక్టర్ ఉగ్ర పటిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని, ఆయనను ఆదరించి వచ్చే ఎన్నికల్లో గెలించాలని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని వాగుపల్లి గ్రామంలో టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై, డాక్టర్ ఉగ్ర కనిగిరి ప్రాంతాభివృద్ధికి ఎంచుకున్న ప్రణాళికలపై శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనతో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర ప్రగతి మళ్లీ గాడిలో పడుతుందన్నారు. వైసీపీ ఐదేళ్లపాలనలో నిత్యావసర దరలు పెంపుతో పాటు పేదల భూములు ఆక్రమణలు, కబ్జాలకు పాల్పడ్డారన్నారు. పథకాల పేరుతో జనాలకు డబ్బులు మళ్లించి అన్నింటిపై విపరీతంగా ధరలు పెంచేసి తిరిగి వివిధ రూపాల్లో జగన్ జనం సొమ్ము గుంజాడన్నారు. టీడిపి అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి ఏడాదికి 3గ్యాస్ సిలిండర్‌లను ఉచితంగా ఇవ్వడంతో పాటు ఇంటిలో చదువుకున్న ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు చంద్రబాబు ఇస్తారన్నారు. ప్రతి పేదింట విద్యా కుసుమాలను తయారు చేయాలన్నదే చంద్రబాబు ఆకాంక్ష అన్నారు. కనిగిరి ప్రాంతంలో తాగు, సాగునీటి ఇక్కట్లు శాశ్వతంగా పరిష్కరించేందుకు ఉగ్ర కంకణ బద్ధుడై ఉన్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కనిగిరి ప్రాంతానికి తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తారన్నారు. వలసల నివారణకు కనిగిరి ప్రాంతానికి చెందిన బడా పారిశ్రామికవేత్తలకు కంపెనీలు పెట్టుకునేందుకు అవకాశం కల్పించడంతోపాటు పారిశ్రామికంగా కనిగిరి అభివృద్ధి చేస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యమంలో టీడిపి నాయకులు సైకం మాలకొండారెడ్డి, సిద్దాటపు వెంకటరెడ్డి, నాయకులు, గ్రామపార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్‌లు పాల్గొన్నారు.

**హనుమంతునిపాడు మండలంలో**

ఉమ్మనపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించడంలో భాగంగా మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిన నాయకుడు చంద్రబాబు ఒక్కరే అన్నారు. కనిగిరి ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి జరగాలంటే డాక్టర్ ఉగ్రను మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, మాజీ అధ్యక్షుడు గాయం తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, చావలి చినవెంకటేశ్వర్లు, మువ్వారంగసాయి, చీకటి వెంకటసుబ్బయ్య, తాతపూడి స్టాలిన్ (బుజ్జి), దేవిరెడ్డి రాజారామిరెడ్డి, జట్టుబోయిన వెంకటేశ్వర్లు, డీలర్ వెంకటేశ్వర్లు, చిన్నకోటయ్య, బలరాం, తిమోతి, సుమిత్ర, ఇరుపతిరెడ్డి, జనసేన నాయకులు ఆకుపాటి వెంకటరావు పాల్గొన్నారు.


ఆకుపాటికి డాక్టరేట్‌ను అందిస్తున్న వర్సిటీ ప్రతినిధులు

## ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటికి డాక్టరేట్

పామూరు, మార్చి 30 : పామూరు ఎంపీటీసీ సభ్యులు ఆకుపాటి వెంకటేష్‌కు ప్రతిష్ఠాత్మకమైన ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చి యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ వరించింది. తమిళనాడులోని హోసూర్ వర్సిటీలో ఏర్పాటు చేసిన సామాజిక సేవా విభాగంలో ఆకుపాటికి గౌరవ డాక్టరేట్‌ను, జ్ఞాపిక, డాలర్‌ను ప్రదానం చేశారు. అనంతరం ఆయన్ని ఘనంగా సన్మానించారు. సామాజిక సేవలో ఆకుపాటి సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందన్నారు. దేవాలయాలు, మసీద్, చర్చిలకు వాటర్ ఫ్రిజ్‌ల బహూకరణ, రక్తదాన శిబిరాలు, కరోనా సమయంలో మాస్కులు, శానిటైజర్లు, సోపుల పంపిణీ, పేదలకు బియ్యం, నిత్యావసారాలను ఆకుపాటి అందజేశారని గుర్తుచేశారు.

## సువర్ణబాబు సేవలు మరువలేనివి


సువర్ణబాబు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

దొనకొండ, మార్చి 30 : విద్యార్థి దశ నుంచే ఉద్యోగ విరమణ వరకూ బుద్ధుని ఆశయాలను, భారత రాజ్యాంగాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ ఎంతో మంది విద్యార్థులను నిత్యసత్యాలవైపు నడిపిన ఉపాధ్యాయుడు సువర్ణబాబు అని బహుజనుల ఉద్యోగ సంఘ దర్శి నియోజకవర్గ ప్రతినిధి అట్లూరి రామారావు తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఎండిట్‌గా పనిచేస్తున్న పాలేటి సువర్ణబాబు ఉద్యోగ విరమణ సభ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వివి రామాంజనేయులు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎంఈవో షేక్ అమీర్, అట్లూరి రామారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా సువర్ణబాబు 62 సంవత్సరాల్లో బహుజన దృక్పథంతో అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా బోధన సాగించారని కొనియాడారు. అనంతరం సువర్ణబాబు దంపతులను బహుజన ఉద్యోగులు, నాయకులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దొంగతనంగా ట్రాక్టర్ల విక్రయం

### దర్శి పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఆరు వాహనాలు


పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ట్రాక్టర్లు

దర్శి మార్చి 30 : దొంగ ట్రాక్టర్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రాయలసీమకు చెందిన కొంతమంది వ్యక్తులు అక్కడి ట్రాక్టర్లను ఏజెంట్ల ద్వారా దర్శి ప్రాంత రైతులకు విక్రయించారు. అక్కడ రైతుల వద్ద ట్రాక్టర్లను మోసగాళ్లు ఫ్యాక్టరీల్లో పనికి పెట్టిస్తామని ఆశచూపి ట్రాక్టర్లను వారు తీసుకొని ఇక్కడ రైతులకు తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్కడ ట్రాక్టర్లను ఫ్యాక్టరీలో పనికి పెట్టినందుకు నెలకు రూ.25వేలు బాడుగ చెల్లిస్తామని చెప్పి అక్కడి రైతులను నమ్మించి ట్రాక్టర్లను మోసగాళ్లు తీసుకుంటున్నారు. ఒకటి రెండు నెలలు నమ్మకంగా వారికి రూ.25 వేలు చొప్పున బాడుగ చెల్లిస్తున్నారు. ఇక తమకు ఇబ్బంది లేదని ఆ రైతులు ట్రాక్టర్లు వదిలేసిన క్రమంలో ఆ ట్రాక్టర్లను ఇక్కడి రైతులకు అతితక్కువకు రూ.2లక్షలకే విక్రయిస్తున్నారు. ఇక్కడి రైతులు ఇంత తక్కువగా ఎలా వస్తుందనే ఆలోచన లేకుండా కొంతమంది కొనుగోలు చేశారు. అక్కడ బాడుగకు ఇచ్చిన కొందరు రైతులకు అనుమానం వచ్చి తమ ట్రాక్టర్లు ఏ ఫ్యాక్టరీలో పెట్టారనే విషయమై వాకబు చేయగా అసలు విషయం బయటపడింది. సత్యసాయి జిల్లా, తాడిమర్రు మండలానికి చెందిన ఎనిమిది ట్రాక్టర్లను అక్రమార్కులు దర్శి ప్రాంత రైతులకు విక్రయించినట్లు తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాడిమర్రు పోలీసులు శనివారం దర్శికి వచ్చి ఈ ప్రాంతంలో విక్రయించిన ఆరు ట్రాక్టర్లను పట్టుకొని దర్శి పోలీస్‌స్టేషన్ వద్దకు తరలించారు. ఇంకా రెండు ట్రాక్టర్లు పట్టుకునేందుకు గాలిస్తున్నారు. కడప, ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన కొంతమంది మాయగాళ్ల ఎలాంటి పెట్టుబడులు లేకుండా రైతులను నమ్మించి ట్రాక్టర్లు తీసుకొని దొంగతనంగా విక్రయించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ముఠా ఇంకా అనేక ప్రాంతాల్లో ట్రాక్టర్లను విక్రయించి ఉండవచ్చని భావిస్తున్నారు. పూర్తి స్థాయిలో విచారిస్తే ట్రాక్టర్ల అక్రమ వ్యాపారం గుట్టు రట్టు అవుతుంది.

## ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

పీసీపల్లి, మార్చి 30 : త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యమని కనిగిరి సీఐ డీ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదఅలవలపాడు, పెదయిర్లపాడు గ్రామాల్లో శనివారం కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో ఆయన మాట్లాడారు. ఎవరైనా భయపెట్టినా, ప్రభావితం చేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. మండలానికి స్థానిక పోలీసులతో పాటు 20మంది కేంద్ర బలగాలను కేటాయించినట్లు చెప్పారు. రెండు, మూడుకు మించి కేసులు నమోదైతే రౌడీషీట్‌లు తెరుస్తామని చెప్పారు. గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడవద్దని తెలిపారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వరరావు, పీసీపల్లి ఎస్సై రమేష్‌బాబు, సి బ్బంది ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పామూరు, మార్చి 31 : మండలంలోని నుచ్చుపొద గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన షేక్ చాంద్‌బాషా (45) మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జరిగింది. పామూరు ఎస్ఐ ఎం.సైదుబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన షేక్ చాంద్‌బాషా, మధు, సుగుణరావు ముగ్గురూ మోటర్‌బైక్‌పై బయలు దేరారు. నుచ్చుపొద సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద సింగరాయకొండ - మైదుకూరు జాతీయ రహదారి రోడ్డు పనులు జరుగుతున్నాయి. రోడ్డు గతుకుల కారణంగా కుడిచేతి వైపు వెళుతుండగా బొట్లగూడూరు నుంచి ఎదురుగా వస్తున్న వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై మధ్యలో కూర్చొన్న చాంద్‌బాషా కిందపడి తలకు గాయాలై మృతిచెందారు. వెనుకకూర్చున్న సుగుణరావు కాలికి గాయంకాగా, బైక్ నడుపుతున్న మధుకు గాయాలు కాలేదు. బాషాకు భార్య ఇద్దరుపిల్లలున్నారు. బాషా సైకిల్‌కు పంక్చర్‌లు వేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.

# టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాపారావు, డాక్టర్ లలితసాగర్**


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు

దర్శి, మార్చి 30 : తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా అందరూ సమిష్టిగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు కోరారు. దర్శిలో శనివారం టీడీపీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ లలితసాగర్ ఆధ్వర్యంలో కూటమి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు కుటుంబంతో తమకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. 1997 ఉపఎన్నికలో తన గెలుపు కోసం హనుమంతరావు కృషిని మరువలేనన్నారు. డాక్టర్ లక్ష్మి తండ్రి నర్సయ్య తనకు ప్రాణ మిత్రులన్నారు. మా ఇద్దరం కలిసి శాసనసభ్యులుగా పనిచేశామని గత అనుభవాలను పాపారావు గుర్తు చేసుకున్నారు. దర్శిలో టీడీపీ ప్రభంజనం సృష్టిస్తుందని, డాక్టర్ లక్ష్మి, ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. డాక్టర్ లలితసాగర్ మా ట్లాడుతూ దర్శి నియోజకవర్గ ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తామన్నారు. ఇరు కుటుంబాలు సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగి ఉన్నాయన్నారు. ప్రజలు తమను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దర్శి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు మండలాల పార్టీ అధ్యక్షుడు చిట్టె వెంకటేశ్వర్లు, నాగులపాటి శివకోటేశ్వరరావు, పిడతల నెమలయ్య, కూరపాటి శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యా దగిరి వాసు, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు జీ స్టీవెన్, తలారి కోటయ్య మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, నాయకులు గొర్రె సుబ్బారెడ్డి, మారెళ్ల వెంకటేశ్వర్లు, వరగాని పౌలు, తెల్లయ్య, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాడపాకుల శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు టీ నారాయణరెడ్డి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దొనకొండలో సంబరాలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

**డాక్టర్ లక్ష్మి అభ్యర్థిత్వంపై హర్షం**

దర్శి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేరు ఖరారు చేయడంపై టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు మనవరాలు అని తెలియడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆమె కుటుంబ రాజకీయ చరిత్ర తెలిసిన తర్వాత టీడీపీ కేడర్‌లో జోష్ పెరిగింది. మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు 1997 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో అప్పటి టీడీపీ అభ్యర్థి పాపారావు విజయం కోసం నెలరోజులు పాటు ఇక్కడే ఉండి అంతా తానై కృషి చేశారు. అన్ని గ్రామాలు తిరిగి విజయంలో కీలక పాత్ర పోషించారని చేసుకున్నారు. అభ్యర్థి లక్ష్మిని పలు గ్రామాల ప్రజలు కలిసి శుభాకాంక్షలు చెప్పారు. అభ్యర్థి ప్రకటనతో శ్రేణులు ప్రచారానికి సిద్ధమయ్యారు.

**దొనకొండలో సంబరాలు**

దొనకొండ, మార్చి 30 : దర్శి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ లక్ష్మి పేరును పార్టీ అధిష్ఠానం ప్రకటించడంపై మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు శుక్రవారం రాత్రి సంబరాలు నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లోని ప్రధాన రహదారిపై బాణసంచాకాల్చుతూ, జై తెలుగుదేశం, చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశా రు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శివకోటేశ్వరరా వు మాట్లాడుతూ అభ్యర్థి డాక్టర్ లక్ష్మి విజయానికి గ్రామాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి విజయం సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, నాయకులు కొత్తం రఘునాథరెడ్డి విప్పర్ల లక్ష్మీరావు, మన్నెం గాలయ్య, కొమ్మతోటి సుబ్బారావు, పత్తి వెంకటేశ్వర్లు, యరగొర్ల బసవయ్య, శృంగారపు నాగసుబ్బారెడ్డి, దుగ్గెంపూడి చెంచయ్య, కమ్మా వెంకటనారాయణ, అంకాల మల్లికార్జున(మల్లి), కే లక్ష్మణ్‌సీతాపతి, పోతిపోగు చెన్నయ్య, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి డాక్టర్ లక్ష్మి ఎంపికపట్ల మండల పార్టీ రెండోవర్గం నాయకులు పార్టీ కార్యాలయంలో శనివారం బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. సుదీర్ఘ రాజకీయ చ రిత్ర కలిగిన కుటుంబానికి చెందిన వ్యక్తి, విద్యావేత్త డాక్టర్ లక్ష్మిని ఎంపిక చేయడం విజయానికి సంకేతమన్నారు. ఆమె గెలుపున కు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, కామేపల్లి నారాయణమ్మ, వల్లపునేని ఆదినారాయణ, సింగమనేని హనుమంతు, ఫణిదపు వీరాంజనేయులు, వైకే చౌదరి, విప్పర్ల శేషు, విప్పర్ల వెంకటేశ్వర్లు, బోయపాటి సుబ్బయ్య పాల్గొన్నారు.

**డాక్టర్ లక్ష్మికి అభినందనలు**

ముండ్లమూరు, మార్చి 30 : దర్శి నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని శనివారం మండలంలోని మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు తనయుడు మాధవ్, కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని బసవాపురం గ్రామానికి చెందిన నాయకుడు కట్టా చిన వెంకంబొట్లు, మరికొన్ని గ్రామాలకు చెందిన నాయకులు ఆమెను నరసరావుపేట వెళ్ళి స్వగృహంలో కలసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను తన తాత స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు, తన తండ్రి గొట్టిపాటి నరసయ్య ఆశయాలతో రాజకీయాల్లోకి వచ్చి దర్శి నియోజక వర్గం నుంచి పోటీ చేయటం జరుగుతుందని, తమ కుటుంబం నుంచి 40 సంవత్సరాల నుంచే రాజకీయాల్లో ఉందని, కొంత మంది స్థానికురాలు కాదని దుష్ప్రచారం చేస్తున్నారని, ఆ ప్రసారం చేసే వారు కూడా దర్శికి చెందిన వారు కాదని గుర్తుంచు కోవాలని ఆమెను కలసిన నాయకులతో చెప్పారు. తన గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు తాను అండగా నిలబడతానని హామి ఇచ్చారు. తన తాత ఒక వైపు, మామ కడియాల వెంకటేశ్వరరావు ఎప్పటి నుంచే టీడీపీ పార్టీని అంటిపెట్టుకున్న విషయం ప్రతి ఒక్కరికీ తెలుసు అన్నారు. అనంతరం ఆమెను దుశ్శాలువాలతో, బొకేలతో ఘనంగా సన్మానించారు.


డాక్టర్ లక్ష్మిని కలసి అభినందిస్తున్న టీడీపీ నాయకులు

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు

పామూరు, మార్చి 30 : ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో జనరల్‌బాడీ సమావేశం ఎంపీడీవో పీ పుట్టారెడ్డి అధ్యక్షతన శనివారం జరిగింది. అనుకొన్న సమయానికి సభ్యులు రాకపోవడంతో గంట ఆలస్యంగా సమావేశం మొదలైంది. నూతనంగా వచ్చిన ఎంపీడీవో పుట్టారెడ్డి ని సభకు పరిచయం చేశారు. కోడ్ ఉన్నందున అజెండా లేకుండా కేవలం నీటి సమస్యపైనే చర్చించి ముగించారు. చేతిపంపులను బాగుచేయించాలని ఎంపీపీ సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గంధం ఏసురత్నం, అధికారులు పాల్గొన్నారు.

# వెలిగొండను గాలికొదిలేసిన వైసీపీ

● ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ● వై.పాలెంలో పర్యటన ● టీడీపీలో పలువురి చేరిక



టీడీపీ కండువ కప్పుకున్న మిరియంపల్లి సర్పంచ్ రావిళ్ల సుధాకర్

పుల్లలచెరువు, మార్చి 30: పశ్చిమ ప్రాంత ప్రజలతో ఓట్లు వేయించుకొని వైసీపీ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టును గాలికి వదిలేసి రైతుల ఆశలపై నీళ్లు చల్లిందని, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం ఎర్రగొండపాలెం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా వై.పాలెం నియోజకవర్గ అభ్యర్థి గుడూరి ఎరిక్షన్‌బాబు ఆధర్యంలో భారీగజమాలను వేసి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీస అభివృద్ధి జరుగలేదన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నీరు వస్తుందని రైతులు, ఈ ప్రాంత ప్రజలు కళ్లకు ఒత్తులేసుకొని ఎదురు చూశారన్నారు. వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని అన్నారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని టీడీపీ పాలనలో వెలిగొండను పూర్తిచేసి వెలిగొండ జీవోపై సంతకం చేసేది చంద్రబాబు అని స్పష్టం చేశారు.తన కుటంబం విలువలతో కూడిన రాజకీయాలు చేస్తోందన్నారు. జిల్లాలో వైసీపీ నుంచి నిత్యం టీడీపీలో చేరికలు వున్నాయన్నారు. ఇంకా పెద్ద ఏత్తున టీడీపీలో చేరాలని అన్నారు. గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలు పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయ ఢంకా మోగిస్తుందన్నారు. కూటమి తరపున 150 సీట్లతో చంద్రబాబు సీఎం అవుతారని అన్నారు. కూటమిలో భాగస్వాములైన జనసేన. బీజేపీ కార్యకర్తలు కలిసి కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామని అన్నారు. వైపాలెం నియోజకవర్గ అభ్యర్థి గుడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో అవినీతి తప్ప అభివృద్ధి లేదన్నారు. వెలిగొండను గాలికి వదిలేసి పూర్తి చేశామని గొప్పగా చెప్పుకుంటుందని అన్నారు. నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. గ్రామాల్లో నీటి సమస్య వేధిస్తున్నా, వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని అన్నారు.

**టీడీపీలోకి వలసలు**

అనంతరం మిరియంపల్లి సర్పంచి రావిళ్ల సుధాకర్ ఆధ్వర్యంలో 30 కుటుంబాలు కవలకుంట్లలో 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి, వైపాలెం నియోజకవర్గ అభ్యర్థి గుడూరి ఎరిక్షన్‌బాబులు వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. మండలంలోని పాతచెరువు తండా నుంచి పది కుటుంబాలు, ఐటీవరం నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఐటీవరం మాజీ సర్పంచ్ సుశీల కుమారి పార్టీలో చేరారు. అనంతరం మాగుంట విలేకర్ల సమావేశం నిర్వహించారు. మూడేళ్లగా నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు గమనిస్తున్నానని, ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో టీడీపీ బలపడిందన్నారు. ఇక్కడ ఆయన గెలుపు నల్లేరుమీద నడకేనన్నారు. తన గెలుపునకు కూడా ఇక్కడి నుంచే బాటలు పడనున్నాయన్నారు. కార్యక్రమంలో జేడీ్పీ మాజీ ఉపాధ్యక్షులు డాక్టరు మన్నె రవీంద్ర, టీడీపీ మండలాధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, పయ్యావుల ప్రసాద్, మేకల వలరాజు, మెట్టు గోవిందు రెడ్డి, టీడీపీ ముఖ్య నాయకులు కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, ఆళ్ల నాసర్ రెడ్డి కామేపల్లి వెంకటేశ్వర్లు, మంత్రునాయక్, చట్యాల వెంగల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మార్కాపురంలో విలేకర్లతో మాట్లాడుతున్న మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాఘవరెడ్డి, కందుల నారాయణరెడ్డిలు

**మార్కాపురం నియోజకవర్గంలో..**

మార్కాపురం : ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని 16వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యువనాయకుడు మాగుంట రాఘవరెడ్డిలు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో ధనంకుల హరిబాబు, చిన్నబోయిన వెంకటేశ్వర్లు, పంట చిన్న సుబ్బారావులతో పాటు మరో 50 కుటుంబాల వారు టీడీపీలో చేరారు.

**నియోజకవర్గంలో విజయకేతనం ఎగురవేయాలి**

మార్కాపురం : ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ విజయకేతనం ఎగురవేసేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం కార్యకర్తలతో మాట్లాడారు. ఇటీవల వైసీపీలో నుంచి టీడీపీలో చేరిన కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నేతృత్వంలోని టీడీపీతోనే రాష్ట్రంలో సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతినాయకుడు, కార్యకర్త టీడీపీ అభ్యర్థుల విజయం కోసం సైనికుడిలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువనాయకుడు మాగుంట రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందులనారాయణరెడ్డి, టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వెంకట సత్యనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు మార్కాపురంలో ప్రజాగళం

**హాజరు కానున్న టీడీపీ అధినేత చంద్రబాబు**

మార్కాపురం, మార్చి 30: టీడీపీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ప్రజాగళం సభ ఆదివారం మధ్యాహ్నం మార్కాపురంలో జరగనుంది. 2024 ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆయన ప్రజాగళం సభల్లో పాల్గొంటున్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు మార్కాపురంలోని సాయిబాలాజీ స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలీపాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి గడియారస్తంభం వరకూ రోడ్ షో నిర్వహిస్తారు. అక్కడ జరిగే ప్రజాగళం బహిరంగ సభలో మాట్లాడతారు. ప్రజాగళం సభను విజయవంతం చేసేందుకు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు.

## ప్రమాదవశాత్తు సచివాలయ ఉద్యోగి మృతి

● భవనంపై నుంచి పడడంతో ఘటన



భవనంపైనుంచి పడిన మల్లయ్య, మల్లయ్య (ఫైల్)

మార్కాపురం రూరల్, మార్చి 30: ప్రమాదశాత్తు మూండంతస్తుల భవనంపై నుంచి కింద పడి సచివాలయ ఉద్యోగి బేతం మల్లయ్య(35) మృతి చెందిన ఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. మల్లయ్య బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ఓ భవనంలో మూడో అంతస్థులో మల్లయ్య స్నేహితులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. శనివారం తెల్లవారుజామున తాను నివసిస్తున్న మూడవ అంతస్తులోని బాత్రూం వద్ద బట్టలు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన స్నేహితులు స్థానిక జిల్లా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మల్లయ్య పట్టణంలోని 12వ వార్డు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన స్వస్థలం నంద్యాల జిల్లా శ్రీశైలం మండలం పరిధిలోని సున్నిపెంట గ్రామం. ఆయన తండ్రి ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. తల్లి ఒక్కరు మాత్రమే సున్నిపెంటలో ఉంటున్నాడు. సోదరరుడు సచివాలయ సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. ఘటనా స్థలాన్ని పట్టణ ఎస్ఐ అబ్దుల్ రహమాన్ పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం స్థానిక జిల్లా వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## చెక్‌పోస్టు వద్ద తనిఖీ



తనిఖీ చేస్తున్న రిటర్నింగ్ అధికారి

గిద్దలూరు, మార్చి 30 : ప్రకాశం-నంద్యాల జిల్లాల సరిహద్దుల్లోని దిగువమెట్టలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి.నాగజ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, తనిఖీ చేసే సమయంలో వీడియో తీయాలని, తనిఖీని పారదర్శకంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి వెంట తహసీల్దార్ సిద్దార్థ, ఎస్ఎస్‌టీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మేనేజర్ భద్రీనాథ్

కంభం (అర్ధవీడు), మార్చి 30 : అర్ధవీడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మామిళ్ల నాగరత్నమ్మ (35) గత ఏడాది డిసెంబరు 17న ప్రమాదవశాత్తు బైక్ పై నుండి పడి మృతిచెందారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో నాగరత్నమ్మకు బీమా ఉండడంతో భర్త మామిళ్ల కేశవరెడ్డికి రూ.4లక్షల బీమా చెక్కును అందచేశారు. మేనేజర్ భద్రీనాథ్ మాట్లాడుతూ పీఎంఎస్‌బీవై కింద రూ.20, పీఎంజేజేబీవై కింద రూ.436 రూపాయలు బీమా చేసి ఉండడంతో రూ.4లక్షల చెక్కును మృతురాలి కుటుంబసభ్యులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మణికంఠ, క్యాషియర్ కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

## సీఆర్‌పీఎఫ్ బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న బలగాలు

పెద్ద దోర్నాల, మార్చి 30: మండలంలోని నల్లగుంట్ల, ఎగువ చెర్లోపల్లి, యడవల్లి గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలు శనివారం కవాతు నిర్వహించాయి. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎస్సై అంకమరావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు.

# అశోక్‌రెడ్డిని మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించండి

**ఇంటింటి ప్రచారంలో పుష్పలీల**



కరపత్రం అందజేస్తున్న ముత్తుముల సుశీల

గిద్దలూరు టౌన్, మార్చి 30 : స్థానికుడైన టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోకొరెడ్డిని మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించి గెలిపించాలని అశోకొరెడ్డి భార్య ముత్తుముల పుష్పలీల అన్నారు. శనివారం ఆమె పట్టణంలోని నల్లబండ బజారులోని చిన్నమసీదు రోడ్డు, ఇరిగేషన్ కాలువలైన్, సెయింట్‌పాల్స్ ప్రాంతంలో రెండవరోజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాల వలన ఏ విధంగా లబ్ది చేకూరుతుందో వివరిస్తున్నారు. మహిళలు పుష్పలీలకు ఎదురెళ్లి స్వాగతం పలుకుతున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థిగా ముత్తుముల అశోకొరెడ్డి పోటీ చేయనున్నారన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. మీకు ఏ సమస్య వచ్చినా గిద్దలూరు పట్టణంలోనే ఎళ్ళవేళలా అందుబాటులో ఉంటారని ఆమె ఓటర్లకు వివరించారు. గిద్దలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే అశోక్ రెడ్డి లక్ష్యమన్నారు. అసెంబ్లీ అభ్యర్థిగా ముత్తుముల అశోకొరెడ్డిని, పార్లమెంటు అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డిలను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రచార కార్యక్రమంలో బీజేపీ నాయకులు పిడతల సరస్వతి, టీడీపీ నాయకులు షేక్ పెద్దమస్తాన్, షేక్ పెద్దభాషా, చింతలపూడి బాలరాజు, పిడతల రవితేజ, కౌన్సిలర్ పాలుగుళ్ల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్, మార్చి 30 : టీడీపీ గెలుపు, గ్రామాల అభివృద్ధికి ములుపు అని గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోకొరెడ్డి అన్నారు. బేస్తవారపేట మండలం జేసీ.అగ్రహారం, మల్లాపురం గ్రామాలకు చెందిన 150 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికీ ముత్తుముల అశోకొరెడ్డి పచ్చకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోకొరెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే పశ్చిమ ప్రకాశం అభివృద్ధి కోసం మర్కాపురాన్ని చంద్రబాబునాయుడు ప్రత్యేక జిల్లాగా మారుస్తానని హామీ ఇచ్చారు. మార్కాపురం జిల్లా కేంద్రం కావడంతో దూరం తగ్గి ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో పాపిజెన్ని చంద్రశేఖర్, దప్పిలి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ మంత్రి నాగరాజు, దేరెడ్డి వెంకటేశ్వర్లు, మార్క్ సుబ్బారెడ్డి, దొడ్డి పెద్దసుబ్బారెడ్డి, గోపాల్‌నాయక్, పాశం చిన్నవెంకటస్వామి, బి.ఆవులయ్య, బాలగురువయ్య, తిప్పరాజు, నాగభూషణం, మల్లాపురంకు చెందిన గంగిరెద్దుల కాలనీవాసులైన తిరుమల పెద్దనాగయ్య అరవ బాలయ్య, తిరుమల అంకాలు, తిరుమల పెద్దఆంజనేయులు, గాదం పెద్దబాలయ్యతోపాటు మండల పార్టీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు పూనూరు భూపాల్‌రెడ్డి, పూనూరు జగన్‌మోహన్‌రెడ్డి, మేడం భాస్కర్‌రెడ్డి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభాన్ని పరిశీలిస్తున్న ఈవో

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 30: మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం నుంచి నూతన ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభమవుతున్నట్లు ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. నాలుగు ప్రాకార గోపురాల కలిశ స్థాపన, నూతన ధ్వజ పునఃప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం వాస్తుహోమం, లక్ష్మీ హయగ్రీ హోమం, మంగళవారం నూతన ధ్వజం, కలిశాలకు వివిధ రకాల పూజలు, బుధవారం మహాసుదర్శన హోమం, లక్ష్మీనారాయణ హోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 4వ తేదీ గురువారం శిఖర ప్రతిష్ఠ, నూతన ధ్వజప్రతిష్ఠ, కుంభ ప్రోక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గురువారం మధ్యాహ్నం నుంచి నాలుగుమాడ వీధులలో భక్తులకు అన్నప్రసాద వితరణ, శివాలయంలో బ్రాహ్మణ సమారాధన ఉంటాయన్నారు. ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రతి ఇంటి వారు ఆడపడుచులను పిలుచుకుని పసుపు, కుంకుమ, చీరెలు పెట్టాలన్నారు.



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**చెన్నయ్య శాంతి కల్యాణం**

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 30: మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి వారికి శాంతి కళ్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణ ఘట్టాలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో గోలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

# వైభవంగా ఉగ్ర నరసింహస్వామి కల్యాణం



కళ్యాణ వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రనరసింహస్వామి, హాజరైన భక్తులు

త్రిపురాంతకం, మార్చి 30: మండలంలోని జి.ఉమ్మడివరం గ్రామంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రనరసింహస్వామి ఉత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా లక్ష కుంకుమార్చన, విష్ణుసహస్రనామం, మహామంగళహారతి, తీర్థ ప్రసాదాల పంపిణీ నిర్వహించారు. అనంతరం వేదపండితులు వడ్లమాను ఆత్మానందకుమార్, అవంచ శివకుమార్ అవదాని ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రనరసింహస్వామి వారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చరణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు.



వీరబ్రహ్మేంద్రస్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**వీరబ్రహ్మేంద్రస్వామివారి విగ్రహ ప్రతిష్ఠ**

పెద్ద దోర్నాల : మండలంలోని కడపరాజుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శ్రీమత్ గణపతి సహిత గోవిందమాంబ సమేతశ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి,భక్త సిద్ధప్పస్వామి, నాగేంద్ర స్వామి, జీవధ్వజ శిఖరకలశ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా వేద పండితులు ఓరుగంటి సీతారామశర్మ పర్యవేక్షణలో గణపతిపూజ, ప్రత్యేక హోమాలు తదితర క్రతువులు నిర్వహిం చారు. అనంతరం ధ్వజస్తంభ, కలశ స్థాపన చేశారు. ఈ వేడుకల్లో ప్రత్యేక ఆహ్వానితులుగా వీరబ్రహ్మేంద్ర స్వామి 7వతరం వారసులు వీరంభట్లయ్య పాల్గొన్నారు. గ్రామప్రజలతో పాటు పరిసర గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని తిలకించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# చెన్నులపల్లెలో అగ్ని ప్రమాదం

**నాలుగు గృహాలు దగ్ధం**



చెన్నుపల్లెలో అగ్నికి అహుతైన గృహాలు

బేస్తవారపేట, మార్చి30: బేస్తవారపేట మండలంలోని గలిజేరుగుళ్ల గ్రామ పంచాయతీలోని చెన్నుపల్లె గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు గృహాలు అగ్నికి అహుతైనాయి.ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఒక ఇంటి ఆవరణలో ఉన్న ద్వీచక్ర వాహనం బ్యాటరీ వైర్లు షార్ట్ సర్క్యూట్ అయి అకస్మాత్తుగా మంటలు చెలరేగటంతో సమీపంలోని పూరి గూడిసెలు,మోటార్ సైకిల్ దగ్ధమైనాయి.మంటలు అదుపు చేసేందుకు గ్రామస్థులు బిందెలతో నీటిని తీసుకెళ్ళి చల్లిన మంటలను అదుపులోకి తీసుకోలేకపోయినారు.సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది గంట తరువాత వచ్చిన కంభం ఫైర్ స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారు.అప్పటికే నాలుగు పూరిగూడిసేలు అగ్నికి అహుతైనాయి. గ్రామానికి చెందిన లక్కంనేని లింగయ్య,టేగలపెంట లింగయ్య, పొగుళ్ళ బుచ్చయ్యలకు చెందిన గృహాలు దగ్ధమైనాయి. దీంతో సుమారు రూ.4లక్షలు అస్తి నష్టం సంభవించినట్లు గ్రామస్థులు తెలిపారు.బాధితులు కట్టుబట్టలతో బయటపడ్డారు.బాధితులను ప్రభుత్వం అదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## అవీ..ఇవీ..

### యువతను మత్తుకు బానిసలను చేసిన వైసీపీ



డ్రగ్ ఆంధ్రప్రదేశ్‌గా చేశారని పోస్టర్ చూపిస్తున్న టీడీపీ నాయకులు

పొదిలి, మార్చి 30 : యువతను మత్తు పదార్థాలకు బానిసలను చేసిన ఘనత వైసీపీకే దక్కు తుందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌ను డ్రగ్ ఆంధ్రప్రదేశ్‌గా చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌డ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో యువతే లక్ష్యంగా చేసుకొని కళాశాలల్లో యథేచ్ఛగా డ్రగ్ సరఫరా చేస్తున్నారని విమర్శించారు. ఒంగోలు, కర్నూలు మెడికల్ కళాశాలలో విద్యార్థులు పట్టపగలే గంజాయి సేవించి కొట్లాటకు దిగిన ఘటనలు ఇక్కడి దుస్థితికి అద్దం పడుతోందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో ఏపీ మొదటి స్థానంలో ఉంటే వైసీపీ పాలనలో గంజాయి అక్రమ రవాణాలో నెంబర్‌వన్ స్థానానికి చేరిందని ఎద్దేవా చేశారు. గతంలో గుజరాత్ ముంద్రాపోర్టులో ఆఫ్ఘనిస్థాన్ నుంచి రూ.72వేల కోట్ల రూపాయల హెరాయిన్ వచ్చి పట్టుబడిందని గుర్తు చేశారు. నేడు బ్రెజిల్ నుండి వైజాగ్ పోర్టుకు రూ.50వేల కోట్ల డ్రగ్స్ వచ్చి దొరికాయన్నారు. కనుక యువత వైసీపీ రొచ్చులో పడకుండా ఓటుద్వారా తగిన బుద్ది చేప్పాలని కోరారు. టీడీపీ హయాంలో రాష్ట్రం అభివృద్ధిలో ఎలా పరుగులు పెట్టిందో ప్రజలు, యువత ఆలోచించాలని కోరారు. సమర్థవంతమైన పాలనను అందించే నాయకులను ఎన్నుకోవడం ద్వారా యువత భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, నారాయణ తదితరులు ఉన్నారు.

### ఏకలవ్యలో ప్రవేశానికి దరఖాస్తులు

పెద్దదోర్నాల, మార్చి 30: ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశంకోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పీ శ్యాముల్ జోబ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు 6,7,8 తరగతులలో ప్రవేశం పొందడానికి ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే గడువుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆఫ్‌లైన్‌లో స్వీకరించబడవన్నారు. బిల్‌టిక్కెట్లు పొందిన విద్యార్థులు మాత్రమే ప్రవేశ పరీక్షకు అనుమతించనున్నట్లు ఆయన చెప్పారు.

### రెండురోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలు



ఉదయం 11గంటలకే నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి

కంభం, మార్చి 30 : కంభంలో శుక్ర, శనివారాలలో ఉదయం 11గంటల నుంచే వడగాడ్పులు వీస్తున్నాయి. దీంతో ప్రధానరోడ్లన్నీ జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. మార్చి చివరివారం నుంచే ఎండలు ముదరడంతో ప్రజలు వడదెబ్బ భారిన పడకుండా తగినజాగ్రత్తలు తీసుకుంటున్నారు. మధ్యాహ్నం 12 గంటలు దాటక ముందే బజార్లలో పనులు చూసుకొని ఇంటిబాట పడుతున్నారు. శుక్ర. శనివారాలలో కంభంలో 40 డిగ్రీలమేర నమోదు కావడంతో ప్రజలు, వాహనాలతో రద్దీగా ఉండే రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి.

### సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు మేలు



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

పామూరు, మార్చి 30 : చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలతో పేద మహిళలు ఆర్థికంగా మేలు చేకూరుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర ఆదేశాల మేరకు పామూరు పంచాయతీ పరిధిలోని విరాట్‌నగర్ కాలనీలో ఇంటింటి ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. ఒక్క చాన్స్ అంటూ వచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వస్తే అన్ని ధరలను అందుబాటులో ఉంచుతానని, కరెంట్ చార్జీలు పెంచనని చెప్పిన జగన్‌రెడ్డి ధరలు, చార్జీలు, పన్నులతో ప్రజలను బాదేశారని పువ్వాడ అన్నారు. టీడీపీ పథకాలతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు. రాష్ట్ర ప్రయోజనాలు, పిల్లల బంగారు భవిత కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిగా, డాక్టర్ ఉగ్రను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, షేక్ ఖాజారహంతుల్లా, ఉప్పలపాటి హరిబాబు, ఇర్రికోటిరెడ్డి, ఎం.రమణయ్య, బీ సత్యం, ఎస్.నాగేంద్రచారి, పువ్వాడి వెంకట్‌చౌదరి, దేవరపు మాల్యాద్రి, ఎం.దొరసానాచారి జీ వీరబాబు, చినహజరత్, మెంటా నరశింహారావు, పత్తు మస్తాన్, బీజేపీ నియోజకవర్గ నాయికులు కేవీ రమణయ్య చినసుబ్బయ్య, జనసేన నాయకలు దరిశి ఏడుకొండలు, షేక్ సందానిబాష, గుత్తి మహి పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

దర్శి, మార్చి 30 : దర్శి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక కోర్టు ఆవరణలో శనివారం జరిగింది. అధ్యక్షునిగా ఎం.పట్టాభిరామిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కే రమే ష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎస్ నరసింహారావు, సహా య కార్యదర్శిగా బీ చెన్నకేశవులు, ట్రెజరర్‌గా ఎన్.శ్రీనివాసరావు, లైబ్రేరియన్‌గా వీ మంజుల, మహిళా కార్యదర్శిగా పీ మనోహరమ్మ, ఎగ్జిగ్యూటివ్ సభ్యునిగా జీటీ శివశర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది వీరపనేని రంగా ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

### వైసీపీ ప్రచారంలో అటెండర్

గిద్దలూరు టౌన్, మార్చి 30 : ఒంగోలు వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గిద్దలూరు, మార్కాపురం వైసీపీ అభ్యర్థులు కుందురు నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబులు గిద్దలూరులోని సీతారామ కళ్యాణ మండపం ఆవరణలో సభ నిర్వహించారు. ఈ సభలో పట్టణంలోని శ్రీవివేకానంద జూనియర్ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న సూరా మధుసూదన్‌రెడ్డి స్టేజీపైకి ఎక్కి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఆలింగనం చేసుకొని తన మద్దతు వైసీపీకి ఉంటుందని ప్రకటించారు. మీ విజయానికి కృషి చేస్తానని పేర్కొంటూ అక్కడే ఉన్న అభ్యర్థులు అన్నా రాంబాబు, కుందురు నాగార్జునరెడ్డిలతో కూడా చేతులు కలిపి ఫొటోలకు ఫోజులిచ్చాడు. ఇదిలావుండగా కే.ఎస్.పల్లె గ్రామానికి చెందిన వలంటీర్ బొల్లు నవీన్ శుక్రవారం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో సభలో ముందువరుసలో కూర్చుని వైసీపీకి మద్దతుగా నిలిచాడు.

**విధుల నుంచి బెల్టు షాపు నిర్వహిస్తున్న వలంటీర్ తొలగింపు**

తర్లుపాడు : మండలంలోని కేతగుడిపి పంచాయతీలోని బుడ్డపల్లెలో మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్న వలంటీర్ తమ్మిశెట్టి నారాయణను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో పి.చంద్రశేఖర్‌రావు తెలిపారు. శుక్రవారం రాత్రి పోలీసుల దాడుల్లో మద్యం అమ్ముతూ తమ్మిశెట్టి నారాయణ పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు వలంటీర్ విధుల నుంచి తొలగించినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలో ఎవరైనా వలంటీర్లు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్చరించారు.

కంభం (అర్ధవీడు) : అర్ధవీడు మండలం కాకర్లలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న బల్లా బాలరాజును విధుల నుంచి తొలగిస్తూ ఎంపీడీవో ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి వ్యతిరేకంగా వైసీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి ఫొటోలు దిగినందుకు సదరు వలంటీర్‌ను విధుల నుంచి తొలగించినట్లు అర్ధవీడు ఎంపీడీవో సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన భాస్కర్‌రెడ్డితో కలిసి ప్రచారంలో ఉన్న ఉన్నఫొటోలు వైరల్‌గా మారాయి. దీంతో విధుల నుంచి తొలగించాల్సిందిగ ఆర్‌వో నుంచి ఉత్తర్వులు వచ్చాయి.


తెలుగుదేశం
ప్రజాగళం
బాపట్ల నియోజకవర్గం
స్వాగతం! సుస్వాగతం!!
రండి.. తరలి రండి... జయప్రదం చెయ్యండి.
తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ప్రజాగళం సభను విజయవంతం చెయ్యండి.
నీతి, నిజాయితీ, నిబద్ధతలకు నిలువెత్తు నిదర్శనం,
అనగారిన వర్గాల ఆశాదీపం, బడుగు బలహీన వర్గాల భవిష్యత్తు కోసం,
మన బాపట్లను బంగారు బాట పట్టించేందుకు, మనకోసం వస్తున్నారు,
వేలాదిగా తరలి వద్దాం..
చంద్రన్న సభను విజయవంతం చేద్దాం.
బహిరంగ సభ
ది.31.03.2024
ఆదివారం మ.4.00 గం.లకు, అంబేద్కర్ విగ్రహ కూడలిలో, బాపట్ల.
వేగేశన నరేంద్ర వర్మ
బాపట్ల తెలుగుదేశం జనసేన బీజేపీ
ఉమ్మడి MLA అభ్యర్థి
తెన్నేటి కృష్ణప్రసాద్
బాపట్ల తెలుగుదేశం జనసేన బీజేపీ
ఉమ్మడి MP అభ్యర్థి

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



## బాపట్ల జిల్లా వార్తలు

6

ఆదివారం 31 మార్చి 2024



● నిబంధనలకు విరుద్ధంగా మున్నంగి రీచ్‌లో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు

# ఇసుక రీచ్‌లలో.. బరితెగింపు


గుండిమెడ వద్ద నదిలో భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్న దృశ్యం

## ఇసుక.. మాఫియా

● అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులే అండ

- ఆందోళనలపై ఉక్కుపాదం మోపుతున్న అధికారులు
- మంగళగిరి నియోజకవర్గంలో అధికారుల విచిత్రవైఖరి
- కోడ్ వచ్చినా.. రీచ్‌లలో ఆగని ఇసుక అక్రమాలు
- గుల్లవుతున్న గుండిమెడ, వల్లభాపురం రీచ్‌లు

మంగళగిరి, మార్చి 30:మంగళగిరి నియోజకవర్గంలో గుండిమెడ, వల్లభాపురం రీచ్‌లలో రేయింబవళ్లూ ఇసుక తోడివేత, అక్రమ రవాణా జోరుగా సాగుతున్నాయి. గత మూడేళ్లపాటు జేపీ వెంచర్స్ పేరుతో ఈ రెండు రీచ్‌లలో చట్టాలు, నిబంధనలను తుంగలో తొక్కితమకు అడ్డెవరు అన్నట్టుగా ఇసుకను దోచేశారు. ప్రతిపక్షాలు ఇసుకరీచ్‌ల వద్ద ఆందోళనలు చేపట్టినా, పర్యావరణ ప్రేమికులు న్యాయస్థానాల్లో కేసులు వేసినా.. ఇసుక రీచ్‌ల దోపిడీ మాత్రం ఇసుమంతైనా తగ్గలేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాతైనా ఇసుక దోపిడీకి కొంతైనా కళ్లెం పడుతుందని ఆశించినా అడియాసలే అయ్యాయి. కోడ్ అమల్లోకి వచ్చాక వున్న రెండు మాసాల సమయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్న ఆతృత కొద్దీ ఇసుక దోపిడీని మరింత ముమ్మరం చేశారు.

### కాంట్రాక్ట్ ఎవరిదైనా..

గతంలో ఇసుక రీచ్‌ల కాంట్రాక్టు ఏజెన్సీ జేపీ వెంచర్స్ అన్నారు. జేపీ వెంచర్స్ కాంట్రాక్టు పీరియడ్ ముగిసినప్పటికీ గుండిమెడ, వల్లభాపురం రీచ్‌లలో మాత్రం ఇసుక దోపిడీ ఒక్కరోజు కూడ ఆగలేదు. కాంట్రాక్టు ఎవరిదైనా.. అసలు కాంట్రాక్టు వున్నా లేకున్నా.. సంబంధిత శాఖల నుంచి ఆదేశాలు లేకున్నప్పటికీ వైసీపీ బడా నాయకులు మాత్రం ఇసుకరీచ్‌ల వద్ద దాదాపు రౌడీయిజం చేస్తూ మరీ ఇసుకను దోచేస్తూ వచ్చారు. ఇసుక దందాను అడ్డుకోవాల్సిన గనుల శాఖ, రెవెన్యూ శాఖ, రివర్ కన్జర్వేషన్ అధికారులు, పోలీసులు ఇసుక అక్రమ రవాణాకు సంపూర్ణంగా సహకరిస్తూ వచ్చారు. పైగా ఇసుకరీచ్‌ల వద్ద ఆందోళన చేసేందుకు వచ్చిన ప్రతిపక్ష పార్టీల వారిని అడ్డుకుంటూ ఇసుక అక్రమ తోడివేత, అక్రమ రవాణా చేస్తున్నవారికి ప్రభుత్వ యంత్రాంగం రక్షణ కల్పిస్తూ వచ్చింది.

### అక్రమాలను గుర్తించిన ఎంఓఈఎఫ్ అండ్ సీసీ

ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో జరుగుతున్న ఇసుక దందాను గురించి అనేక ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఈ రీచ్‌లలో క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసేందుకు మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, అటవీ, క్లైమేట్ చేంజ్ (ఎమ్ఓఈఎఫ్ అండ్ సీసీ) అధికారులతో ఓ జాయింట్ కమిటీని గత జనవరిలో ఏర్పాటుచేసింది. ఈ కమిటీ జనవరి 17నుంచి 19వ తేది వరకు మూడు రోజులపాటు గుంటూరు జిల్లాలో ఎనిమిది, కృష్ణాజిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లను సందర్శించి ఆయా రీచ్‌లలో జరుగుతున్న అక్రమాల దందాను గుర్తించింది. విరామమే లేకుండా రోజుకు 24 గంటలపాటు భారీ మిషనరీని వినియోగిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను ఆసాంతం తోడేస్తున్న తీరును గుర్తించి కమిటీ ఆశ్చర్యపోయింది. రీచ్‌లలో సీసీ టీవీలు లేకపోవడం, సరైన వేబిల్స్ లేకుండా, కంప్యూటర్ జనరేటెడ్ బార్‌కోడ్ పర్మిట్లు లేకుండా రవాణా చేస్తున్న తీరును చూసి కమిటీ కంగుతింది. రీచ్‌లలో తాము గుర్తించిన ఈ అక్రమాలను గురించి కమిటీ ఎన్జీటీకి గత నెల రోజుల కిందట నివేదికను సమర్పించింది. అయినా, ఇసుక అక్రమార్కులు ఎక్కడా వెరవలేదు.

ఇసుక అక్రమ తవ్వకాలను ఆపాలంటూ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకపోవటంతో జనమే చివరకు రీచ్‌ల దగ్గరకు వెళుతున్నారు. అక్రమార్కులు మాత్రం మరింత బరితెగించి జనంపైకి ట్రాక్టర్‌లను దూకిస్తూ, టైర్ల కింద పడేసి తొక్కిస్తూ, కత్తులు కటార్లతో దాడులకు తెగబడుతున్నారు. కానీ అధికార యంత్రాగం చోద్యం చూస్తుండటం కొసమెరుపు. నిన్నటి వరకు ప్రభుత్వ పెద్దల ప్రమేయం, నేతల ఆదేశాలున్నాయని అధికారులు దాడులు చేయలేదనుకుంటే, ఇప్పుడు ఎన్నిల కోడ్ అమలులో ఉన్న తరుణంలో ఏ రాజకీయ నేతలతో పనిలేకున్నా, ఇంకా వారికి వత్తాసుపాడుతూనే ఉన్నారు. అదేమంటే... ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలున్నాయని, ఏమీ చేయలేమని కొందరు బహిరంగంగానే చెబుతుంటే, మరి కొందరు పోలీస్, సెబ్ అధికారులయితే మరో అడుగు ముందుకేసి వసూళ్లకు సై అంటున్న పరిస్థితి. నిన్నటి వరకు ఎమ్మెల్యే, మంత్రి పేరుచెప్పి ఇసుక తరలించారని, ఇప్పుడు ఆ పప్పులేవీ ఉడకవని, ఈ రెండు నెలలు టైం మాదంటూ, నిలబెట్టి మరీ వసూళ్లకు సిద్ధపడుతున్నారని తాజాగా లారీ యజమాన సంఘాలే ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఏ రీచ్‌కు అనుమతులున్నాయో! వేటికి లేవనేది కూడా రహస్యమే.

### కృష్ణాతీరం భారీగా కోత..

మంగళగిరి నియోజకవర్గంలో గుండిమెడ, వల్లభాపురం రీచ్‌లలో జరుగుతున్న ఇసుక దందాతో దిగువ కృష్ణా తీరం భారీ కోత పడుతూ వస్తుంది. దీంతో పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుంది. మరోవైపు గుండిమెడ రీచ్ నుంచి రోజుకు అయిదొందలకు పైబడి భారీ ట్రక్కుల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతుండగా వల్లభాపురం రీచ్ నుంచి రోజుకు 300 నుంచి 350 ట్రక్కుల వరకు దోచేస్తున్నారు. గుండిమెడ రీచ్‌నుంచి ఒక్కో ట్రక్కులో 20 నుంచి 25 టన్నుల వరకు ఇసుకను తరలించుకుని పోతున్నారు. గుండిమెడ రీచ్‌నుంచి ట్రక్కులు కరకట్ట రోడ్డు మీదుగా ప్రాతూరు వచ్చి అక్కడనుంచి ప్రాతూరు- కుంచనపల్లి రోడ్డుమీదుగా హైవే ఎక్కి విజయవాడ, మంగళగిరి, గుంటూరు వైపు తరలివెడుతున్నాయి. రోడ్లు సైతం ఈ భారీ వాహనాల తాకిడికి దెబ్బతినిపోతున్నాయి. గత ఆరేడు మాసాలుగా జేపీ వెంచర్స్ బదులుగా ముఖ్యమంత్రి బంధువే ఈ రీచ్‌లను స్వయంగా దోచుకుంటున్నారంటూ సమీప గ్రామ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.


● మున్నంగిలో ఇసుక అక్రమ తవ్వకాల కోసం నదిలో దారులు

### ● నిబంధనలకు పాతరేసి... అడ్డుగోలుగా తవ్వేస్తూ...

- అనుమతులతో పనిలేకుండా ఇష్టమొచ్చిన చోట తవ్వకాలు
- మైనింగ్ శాఖకు అడ్డుకునే ధైర్యమేదీ!
- భూగర్భ జలాలు అడుగంటుతున్నా కన్నెత్తి చూడదు
- నెలవారీ మామూళ్లు కడితే చాలు.. పోలీస్, సెబ్‌కు పట్టదు
- అక్రమ తవ్వకాలను అడ్డుకుంటామంటే కత్తులు, రాడ్‌లతో దాడులు
- ట్రాక్టర్‌లతో తొక్కించి చంపేందుకూ సిద్ధం
- మొన్న అమరావతి, నిన్న మున్నంగి ఘటనలే నిదర్శనం

తెనాలి, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): గతంలో జేపీ సంస్థ, నిన్నటి వరకు జీసీకేసీ సంస్థ పేరుచెప్పి ఇసుక తవ్వేశారు. గత 6 నెలల నుంచి మరింత బరితెగించి అక్రమ తవ్వకాలకు తెగబడుతున్నారు. గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో ప్రకాశం బ్యారేజికి దిగువున గుండిమెడ, పెదకొండూరు, మున్నంగి, వల్లభాపురం, బొమ్మువానిపాలెం, గాజుల్లంక, జువ్వలపాలెం రీచ్‌లలో తవ్వకాలకు అనుమతులున్నాయని చెబుతున్నారు. అటు పల్నాడు, గుంటూరు జి ల్లాల్లో బ్యారేజికి ఎగువున కె.వి.పాలెం, కొత్తపల్లి, చామర్రు, మల్లాది, వైకుంఠపురం రీచ్‌లలో అనుమతులున్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే వారికి ఆయా రీచ్‌లలో అనుమతిచ్చిన ప్రదేశం ఎక్కడ? తవ్వుతున్నది ఎక్కడనేది మాత్రం పర్యవేక్షించే వారే లేరు. ఇక్కడ తవ్వేది తక్కువైతే, అక్రమ తవ్వకాలు మాత్రం అసలు రీచ్‌లకు దగ్గర్లో మరో చోట తవ్వేస్తున్నా పట్టించుకునే వారేలేరు. ఈ మధ్య జగనన్న కాలనీల పేరుతో బుసక రీచ్‌లకు అనుమతులు తీసుకుని ఇసుకను తరలిస్తున్నారు. కొల్లూరు మండలం జు వ్వలపాలెం రీచ్‌కు అనుమతిస్తే అక్కడ అసలు తవ్వకాలే జరపలేదు. దీనికి దూరంగా జువ్వలపాలెం-ఓలేరు మధ్య నదిలో తవ్వేస్తున్నారు. అయితే కలెక్టర్‌లు ఇక్కడ పరిశీలిస్తే మాత్రం అంతా బాగుందన్నట్టే కనిపించే పరిస్థితి. పెనుమూడి దగ్గర నీటిలో ఇసుక తవ్వకాలకు అనుమతిలేదు. కానీ ఇక్కడా తవ్వకాలు ఆగలేదు. కొల్లూరు మండలం గాజుల్లంకలో మరో రీచ్‌కు అనుమతి ఉందని అధికారులు చెబుతుంటే చిలుమూరు, పెసర్లంక-పెదలంక మధ్య పట్టా భూముల్లోనూ అడ్డు లేకుండా తవ్వేస్తున్నారు. గతంలో ఈ లంకల్లో రైతులు అక్రమ తవ్వకాలను అడ్డుకుంటే, వారి ఇళ్లకు అర్ధరాత్రులు పోలీసులను వెంటబెట్టుకుని మరీ వెళ్లి అక్రమార్కులు బెదిరించిన పరిస్థితి. అన్నవరం, బొమ్మువానిపాలెం, కొల్లిపర, అత్తలూరివారిపాలెం, పెదకొండూరు, ప్రాతూరు ప్రాంతాల్లోనూ అక్రమతవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతూనే ఉన్నాయి.

### అడ్డుకుంటే తొక్కేస్తారా..?

గతంలో అమరావతి మండలంలో ఇసుక అక్రమ తవ్వకాల ఫొటోలు తీసేందుకు వెళితే విలేకరిపై విచక్షణారహితంగా దాడిచేసి, చంపబోయారు. తాజాగా మున్నంగిలోనూ స్థానికులు అక్రమ తవ్వకాల కారణంగా భూగర్భ జలాలు అడు గంటిపోతున్నాయని గగ్గోలు పెడుతూ అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇసుక అక్రమ తవ్వకందారులు, వారి అనుచరులు ట్రాక్టర్లతో జనాన్ని తొక్కించేందుకు కొద్దిసేపు భయానక వికృత క్రీడకే తెరతీశారు. గుద్దించి పడిపోయిన వ్యక్తిపైకి టైరు ఎక్కించి కదలకుండా చేసి, అతను వేడుకుంటున్నా వదలకుండా మిగిలినవారు కాళ్లతో విచక్షణారహితంగా తన్నారు. మరికొందరు నిలబడి ఉన్న జనంపైకి కత్తు లు, రాడ్‌లు తీసుకుని దాడికి తెగబడ్డారు. కరకట్టపై వెళ్లే వాహనదారులు కూడా భయపడిపోయి పరుగులుపెట్టాల్సిన పరిస్థితి. అయితే ఈ ఘటనపై వేగంగానే స్పందించిన పోలీసులు దాడిచేసిన వారినీ, దెబ్బలు తిన్నవారిలో కొందరిని స్టేషన్‌కు తీసుకొచ్చినా, చివరకు పై వత్తిడులతో కేసు కట్టకుండా రాజీ ప్రయత్నాలు చేశారనే విమర్శ వచ్చింది. అయితే దాడి వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావటంతో తర్వాత తప్పనిసరై కేసు నమోదు చేశారని బాధితు లు చెబుతున్నారు. ఇంతటి దారుణ పరిస్థితులు కనిపిస్తు న్నా అధికార యంత్రాంగం మాత్రం ఎన్నికల వేళ ఇంకా మీనమేషాలు లెక్కించటం విమర్శలకు కారణమవుతోంది.

### నిబంధనలన్నీ ఎక్స్‌కవేటర్ చక్రాల కింద కప్పెట్టేసి...

ఇసుక రీచ్‌లలో ఇసుక తవ్వాలంటే దానికి వాల్టా చట్టం నుంచి గ్రీన్‌ట్రిబ్యునల్ నిబంధనల వంటివి సవాలక్ష ఉన్నా యి. కానీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఇవే మీ వర్తించవు. ప్రస్తుతం ఏ రీచ్‌లో ఇసుక తవ్వాలన్నా కేవలం కూలీల సాయంతోనే తవ్వాలి. భారీ ఎక్స్‌కవేటర్లు ఉపయోగించకూడదు. నదిలోకి ట్రాక్టర్‌ల వంటివి మినహా కనీసం ఆరు చక్రాల లారీలను కూడా దింపటానికి వీలులేదు. సాయంత్రం 6 తర్వాత తవ్వకాలు ఆపాల్సిందే. మైనింగ్ శాఖ అనుమతిచ్చిన ప్రదేశంలో మాత్ర మే అనుమతించిన పరిమాణం,లోతుకు మించి తవ్వటానికి వీలులేదు. కనీసం నీటి చె మ్మ కూడా బయటకు కనిపించేలా తవ్వటానికి వీలులేదు. నదీ ప్రవాహం ఉన్న పాయల వెంట అసలు తవ్వకాలు జరపటానికి వీలులేదు. నీటి అ డుగున తవ్వకాలు జరపాల్సివస్తే, ఎంత పరిమాణం? ఎక్కడెక్కడ తియ్యవచ్చనేది అధికారులు నిర్ణయించిన ప్రకారమే డ్రెడ్జర్‌లతో తియ్యాలి. ఇవి కాకుండా మరిన్ని కఠిన నిబంధనలు చాలానే ఉన్నా, ఇవేమీ ఇక్కడ పనిచెయ్యవు. ఈ ప్రాంతాల్లో ఏ రీచ్‌కూ పర్యావరణ, ఇతర అనుమతులు లేవని, నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయంటూ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఇసుక రీచ్‌లన్నిటినీ ఆపేయాలని ఎప్పుడో ఆదేశాలిచ్చింది. నిబంధనల మేరకు తవ్వకాలు జరిగిందీ, లేనిదీ నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తే, కలెక్టర్‌లే అవేమీ లేవని నివేదికలివ్వటం ఇక్కడ దందా వెనుకున్న అక్రమార్కుల అండకు నిదర్శనం. ఒక్క రీచ్‌లో కూడా కూలీలతో తవ్వకాలు జరుపుతున్నదిలేదు. ఏకంగా భారీ ఎక్స్‌కవేటర్లు తీసుకొచ్చి మరీ ఇసుక తవ్వేస్తున్నారు. పైగా ఇసుక మేటవేసిన మందాన్ని బట్టి అడుగు నుంచి మూడు అడుగుల లోతులో తవ్వాల్సిఉన్నా, మీటర్ల కొద్దీ తవ్వేస్తున్నారు. కొన్నిచోట్లయితే పది నుంచి 18 అడు గుల లోతులో గుంతలు పెట్టి మరీ ఇసుక తవ్వేస్తున్నారు. ఇసుక పొర కింద నీరు బయటకు కనిపించకూడదు... కానీ నీరు బయటకు వచ్చినా దానిలోనూ పదడుగుల వరకు ఇసుక తవ్వేస్తున్నారు. నీరంతా ఆవిరై, భూగర్భ జలా లు అడుగంటిపోవటానికి కారణమవుతోంది.

### అధికారులకు చిత్తశుద్ధి కరువు..

అధికారులు నిజంగా చిత్తశుద్ధితో తవ్వకాలను పర్యవేక్షిస్తున్నారనుకుంటే, ఒక్క రీచ్‌లో కూడా పొక్లెయిన్ లేకుండా మొత్తాన్నీ సీజ్ చేసేవారే. కానీ ఎక్కడా ఇటువంటిది జరగటం లేదు. ఒక్కో రీచ్‌లో కనీసం మూడు నుంచి ఆరుకుపైగా భారీ పొక్లెయిన్లు ఇసుక తవ్వేస్తున్నాయి. అధికారిక, అనధికార రీచ్‌లన్నీ లెక్కేస్తే బ్యారేజి ఎగువున, దిగువున మొత్తం 100కుపైగా భారీ పొక్లెయిన్‌లు కృష్ణానదిని తోడేస్తున్నాయి. కనీసం వీటిని కట్టడి చేసినా కొంతైనా అక్రమాలు తగ్గే అవకాశం ఉంటుంది. తాజాగా మరోమారు జిల్లాల కలెక్టర్‌లు రీచ్‌ల బాట పట్టనున్నారనేది సమాచారం. అప్పటికైనా గత పరిశీలనల్లా కాకుండా అక్రమ తవ్వకాలపై ఆరా తీస్తే తీరవాసుల గొంతెండే పరిస్థితికి ఉపశమనం లభిస్తుంది.

### సమాచారం కావాలంటే అర్జీ పెట్టాల్సిందే..

గుంటూరు జిల్లాలో ఏ రీచ్‌ల కు అనుమతులున్నాయో! ఎక్కడెక్కడ తవ్వకాలు జరపొచ్చనే సమాచారం కావాలన్నా, మరే ఇతర వివరాలు కావాలన్నా ఒక అర్జీ పెట్టాల్సిందే. సామాన్యుడికైనా, మరెవరికైనా ఇదే నిబంధన. మున్నంగి రీచ్‌లో అక్రమ తవ్వకాలు ఏమీ లేవు. ఒకవేళ అనుమతించిన ప్రదేశంలో కాకుండా అక్రమంగా మరెక్కడైనా తవ్వుతున్నారనే అనుమానం ఉంటే వారికిచ్చిన అనుమతి పత్రంలో అక్షాంశ, రేఖాంశాలుంటాయి. జీపీఆర్ఎస్ ద్వారా మీరే పరిశీలించుకోవచ్చు. నిబంధనల అతిక్రమణ జరగటంలేదు. యంత్రాల విషయం పరిశీలిస్తాం.

- జిల్లా మైనింగ్ అధికారి చంద్రశేఖర్

### ★ పోలీస్, సెబ్ శాఖలు

కొందరు అధికారులు వత్తిడులకు రీచ్‌లలో ఏం జరిగినా వారికి సంబంధం లేదన్నట్టు ఉంటారు. మరికొందరు రెండు, మూడు రీచ్‌లలో మాత్రమే చాలావరకు కట్టడి చేస్తున్నాం అనిపిస్తున్నారు. ఇంకొందరయితే అవేమీ మాకు సంబంధం లేదన్నట్టు లారీ యజమానుల దగ్గర నుంచి నెలవారీ మామూళ్లకు వాట్సప్ గ్రూపులు పెట్టి మరీ వసూళ్లు చేసేస్తున్నారనేది లారీ యజమానుల ఆరోపణ.

### ★ భూగర్భ 'ఘనుల' శాఖ

ఇసుక తవ్వకాలకు అనుమతులివ్వాలి కాబట్టి మారు మాట్లాడకుండా ఇచ్చేస్తారు. వారు అనుమతించిన చోట తవ్వుతున్నారా? లేక అక్రమంగా ఇతర ప్రదేశాల్లో తవ్వేస్తున్నారా అనేది చూసేందుకు రీచ్‌లలో అడుగు పెట్టటానికి కూడా సాహసించరు.


### ★ భూగర్భ జలవనరుల శాఖ

నదుల్లో ఇసుక తవ్వకాలకు నేతలు, వారి అనుచరులు ఎక్కడ అడిగితే అక్కడ 'నో అబ్జెక్షన్' అంటూ అనుమతులు ఇవ్వాల్సిందే. నీరు బయటపడేలా వాల్టా నిబంధనలకు విరుద్ధంగా భారీ లోతుల్లో తవ్వేస్తున్నా, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని నదీ తీరవాసులు గొంతెత్తి అరుస్తున్నా వీరికేమీ వినిపించవు.

### పర్యావరణం, నీటిపారుదల శాఖ

ఈ శాఖలకు ఇక్కడ చోటేలేదు. వారిని కాగితాలపై సంతకాల వరకే పరిమితం చేశారు. జిల్లాల కలెక్టర్‌లైతే రీచ్‌లను స్వయంగా పరిశీలించి, అక్రమ తవ్వకాలు పక్కనే కనిపిస్తున్నా అటువైపు కన్నెత్తికూడా చూడకుండా అంతా బ్రహ్మాండంగా ఉందని, ఎక్కడా అక్రమ తవ్వకాలే జరగటంలేదని ఏకంగా జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కే నివేదికలిచ్చేస్తారు.

● ఇదీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాల దందా వెనుక జరుగుతున్న లోగుట్టు. కింది స్థాయి అధికారి నుంచి జిల్లాల పాలనాధికారుల వరకు రీచ్‌లలో జరుగుతున్నది అక్రమమే అని తెలిసినా, మారు మాట్లాడే సాహసం కూడా చేయకుండా నేతలకు జీ హుజూర్ అంటూ అధికారులే చేతులెత్తేస్తుండటం విచిత్రమే.


● తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు

పరిమితికి మించి లారీలో ఇసుక

# చంద్రబాబు ప్రజాగళం నేడే

- బాపట్ల పట్టణంలో రోడ్‌షో నిర్వహణ
- అంబేడ్కర్ కూడలిలో బహిరంగ సభ
- తరలిరానున్న టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు
- రాత్రికి బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బస

బాపట్ల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు ఆదివారం బాపట్లలో ప్రజాగళం సభ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను టీడీపీ నేతలు ఇప్పటికే పూర్తి చేశారు. శ్రేణులను సమాయత్తం చేసే కార్యక్రమంలో భాగంగా బాపట్లలోని టీడీపీ కార్యాలయంలో కూటమి నేతలు శుక్రవారం సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ప్రచారం కోసం తొలిసారి చంద్రబాబు జిల్లాకు రానుండడంతో అధినేతకు ఘన స్వాగతం పలికేందుకు తెలుగుదేశం నేతలు సిద్ధమయ్యారు. జిల్లా కేంద్రం కావడం, అందునా బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం కూడా కావడంతో పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ శ్రేణులు తరలివచ్చే అవకాశం ఉంది. దీనికి తోడు బీజేపీ, జనసేన పొత్తులో ఉన్నందున ఆ పార్టీల మద్దతుదారులు కూడా భారీ సంఖ్యలో హాజరుకానున్నారు. అంతేకాకుండా పాలకపార్టీ వైఖరిపై విసిగిపోయి ఉన్న సామాన్య ప్రజలు సైతం స్వచ్ఛందంగా చంద్రబాబుకు బ్రహ్మరథం పడతారనే ధీమాను టీడీపీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి పెద్దఎత్తున చేరికలు కూడా ఉండనున్నాయి. అప్పికట్ల సర్పంచ్‌తో పాటు మరికొంత మంది వైసీపీ నాయకులు అధినేత సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారని తెలుస్తోంది.

### టీడీపీలో జోష్...

ప్రజాగళం సభ కోసం టీడీపీ అధినేత చంద్రబాబు బాపట్లకు రానుండడంతో టీడీపీలో జోష్ కనబడుతోంది. పొత్తు పొడిచాక జరుగుతున్న తొలి సభ కావడంతో కూటమి ఉమ్మడి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా చంద్రబాబు ప్రచారం చేపట్టనున్నారు. వైసీపీ దుర్మార్గ పాలన అంతమొందించడమే లక్ష్యంగా అధినేత చేపట్టిన ప్రజాగళం సభను విజయవంతం చేయాలని టీడీపీ నేతలు ప్రజలకు పిలుపిచ్చారు. ఈ సభ ద్వారా ప్రజలను మరింత చైతన్యపరచడంతో పాటు పాలకపార్టీ అరాచకాలను జనానికి వివరించనున్నారని ప్రతిపక్ష పార్టీ నేతలు చెబుతున్నారు.

### చంద్రబాబు పర్యటన సాగేదిలా...

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ఆదివారం సాయంత్రం చంద్రబాబు దిగనున్నారు. అక్కడ నుంచి 216 జాతీయ రహదారి మీదుగా రోడ్‌షో చేపట్టనున్నారు. కుక్కలవారిపాలెం, దరివాదకొత్తపాలెం మీదుగా పట్టణంలోని జమ్ములపాలెం ఆర్‌వోబీ వద్దనున్న అంబేడ్కర్‌కూడలి వద్దకు చేరుకోనున్నారు. సాయంత్రం 5:30కు ప్రజాగళం బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి చంద్రబాబు మాట్లాడనున్నారు. రాత్రికి ఇంజనీరింగ్ కళాశాలలోనే బస చేయనున్నారు.

### లోటుపాట్లపై సమీక్ష!

టీడీపీ అధినేత చంద్రబాబు రాత్రికి బాపట్లలోనే బస చేయనున్న దృష్ట్యా సోమవారం ఉదయాన్నే ఆయా నియోజకవర్గాల అభ్యర్థులతో పార్టీ పరిస్థితిపై సమీక్షించనున్నారని సమాచారం. ముున్ముందు చేపట్టాల్సిన కార్యక్రమాలతో పాటు కూటమి నేతలతో సమన్వయంపై నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. వైసీపీ వేధింపులతో పాటు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు, ఓట్ల అక్రమాల వంటివన్నీ సమీక్షలో చర్చకు రానున్నాయని తెలుస్తోంది.


హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కృష్ణప్రసాద్, వేగేశన

### రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(ఆదివారం)

సహారీ (ఉదయం) 4.46 (సోమవారం)

# గొట్టిపాటి.. సమరశంఖం

- సెంటిమెంట్‌గా ఐదోసారి మక్కెనవారిపాలెం నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభం
- ఆరంభం అదుర్స్... పెద్దఎత్తున తరలివచ్చిన క్యాడర్

అద్దంకి, మార్చి 30: ఎన్నికల సమరానికి గొట్టిపాటి అద్దంకి నియోజకవర్గంలో సమరశంఖం పూరించారు. తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తున్న గొట్టిపాటి రవికుమార్ శనివారం సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. 2004 ఎన్నికలతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన రవికుమార్ మార్టూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. 2009 ఎన్నికల నాటికి మార్టూరు నియోజకవర్గం రద్దు కావటంతో గత మూడు ఎన్నికల్లో అద్దంకి నియోజకవర్గం నుంచి పోటీచేసి విజయకేతం ఎగుర వేశారు. గత నాలుగు సార్లు మక్కెనవారిపాలెం నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన గొట్టిపాటి అదే సెంటిమెంట్‌తో ఐదోసారి కూడా అక్కడ నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు.


మహిళలకు టీడీపీ మానిఫెస్టో వివరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అయితే, శనివారం నాటి ఎన్నికల ప్రచారం గత నాలుగుసార్లు కంటే భిన్నంగా సాగినట్లు టీడీపీ శ్రేణులు అంచనా వేస్తున్నారు. ఎమ్మెల్యే రవికుమార్ ఇంటింటికి తిరిగి టీడీపీ మ్యానిఫెస్టో వివరించారు. ప్రజల నుంచి వచ్చిన స్పందన అనూహ్యంగా ఉందన్న అభిప్రాయాన్ని క్యాడర్ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సంతమాగులూరు మండలంలో పలువురు వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకోవటంతో క్యాడర్ జోష్‌తో ఉన్నారు. ఎన్నికల ప్రచారం ప్రారంభంలో పాల్గొన్న ప్రజలు, వచ్చిన స్పందనతో టీడీపీ క్యాడర్‌లో జోష్ రెట్టింపు అయ్యింది. రాజకీయాలలోకి అడుగుపెట్టినప్పటి నుంచి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నేతగా ప్రత్యేక గుర్తింపు ఉన్న గొట్టిపాటి గత ఐదు సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉన్నా తరచూ ఏ చిన్న కార్యక్రమం జరిగినా పాల్గొంటున్నారు. గత ఏడాది నుంచి సైకిల్ స్పీడు మరింత పెంచారు. ఈక్రమంలో నియోజకవర్గంలో సుమారు 72 గ్రామాలను కలుపుతూ సైకిల్‌యాత్ర నిర్వహించారు. ఇక బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ ద్వారా 40 గ్రామాలలో పాల్గొన్నారు. ఇలా ప్రత్యర్థి ఎవరు అనేది చూడకుండా తన పని తాను చేసుకునే గొట్టిపాటి శనివారం నుంచి ప్రారంభించిన ఎన్నికల ప్రచారం ద్వారా మరింత స్పీడు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. ఇంటింటి ప్రచారంతో పాటు మరికొన్ని గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తూ వచ్చే 40 రోజులు జోరుగా ప్రచారం నిర్వహించేలా సిద్ధం అయ్యారు. ఇప్పటికే గెలుపు ధీమాతో ఉన్నా టీడీపీ శ్రేణులకు శనివారం నాటి ప్రచార ప్రారంభ కార్యక్రమంతో రెట్టింపు అయ్యింది.

# వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలి

- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్
- మక్కెనవారిపాలెంలో

**ఎన్నికల ప్రచారం ప్రారంభం**

సంతమాగులూరు, మార్చి 30: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన వైసీపీని సాగనంపాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని మక్కెనవారిపాలెంలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. గత నాలుగు పర్యాయాలు ఇదే గ్రామం నుంచి ఎన్నికల శంఖారావం ప్రారంభించి విజయం పొందటంతో, ఆదే సెంటిమెంట్‌తో ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని బీసీ కాలనీలోగల అంకమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రతి ఒక్కరిని పలకరిస్తూ ప్రచారాన్ని ప్రారంభించారు.

ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మోసపూరిత హామీలతో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగం ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం అప్పుల పాలయిందన్నారు. రాష్ట్రం గాడిలో పడాలంటే తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మరో 50 రోజులలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని రవికుమార్ పేర్కొన్నారు. అహంకారం ఉన్న వ్యక్తి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అహంకారమే అతని రాజకీయ అంతానికి దారితీసే పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నికల ముందు ఒక్క చాన్స్ అన్న జగన్ రెడ్డి నేడు పిడిగుద్దులు గుద్దుతున్నారని చెప్పారు. ఈ ఐదేళ్లలో ఎవరి జీవితాల్లోనైనా వెలుగొచ్చిందా? అని ప్రశ్నించారు. ఊర్లు, ఊర్లు ఏకమై వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో వైసీపీని ఓడించాలన్నారు. ఈ ఎన్నికలు అహంభావంతో విర్రవీగుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి, 5 కోట్ల మందికి జరుగుతున్న పోరాటమని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసర ధరలు మండిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధితో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపింది తెలుగుదేశం పార్టీయేనని అన్నారు. కష్టపడి పని చేసే వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు.

**మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం**

అద్దంకి, మార్చి 30: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్‌ను 4 వేల రూపాయలకు పెంచటం జరుగుతుందని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. మండలంలోని ధర్మవరం, కలవకూరులలో జరిగిన సమావేశాలలో ఎమ్మెల్యే రవికుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ టీడీపీ మినీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాల గురించి విస్తృతంగా ప్రజలలోకి తీసుకుపోవాలన్నారు. మహిళా సంక్షేమం కోసం అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సహకారం అందిస్తామని చెప్పారు. సమావేశాలలో టీడీపీ మండల అధ్యక్షుడు కఠారి నాగేశ్వరరావు, కరి పరమేష్, సందిరెడ్డి రమేష్, చాగంటి రాజేంద్ర ప్రసాద్, బండారుపల్లి శ్రీనివాసరావు, రవి, గుర్రం నాగరాజు, కొండలు, తదితరులు పాల్గొన్నారు.


మక్కెనవారిపాలెంలో ఇంటింటి తిరిగి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

**నేడు మణికేశ్వరంలో ఇంటింటి ప్రచారం**

అద్దంకి, మార్చి 30: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ చేపట్టిన ఎన్నికల ప్రచా రం రెండోరోజు ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి అద్దంకి మండలంలో ని మణికేశ్వరంలో నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో అంశాలు, అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాలు గురించి వి వరించనున్నారు.

## లారీ బోల్తాపడి డ్రైవర్ మృతి

బల్లికురవ, మార్చి 30: అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్రీ య రహదారి వైదన గ్రామ సమీపంలో శుక్రవారం అర్థరాత్రి బట్టల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్ గుర్రాల సురేష్( 25) అక్కడికక్కడే మృతి చెందగా, మరో డ్రైవర్ పూర్ణచంద్రరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్ఐ బాలకృష్ణ కథనం ప్రకారం.. వరంగల్ నుంచి నూతన బట్టలతో చిత్తూరు వెళ్తున్న లారీ వైదన గ్రామ సమీపంలో పాల డెయిరి వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోకి బోల్తా కొట్టింది. ఈప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం హనుమకొండ జిల్లా మల్లారెడ్డిపల్లెకు చెందిన డ్రైవర్ సురేష్ లారీ స్టీరింగ్ ఒత్తిడితో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీలో ఉన్న మరో డ్రైవర్ మేడిపల్లి పూర్ణచంద్రరావుకు తీవ్రగాయాలు కావటంతో హైవే అంబులెన్స్‌లో నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

బల్లికురవ, మార్చి 30: మద్యానికి బానిసై కుటుంబసభ్యులను పట్టించుకోకుండా ఎలుకల మందు తిని కొణిదెనకు చెందిన తన్నీరు వేణుబాబు(25) ఆత్మహత్యయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఏఎస్ఐ బండి శ్రీనివాసరావు కథనం మేరకు.. మండలంలోని కొణిదెన బీసీ కాలనీకి చెందిన తన్నీరు వేణుబాబు బేల్దారి పనులు చేస్తూ మద్యానికి బానిసగా మారాడు. నిత్యం మద్యం తాగి కుటుంబసభ్యులను పట్టించుకోకుండా ఉంటూ ఇంట్లోనే గురువారం రాత్రి ఎలుకల మందు తిని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే వారి కుటుంబ సభ్యులు చికిత్సకై గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి హనుమంతరావు ఫిర్యాదు మేరకు వైద్యశాల నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

## ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై కేసు నమోదు

బల్లికురవ, మార్చి 30: మండలంలోని కొమ్మినేనివారిపాలెం, కొప్పెరపాడు గ్రామాలలో ఇటీవల మూడు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దొంగలు చోరీ చేశారు. రైతులు, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు శనివారం బల్లికురవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ జరగటంతో రెండు గ్రామాల్లోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఏఈ తెలిపారు.

## ప్రమాదంలో తల్లీ కొడుకులకు తీవ్రగాయాలు

బల్లికురవ, మార్చి 30: మండల పరిధిలోని అద్దంకి- నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి కొప్పెరపాడు గ్రామం వద్ద బైకు హ్యాండిల్‌కు ఆటో తగలటంతో తల్లి, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం సంతమాగులూరు వైపు నుంచి అద్దంకి వైపు మేర్ల వేణుగోపాల్‌రెడ్డి, ఆయన తల్లి కోటేశ్వరమ్మ బైకుపై వస్తున్నారు. కొప్పెరపాడు వద్దకు వచ్చేసరికి ముందువెళుతున్న ఆటోను క్రాస్‌చేసే సమయంలో బైకు హ్యాండిల్ ఆటోకు తగిలి కిందపడటంతో తల్లీకుమారుడు గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంపై స్టేషన్ రైటర్ అంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమార్తెకు గాయాలు

బల్లికురవ, మార్చి 30: మండలంలోని అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి రామాంజనేయపురం గ్రామం వద్ద ఆటోని ఢీకొని బైకుపై ఉన్న తండ్రి, కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు.. పంగులూరు మండలం కొండమురు గ్రామానికి చెందిన శొంఠి వీరాంజనేయులు, ఆయన కుమార్తె నవ్యలు శనివారం బైకుపై పల్నాడు జిల్లా బొల్లాపల్లి వెళుతున్నారు. ఈక్రమంలో రామాంజనేయపురం వద్ద ఆటోను ఢీకొట్టడంతో గాయపడ్డారు.

## చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమేష్‌బాబు

చీరాల టౌన్, మార్చి 30: చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమేష్‌బాబు రెండోసారి ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఎన్నికలు కోర్టు ఆవరణలో శనివారం నిర్వ హించారు. 212 ఓట్లకుగాను 172ఓట్లు రమేష్‌బాబుకు వచ్చాయి. ఉపాధ్యక్షులుగా బోయిన శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా కె.ఉదయ్‌భాస్కర్, సహాయకార్యదర్శిగా ఆలూరి మణినాగశయన, కోశాధికారిగా నాశిన రామకోటేశ్వరరావు, లైబ్రరీ కార్యదర్శిగా ఎస్.కామేశ్వరరావు, సాంస్కృతిక కార్యదర్శిగా రాజా సాల్మన్ తదితరులు ఎన్నికయ్యారు.

## ఎన్నికల నిర్వహణపై అవగాహన కలిగిఉండాలి

పర్చూరు, మార్చి 30: ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ఎన్నికల నిర్వహణపై సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన కలిగిఉండాలని ఏఆర్‌వో సీహెచ్ సుబ్బయ్య అన్నారు. శనివారం స్థానిక క్రీడా వికాస కేంద్రం ప్రాంగణంలో ఈవీ ఎంల పనితీరు, ఏ ఫారం ఎలా పూర్తిచేయాలి, ఈవీఎంలు మొరాయిస్తే ఎటు వంటి చర్యలు తీసుకోవాలి అన్న అంశాలపై మాస్టర్ ట్రైనర్లు సెక్టార్ అధికారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పర్చూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జి.రవీందర్ అధ్యక్షతన నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ నిర్వహణలో ఉండే పీవో, ఏపీవోలకు శిక్షణ ఇచ్చే అధికారులతో ఈకార్యక్రమం ఏర్పాటుచేశారు. మాస్టర్ ట్రైనర్, చినగంజాం తహసీల్దార్ ఫణీంద్రబాబు డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో పర్చూరు యద్దనపూడి, మార్టూరు, కారంచేడు తహసీల్దార్‌లు సీహెచ్ సుబ్బయ్య, వై.నాగరాజు, కె.సంధ్యశ్రీ, మెహర్‌బాబు, ఎన్నికల డీటీ సూర్యనారాయణ, మాస్టర్ ట్రైనర్లు ఇ.రాజశేఖర్, రాఘవరెడ్డి, దేవేందర్, ఎస్‌వో శ్రీమన్నారాయణ, 38 మంది సెక్టార్ అధికారులు, 18 మంది మాస్టర్ ట్రైనర్లు హాజరయ్యారు.

## ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ కార్యాచరణపై చర్చిస్తున్న సెయింట్‌ఆన్స్ కళాశాల ప్రతినిధులు

చీరాల, మార్చి 30: సెయింట్‌ఆన్స్ కళాశాలలో సోమవారం నుంచి ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ తరగతులు ప్రారంభిస్తున్నట్టు కళాశాల కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఈ అవకాశాన్ని పాలిసెట్‌కు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాలలో శనివారం ఉచిత కోచింగ్‌కు సంబంధించి కార్యాచరణపై చర్చించారు. ఉచిత కోచింగ్ పొందగోరే అభ్యర్థులు 95055 18288, 97043 26660,80744 30250,72071 23457 నెంబర్లకు ఫోన్‌చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.విజయభాస్కరరెడ్డి, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్.అమరనాథ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## రాములవారికి తలంబ్రాల ప్రక్రియ ప్రారంభం

చీరాల, మార్చి 30: స్థానిక పాపరాజుతోట నుంచి ప్రతి సంవత్సరం ఆనవాయితీగా శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణానికి తీసుకెళ్లే తలంబ్రాలకు పసుపు దంపుడు కార్యక్రమాన్ని భక్తులు శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్, ఆయన సతీమణి గీతలు ముఖ్యఅతిథులుగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమేష్‌బాబు

చీరాల టౌన్, మార్చి 30: చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమేష్‌బాబు రెండోసారి ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఎన్నికలు కోర్టు ఆవరణలో శనివారం నిర్వ హించారు. 212 ఓట్లకుగాను 172ఓట్లు రమేష్‌బాబుకు వచ్చాయి. ఉపాధ్యక్షులుగా బోయిన శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా కె.ఉదయ్‌భాస్కర్, సహాయకార్యదర్శిగా ఆలూరి మణినాగశయన, కోశాధికారిగా నాశిన రామకోటేశ్వరరావు, లైబ్రరీ కార్యదర్శిగా ఎస్. కామేశ్వరరావు, సాంస్కృతిక కార్యదర్శిగా రాజా సాల్మన్ తదితరులు ఎన్నికయ్యారు.

## సభలు, సమావేశాలకు అనుమతులు తీసుకోవాలి

పర్చూరు, మార్చి 30: ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు తదితర అంశాలకు సంబంధించి ఆయా రాజకీయ పార్టీలు తప్పక అనుమతులు తీసుకోవాలని పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పార్టీ తప్పక ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. సింగిల్ విండో సిస్టమ్ ద్వారా 24 గంటల వ్యవధిలోపే అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగే విధంగా ఆయా రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్‌లు సీహెచ్ సుబ్బయ్య, ఎం.ప్రమీల, వివిధ శాఖల అధికారులు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధిపొందాలి

మార్టూరు, మార్చి 30: నాటుకోళ్లను పెంచుకుంటూ మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి పొందాలని ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు అన్నారు. శనివారం స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో 28 ముస్లిం కుటుంబాలకు నాటుకోళ్ల యూనిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఏకమ్ సంస్థ (అమెరికా) సహకారంతో మహిళలకు నాటుకోళ్ల యూనిట్లను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.

సంస్థ కార్యదర్శి జాష్టి అనూరాధ మాట్లాడుతూ నాటుకోళ్ల గుడ్ల ద్వారా పోషక విలువలు గలిగిన ఆహారం పొందవచ్చునని చెప్పా రు. కార్యక్రమంలో ఎఫర్ట్ సంస్థ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## కుటుంబసభ్యులకు బాధితుడు అప్పగింత

స్వర్ణ(పర్చూరు), మార్చి 30: కారంచేడు మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన కట్టా సుబ్బారావు(24) తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని రాష్ట్ర పోలీసు కంట్రోల్ రూంకి శనివారం వాట్సప్ వీడియో పంపాడు. సమాచారం అందుకున్న ఎస్పీ వకుల్ జిందాల్ స్పందించారు. స్థానిక పోలీసులకు సమాచారం పంపి అప్రమత్తం చేశారు. ఇంకొల్లు సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో కారంచేడు పోలీసు సిబ్బంది అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా బాధితుడిని గుర్తించి, కుటుంబసభ్యులకు అప్పగించారు. యువకుడు ఎందుకు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారో పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. సకాలంలో ఎస్పీ స్పందించి తక్షణ చర్యలు చేపట్టడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మేదరమెట్ల, మార్చి 30 : మండలంలోని బొడ్డువానిపాలెంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. మేదరమెట్ల- నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి సమీపంలో నూతనంగా ఏర్పాటుచేశారు. మూడు రోజులుగా పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. ఉదయం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేద పండితులు ఆధ్వర్యంలో జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం మహిళలు కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# అభివృద్ధి, సంక్షేమం టీడీపీ లక్ష్యం

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, మార్చి 30: అభివృద్ధి, సంక్షేమం టీడీపీ లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని చిమ్మిరిబండ గ్రామానికి చెందిన పది ఎస్టీ కుటుంబాలు శనివారం ఇసుకదర్శిలోని క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే సాంబశివరావు పార్టీ కండువాలు మెడలో వేసి స్వాగతించారు. అలాగే, యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన మైనారిటీ, బీసీ కుటుంబాలు పార్టీలో చేరారు. వారిని ఏలూరి స్వాగతించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కుటుంబాలకు రాజకీయంగా గుర్తింపు లభించిందని చెప్పారు. రాజకీయంగా వారు ఉన్నత పదవులను అలంకరించడంలో తెలుగుదేశం పార్టీ సహకారం అందించిందన్నారు. రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో వారి సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం ప్రత్యేకంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. నిరుద్యోగ యువత, మహిళలకోసం ప్రత్యేక పథకాలను పార్టీ అధినేత చంద్రబాబు ఏర్పాటుచేస్తారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడి పని చేయాలన్నారు.


ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన చిమ్మిరిబండ ఎస్టీ కుటుంబాలు

**అరాచక వైసీపీని సాగనంపుదాం!**

పర్చూరు, మార్చి 30: ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శనివారం పర్చూరు ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మిగిల్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. అరాచక వాది జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నూతలపాడులో జరిగిన కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు విన్నకోట రవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలోకి చేరిన వైసీపీ నేతలు కంభంపల్లి పోతురాజు, కంభంపల్లి నాగేశ్వరరావు, పాశం మస్తాన్, కంభంపల్లి పెద్ద కోటేశ్వరరావు, గుగ్గిలం వీరాంజనేయులు, కంభంపల్లి నాగభూషణం, నాగేశ్వరావు, పోతురాజు, గన్నవరపు బాలకృష్ణ, జగదీష్, గన్నవరపు రాజశేఖర్, కంబాలపల్లి మస్తాన్, శ్రీకాంత్, జూపూడి భాస్కర్‌రావు, జూపూడి మార్కు, కుర్రి యోగానంద రెడ్డి, కంకట శ్రీనివాసరావు, గ్రంధి సీతారామయ్య, జయరాజ్, మార్పు అంజయ్య, లాజర్, బోలెద్దు సురేష్, సందీప్, షేక్.జిలానీ, ఇబ్రహీం, పఠాన్ మాబూసుభానీ, బాజీ, మస్తాన్, రాజా, కనపర్తి, గన్నవరపు వెంకటేశ్వర్లుకు ఏలూరి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో విన్నకోట సతీష్, షేక్ బాజీమా, గుమ్మడి వాసుబాబు, అద్దంకి రామ సుబ్బారావు, తమ్ములూరి సుబ్బారావు, తమ్ములూరి శివ తదితరులు పాల్గొన్నారు.


నూతలపాడులో పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే సాంబశివరావు

**ఆత్మీయ పలకరింపులు**

స్వర్ణ(పర్చూరు), మార్చి 30: కారంచేడు మండలం స్వర్ణలోని కాలనీలతోపాటు, గ్రామంలో ఏలూరి పర్యటించారు. ప్రధాన కూడలిలో ప్రజలతో కొద్దిసేపు ముచ్చటించారు. సోమిశెట్టి శ్రీకాంత్ కుమార్తెను, చింతపల్లి హనుమంతురావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తోట నాగమల్లేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఎస్సీ కాలనీని సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

# అరాచక పాలనను అంతమొందించాలి

- కూటమి అభ్యర్థి కొండయ్య పిలుపు

చీరాల, మార్చి 30: రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించాలని టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాబాయిని చంపిన వ్యక్తే, ఆయనను చంపింది ఎవరో దేవుడికి తెలుసని అనటం వైసీపీ మోసపు మాటలకు పరాకాష్ఠన్నారు. సుపరిపాలన ప్రజలకు అందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావటం అనివార్యమన్నారు.

**బీసీ డిక్లరేషన్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలి**

చీరాల, మార్చి, 30: బీసీ డిక్లరేషన్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని తోటవారిపాలెం భావనారుషిపేట, చంద్రమౌళినగర్‌లో శనివంరాం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో నేతన్నలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్‌తో ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. ఇవే విషయాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఆదివారం బాపట్లలో జరిగే చంద్రబాబు సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుద్దంటి చంద్రమౌళి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చంద్రమౌళినగర్‌లో బీసీ ఆత్మీయ సమావేశంలో యువకులతో కూటమి అభ్యర్థి కొండయ్య


**కొండయ్య దంపతులు ప్రత్యేక పూజలు**

చీరాల, మార్చి 30: స్థానిక పాపరాజుతోట నుంచి ప్రతి ఏడాది ఆనవాయితీగా భద్రాచల రాములవారికి పంపే కల్యాణం తలంబ్రాలు సిద్ధం చేసేందుకు శనివారం పసుపు దంచుడు కార్యక్రమాన్ని భక్తులు చేపట్టారు. కూటమి అభ్యర్థి కొండయ్య, బాలకొండమ్మ దంపతులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కొండయ్య దంపతులు పసుపును రోటిలో సంప్రదాయబద్ధంగా దంచారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పర్చూరు వైసీపీలో రగులుతున్న చిచ్చు

- బాలాజీతో కలిసి పనిచేయలేం.. పార్టీ మారం
- అసమ్మతి స్వరం వినిపిస్తున్న కారంచేడు ఎంపీపీ, ఇతర నేతలు

చీరాల, మార్చి 30: వైసీపీ పర్చూరు నియోజకవర్గంలో నెలకొన్న చిచ్చు రగులుతోంది. ఎమ్మెల్యే అభ్యర్థి యడం బాలాజీపై పలువురు తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు. కారంచేడు మండల పరిషత్ అధ్యక్షుడి చాంబర్‌లో శనివారం అసమ్మతి నేతలు బాలాజీపై స్వరం వినిపించారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, వైసీపీ మండల కన్వీనర్ దండా చౌదరి తదితరులు మాట్లాడుతూ యడం బాలాజీ ఒంటెద్దు పోకడకు పోతున్నారని చెప్పారు. పార్టీ నాయకులకు కనీస మర్యాదు ఇవ్వటం లేదన్నారు. మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. ఈక్రమంలో బాలాజీతో కలిసి పనిచేయలేమన్నారు. అయితే పార్టీ మారబోమని స్పష్టం చేశారు. పార్టీలో ఉంటే ఉండండి.. లేదంటే వెళ్లిపోండని బాలాజీ అనటం ఆయన నిరంకుశ ధోరణికి నిదర్శనమన్నారు. తాము సుదీర్ఘకాలంగా పార్టీలో పని చేస్తున్నామని చెప్పారు. తిమిడిదపాడులో జరిగిన కార్యక్రమంలో స్థానిక నేతకు సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవటం సరికాదన్నారు. తమ మనోభావాలు దెబ్బతిన్న తీరును, ఇదే పంథాను కొనసాగిస్తే పార్టీకి కలిగే నష్టాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.


వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యడం బాలాజీపై అసమ్మతి స్వరం వినిపిస్తున్న కారంచేడు మండల నాయకులు

# కేంద్ర బలగాలతో పోలీసుల కవాతు

మార్టూరు, మార్చి 30: అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో ప్రజానీకం ఎలాంటి అభద్రతా భావాలకు, ఆందోళనకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో శనివారం మండలంలోని కోనంకి, కోలలపూడి, బొల్లాపల్లి గ్రామాలలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. సీఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతో కలిసి 25 మంది కేంద్ర బలగాలతో వీధులలో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అల్లరి మూకలు, అసాంఘిక పనులకు పాల్పడే వ్యక్తుల ఆట కట్టించేందుకు పోలీసులు అన్నివేళలా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరగడానికి పోలీసులు ప్రజలకు అండగా ఉంటారన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేవ్యక్తులపై తక్షణమే స్పందిస్తామన్నారు. గ్రామస్థులు కూడా పోలీసులకు సహకరించాలన్నారు. కార్యకమంలో ఏఎస్ఐలు మహబూబ్ బాషా, సైదా పాల్గొన్నారు.


కోనంకిలో కవాతు చేస్తున్న ఎస్‌హెచ్‌వో రాజశేఖర్ రెడ్డి తదితరులు

## రేపటినుంచి పాలిసెట్ ఉచిత శిక్షణ

అద్దంకి, మార్చి 30: పాలిసెట్ అభ్యర్థులకు శింగరకొండ వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరప్రసాద్, కోర్సు డైరెక్టర్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ ప్రిల్ 27న జరిగే పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు సోమవారం నుంచి ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు 9949141277, 9705518378 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.



## పాపికొండల్లో జలధార వృక్షం!

గాటు పెడితే చాలు.. ఆ చెట్టు నుంచి జల జలా నీరు వస్తోంది. ఏలూరు జిల్లా పోలవరం మండలం పాపికొండల అభయారణ్యంలో ఈ అరుదైన జలధార వృక్షం కనిపించింది. కింటుకూరు అటవీ ప్రాంతంలోని బేస్ క్యాంప్ పరిశీలనకు వెళ్లిన అటవీ శాఖ సిబ్బంది ఈ వృక్షానికి కొంతమేర గాటు పెట్టగా ఎగదన్నినట్టుగా నీరు బయటకు వచ్చింది. దీనిపై అటవీ శాఖ క్షేత్రాధికారి ఎన్.దావీదురాజు వివరణ ఇస్తూ.. నల్లమద్ది, చంద్రమద్దిగా పిలవబడే ఈ వృక్షం సాంకేతిక నామం టెర్మినాలియా ఎలిప్టికా అని, దీనికి 20 నుంచి 40 లీటర్ల నీటిని నిల్వ ఉంచుకునే సామర్థ్యం ఉంటుందన్నారు. చెట్టుకు ఒకసారి గాటు పెట్టి.. నీరు వచ్చిన తర్వాత మళ్లీ ఏడాది వరకూ నీరు రాదని అటవీ అధికారులు తెలిపారు. ఒకసారి వృక్షం నుంచి నీరు వస్తున్న వీడియోలు శనివారం ప్రసార మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. - పోలవరం, దేవీపట్నం




## నిర్మించకపోయినా.. బోర్డు పెట్టేశారు!

అక్కడ ప్రహరీగా పెట్టిన రేకులు మాత్రమే కనిపిస్తున్నాయి. మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇంతలోనే అక్కడ 'డా. వైఎస్సార్ గవర్నమెంటు కాలేజీ, ఆదోని' అంటూ బోర్డు పెట్టేశారు. ఆరా తీస్తే.. జగన్ బస్సు యాత్ర శుక్రవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మీదుగా ఆదోని నుంచి పత్తికొండకు వెళ్లింది. ఆదోని-ఆరేకల్లు మధ్యలో ఈ మెడికల్ కాలేజీ భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. వాటి పనులు 20శాతం కూడా పూర్తి కాలేదు. అయినా సరే.. జగన్ ఈ రహదారిలో వెళ్తున్నాడని అక్కడ మెడికల్ కాలేజీ బోర్డు పెట్టేశారు. భవనాలు పూర్తికాకుండానే బోర్డు పెట్టేయడంతో స్థానికులు నవ్వుకుంటున్నారు. - ఆదోని రూరల్

## జగన్ బస్సు యాత్ర తుస్సు: ఉమా

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి బస్సు యాత్ర తుస్సుమందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఎద్దేవా చేశారు. శనివారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఓటమి భయంతో చెప్పిన అబద్ధాన్నే పదేపదే చెబుతూ, ప్రజల్ని ఇంకా మోసం చేయాలని చూస్తున్నాడు. ఒక్క చాన్స్ అంటూ పాదయాత్రలో ముద్దులు పెట్టి, ఐదేళ్లు అందర్నీ ఇబ్బంది పెట్టి, రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడు. సొంత చెల్లెళ్లు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, బాబాయిని చంపిన హంతకుల్ని పక్కన పెట్టుకుని, ఓట్లు ఎలా అడుగుతాడు? మద్య నిషేధం చేసిన తరువాతే ఓట్లు అడుగుతానన్న వ్యక్తి హామీని అమలు చేయకుండానే ఓట్లు అడగటానికి సిగ్గుండాలి' అని ఉమా మండిపడ్డారు.

## జగన్‌రెడ్డిని తరిమేందుకు ప్రజలు సిద్ధం: బుద్దా వెంకన్న



విజయవాడ, మార్చి 30: జగన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు రాజ్యాంగ పదవులను దూరం చేసిన బీసీ ద్రోహి జగన్‌రెడ్డి అని పేర్కొన్నారు. పెత్తందారులనే పదానికి బ్రాండ్ అంబాసిడర్ జగన్‌రెడ్డి అన్నారు. కరుడుకట్టిన దుర్మార్గుడు జగన్‌రెడ్డి మాయమాటలను నమ్మేందుకు ఎవ్వరూ సిద్ధంగా లేరు. వైసీపీని కట్టకట్టి చిత్తుగా ఓడించి బంగాళఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. జగన్‌రెడ్డి తానేదో పేదలను ఉద్ధరిస్తున్నట్టు, చంద్రబాబు 'పేదల ద్రోహి అన్నట్టు అబద్ధాలను చెబుతూ ప్రజలను మోసం చేయడం సిగ్గుచేటు' అని వెంకన్న విమర్శించారు.

## ఒకటో తేదీనే పింఛన్లు పంచాలి: అచ్చెన్న

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పింఛన్లు ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇచ్చేలా యుద్ధప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి ఆయన ఓ ప్రకటన చేస్తూ, 'జగన్‌రెడ్డి వలంటీర్లను సేవకుల్లా ప్రజాసేవకు కాకుండా, వైసీపీ కార్యకర్తల్లా వాడుకున్నాడు. ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘించేలా చేసి, వందల మంది వలంటీర్లు సస్పెన్షన్లకు, వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు కారకుడయ్యాడు. మరోవైపు ఒకటో తేదీన పెన్షన్లకు ఇవ్వాల్సిన సొమ్మంతా తన అనుకూల కాంట్రాక్టర్లకు ఊడ్చిపెట్టాడు. ఈనెల పెన్షన్లు ఇవ్వడానికి ఖజానాలో డబ్బులు లేకుండా పోయాయి. తన దుర్మార్గాన్ని కప్పిపుచ్చుకోవటానికి ఎన్నికల కమిషన్‌పైన, నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌పైనా దుష్ప్రచారం చేస్తున్నాడు. రాబోయే టీడీపీ ప్రభుత్వం నెలకు రూ.4,000ల పెన్షన్‌ను ఇంటి వద్దకే వచ్చి ఇస్తుంది. వలంటీర్లను వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా, ప్రజాసేవ మాత్రమే చేసేలా కొనసాగిస్తుంది' అని అచ్చెన్న స్పష్టం చేశారు.

## వక్ఫ్ కమిటీ సభ్యులు ప్రచారంలో పాల్గొనకుండా చూడాలి: మైనార్టీ మోర్చా

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): 'వక్ఫ్ చట్టం 1995, సెక్షన్ 101 కింద వక్ఫ్ సంస్థల ముతవల్లిలు, మేనేజ్‌మెంట్ కమిటీలోని సభ్యులు పబ్లిక్ సర్వెంట్స్ కిందకి వస్తారు. వారు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చూడాలి' అని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి షేక్ కమ్రుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. 'గతంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సీఈవోగా వ్యవరించిన షేక్ అబ్దుల్ ఖాదర్‌ను కోనసీమ జిల్లా వక్ఫ్ కమిటీ అధ్యక్షునిగా నియమించారు. ఆయన ప్రస్తుతం ఎన్నికల్లో అధికార వైసీపీకి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. ఈ విషయమై విచారణ చేసి ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఆయనను జిల్లా వక్ఫ్ కమిటీ అధ్యక్ష పదవి నుంచి సస్పెండ్ చేయాలి' అని కమ్రుద్దీన్ కోరారు.

## వైసీపీకి ఓటేస్తే రాష్ట్రం వందేళ్లు వెనక్కి: లంకా దినకర్

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): 'వైసీపీకి ఒక్కసారి ఓటేస్తే 20 ఏళ్ల రాష్ట్రం వెనక్కి పోయింది. ఇప్పుడు జాగ్రత్త పడకుంటే వందేళ్ల కోలుకోలేం' అని బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. 'నరకాసురుడు, రావణుడు, దుర్యోధనుడి కలబోతే జగన్‌రెడ్డి. రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడి రాముడి పాలనకు శ్రీకారం చుట్టాల్సిన బాధ్యత ప్రతి ఓటరుపై ఉంది' అని దినకర్ విజ్ఞప్తి చేశారు.

## లోకేశ్‌తో సుజనా భేటీ

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ అసెంబ్లీ ఎన్డీఏ అభ్యర్థి సుజనా చౌదరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌తో భేటీ అయ్యారు. ఎన్నికల్లో విజయానికి సహకరించాలని, టీడీపీ నుంచి టికెట్ ఆశించి అసంతృప్తితో ఉన్న జలీల్ ఖాన్, బుద్దా వెంకన్నతో మాట్లాడాలని కోరినట్లు తెలిసింది. మరోవైపు జనసేన నుంచి టికెట్ ఆశించిన పోతిన మహేశ్ కూడా అసంతృప్తితో ఉన్నారు. ఆయన్ను బుజ్జగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

## కోర్టుల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

- రాష్ట్రవ్యాప్తంగా 643 కోర్టుల్లో ఏసీలు: జస్టిస్ బి.కృష్ణమోహన్



ఏలూరు జిల్లా కోర్టులో ఏసీలను ప్రారంభిస్తున్న జస్టిస్ బి.కృష్ణమోహన్

ఏలూరు క్రైం, మార్చి 30: కోర్టుకు వచ్చే కక్షిదారులకు, న్యాయవాదులకు, సిబ్బంది, న్యాయాధికారులకు మౌలిక సదుపాయాల్లో భాగంగా కోర్టు హాల్స్‌లో ఎయిర్ కండిషన్స్ ఏర్పాటు చేస్తామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పోర్టు పోలియో జడ్జి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రప్రథమంగా ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని అన్ని కోర్టు హాళ్లల్లో ఏర్పాటు చేసిన ఏసీలను, రూ.22 లక్షలతో ఏర్పాటు చేసిన లిఫ్టును, సోలార్ సిస్టమ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. 'రాష్ట్రవ్యాప్తంగా 643 కోర్టులలో ఎయిర్ కండిషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 48 కోర్టులు ఉండగా 209 ఏసీ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు' అన్నారు.

## 27 మందితో బీజేపీ మేనిఫెస్టో కమిటీ

న్యూఢిల్లీ, మార్చి 30: కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టాలనుకుంటున్న బీజేపీ.. లోక్‌సభ ఎన్నికలకు 27 మంది సభ్యులతో మేనిఫెస్టో కమిటీని నియమించింది. కమిటీకి చైర్మన్‌గా రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, కన్వీనర్‌గా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కో-కన్వీనర్‌గా కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను నియమించింది.

## ప్రపంచ నేతలందు మోదీ వేరయా!

- భారత ప్రధానికి విద్యావంతుల మద్దతు.. 'ది ఎకనమిస్ట్' కథనం

న్యూఢిల్లీ, మార్చి 30: అత్యంత ప్రజాకర్షణ కలిగిన రాజకీయ నేతల నాయకత్వాన్ని ఉన్నతవర్గాలవారు వ్యతిరేకించడం సర్వసాధారణం కానీ భారత ప్రధాని నరేంద్ర మోదీ విషయంలో మాత్రం అలా జరగడంలేదని అంతర్జాతీయ వారపత్రిక 'ద ఎకనమిస్ట్' పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా జనాకర్షణ కలిగిన నాయకుల అంశంలో ఉన్న ట్రెండ్‌కు విరుద్ధంగా మోదీకి విద్యావంతుల మద్దతు నానాటికి అధికమవుతోందని తెలిపింది. ఈ మేరకు 'వై ఇండియాస్ ఇలీట్స్ బ్యాక్ నరేంద్ర మోదీ' పేరిట ఓ కథనాన్ని ప్రచురించింది.

# పీకల్లోతు కష్టాల్లో విశాఖ ఉక్కు

- విద్యుత్ బిల్లు బకాయి 120 కోట్లు
- కర్మాగారానికి ఈపీడీసీఎల్ అధికారులు
- డబ్బులు కట్టకుంటే సరఫరా నిలిపివేస్తామని హెచ్చరిక
- 20 కోట్లు చెల్లించిన యాజమాన్యం
- ఉత్పత్తి తగ్గించుకోవాలని నిర్ణయం



స్టీల్‌ప్లాంటు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో కార్మికులకు జీతాలు చెల్లించలేకపోతోంది. విద్యుత్ బిల్లును కూడా సకాలంలో కట్టకపోవడంతో సరఫరా నిలిచిపోయే పరిస్థితి ఎదురైంది. ప్లాంటు నడపడానికి అవసరమైన విద్యుత్‌ను తయారుచేసుకునేందుకు 340 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటును నిర్మించుకుంది. అయితే దీనికి అవసరమైన బొగ్గును కోల్ ఇండియా సరఫరా చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఆధారపడింది. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) నుంచి గత కొన్ని నెలలుగా విద్యుత్ వాడుకుంటోంది. అయితే దానికి కూడా బిల్లును సకాలంలో కట్టలేకపోతోంది. ప్రతి నెలా 50 శాతం నుంచి 60 శాతం చెల్లిస్తోంది. ప్రస్తుతం విద్యుత్ బిల్లు బకాయి రూ.126 కోట్లకు చేరింది. ఆర్థిక సంవత్సరం ఆఖరు రోజులు కావడంతో ఎంతో కొంత చెల్లించాలని, లేదంటే సరఫరా ఆపేస్తామంటూ ఈపీడీసీఎల్ అధికారులు ప్లాంటుకు వెళ్లి అధికారుల ముందు కూర్చున్నారు. శనివారం ఉదయం నుంచి రాత్రి ఏడు గంటల వరకూ అక్కడే ఉన్నారు. కానీ యాజమాన్యం రూ.20 కోట్లు కంటే ఎక్కువ చెల్లించలేకపోయింది.

### ఉత్పత్తి తగ్గించుకునేందుకు ఏర్పాట్లు

ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా సోమవారం నుంచి పూర్తిస్థాయిలో విద్యుత్ అందే అవకాశం లేకపోవడంతో ఆ మేరకు ఉత్పత్తి తగ్గించుకోవాలని యాజమాన్యం నిర్ణయించింది. విద్యుత్ అందకపోతే ప్రత్యామ్నాయం ఏమిటనే దానిపై అధికారులంతా కలసి చర్చించారు. సొంతంగా విద్యుత్ తయారుచేసుకునే అవకాశం లేదు కాబట్టి వచ్చినంత మేరకే ఉత్పత్తి చేయాలని, అనవసరమైన విద్యుత్ వినియోగం తగ్గించుకోవాలని నిర్ణయించారు. టౌన్‌షిప్‌లో రాత్రిపూట వీధి దీపాలు వేయకుండా ఉంటే కొంతవరకు విద్యుత్ ఆదా అవుతుందని, ఆ విధంగా ముందుకువెళ్లాలని ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటివరకు ముడి పదార్థాలకు మాత్రమే కొరత ఏర్పడి స్టీల్ ఉత్పత్తిని తగ్గించుకున్నారు. ఇపుడు విద్యుత్ సరఫరా అందక ఉత్పత్తి మరింత తగ్గించుకోవలసిన రావడంతో ఉద్యోగ, కార్మిక వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.



విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న అమితాబ్ చౌదరి

## సవాళ్ల స్వీకరణకు సిద్ధంగా ఉండాలి

- అప్పుడే ఉన్నత స్థానానికి చేరుకునేందుకు అవకాశం
- జీవితంలో ఎప్పుడూ పరిధులు పెట్టుకోకూడదు
- యాక్సిస్ బ్యాంక్ సీఈవో అండ్ ఎండీ అమితాబ్ చౌదరి
- ఘనంగా ఐఐఎం విశాఖపట్నం ఎనిమిదో స్నాతకోత్సవం

విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సవాళ్ల స్వీకరణకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని, అప్పుడే ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానానికి చేరుకునేందుకు అవకాశం ఉంటుందని యాక్సిస్ బ్యాంకు ఎండీ అండ్ సీఈవో అమితాబ్ చౌదరి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం విశాఖ నగరంలోని నోవాటెల్ హోటల్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవీ) ఎనిమిదో స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వృత్తి జీవితంలో ఎదురయ్యే సవాళ్లే ఆ రంగంలో మెరుగైన స్థానంలో ఉండేలా చేస్తాయన్నారు. జీవితంలో ఎప్పుడూ లిమిటేషన్స్, బౌండరీస్ పెట్టుకోకూడదని విద్యార్థులకు అమితాబ్ సూచించారు. రానున్న ఆరేళ్లలో భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగబోతోందన్నారు. సత్తా కలిగిన వారికి అనేక రంగాల్లో గొప్ప అవకాశాలు లభిస్తాయని ఈ సందర్భంగా ఆయన స్పష్టంచేశారు. భారత్ రానున్న రోజుల్లో గ్లోబల్ లీడర్‌గా ఎదగబోతోందని, డిజిటల్ లావాదేవీల్లో అగ్రస్థానంలో ఉందన్నారు. కొన్నిసార్లు రిస్క్‌తో కూడిన నిర్ణయాలు ఉన్నత స్థానానికి తీసుకువెళతాయన్నారు. జీవితాంతం నేర్చుకుంటూనే ఉండాలని, అప్పుడే ఉన్నత స్థానాన్ని చేరుకోవడం సాధ్యమవుతుందన్నారు. కొత్త ఆలోచనలను ఆవిష్కృతం చేయాలని ఈ సందర్భంగా చౌదరి సూచించారు. వృత్తిరీత్యా ఎదురయ్యే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు యత్నించాలని, అందుకు ఉన్న మార్గాలను అనుసరించాలన్నారు. ఇష్టంతో పనిచేస్తే మంచి ఫలితాలు రాబట్టడం సాధ్యపడుతుందన్నారు. ఐఐఎం బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ హరి భార్టియా మాట్లాడుతూ ఇనిస్టిట్యూట్‌కు గొప్ప పేరు తీసుకువచ్చేలా విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్‌తోపాటు ప్రొఫెసర్లు, అధిక సంఖ్యలో విద్యార్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తొలిసారి ఇద్దరు విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేశారు.

# ఎన్నికల క్షేత్రంలోకి దొంగ ఓట్ల వైరస్

- ఏపీ మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేశ్

హైదరాబాద్ సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): "దొంగ ఓట్ల రూపంలో ఎన్నికల క్షేత్రంలో కరోనాకన్నా భయంకరమైన ఓ కొత్త వైరస్ ప్రవేశించింది. 2021 నాటి తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక ఇందుకు నిదర్శనం. ఆ ఎన్నికల్లో 35 వేల దొంగ ఓట్లు, ఓ నకిలీ ఎన్నికల అధికారిని ఈసీ గుర్తించింది. అధికార వైసీపీ అన్ని వేల దొంగ ఓట్లను సృష్టించింది. ఇతర ప్రాంతాల నుంచి దొంగ ఓటర్లను బస్సులు, రైళ్ల ద్వారా తిరుపతికి తరలించి మరీ దొంగ ఓట్లు వేయించింది" అని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం విశ్రాంత అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో చిన్న, మధ్యతరహా దినపత్రికల అసోసియేషన్ ఆధ్వర్యంలో 'స్వేచ్ఛ-నిష్పక్షపాతంగా ఎన్నికలు: రాజ్యాంగ హక్కులను ఎలా కాపాడుకోవాలి' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రధాన వక్తగా మాట్లాడారు. టీఎన్ శేషన్ లాంటి అధికారులు ఇప్పుడు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించినందుకు గతంలో భారత ఎన్నికల సంఘం పలువురు ప్రజా ప్రతినిధులను పదవీచ్యుతులను చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఎన్నికల కమిషన్ ఉదాసీన వైఖరి వల్ల దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యం బలహీనపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవ్వగానే.. సీఎం, క్యాబినెట్ పదవులను రద్దుచేసి, గవర్నర్ పాలనను విధిస్తే కొంతవరకు ఎన్నికలు సజావుగా సాగే అవకాశాలుంటాయని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేని వ్యక్తులు సీఎం పీఠంపై కూర్చోవాలని పరితపించడం వల్లే దొంగోట్ల వంటి అనైతిక చర్యలు తీవ్రరూపు దాలుస్తున్నాయన్నారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రభుత్వానికి సున్నితమైన మెజారిటీ ఉండడం, రాజకీయ నాయకులకు నైతికత, నిలకడ లేకపోవడం, ప్రతిపక్షంలో పదినిమిషాలు కూడా ఉండలేనితనం వంటి కారణాలతో రాజకీయ బలాబలాలు వేగంగా మారడం చూస్తున్నామని ప్రస్తుత పరిస్థితులపై వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీలు నియమించుకునే వివిధ కన్సల్టెన్సీలు ఈవీఎంకు-ఓటరుకు మధ్య దూరి ఓటరు అభిప్రాయాన్ని ప్రభావితం చేస్తున్నాయని విమర్శించారు. "ఆంధ్రప్రదేశ్‌లో అధికార పార్టీ దౌర్జన్యాలను నిలువరించడం కోసం.. ప్రజా బలంలేని బీజేపీతో తెలుగుదేశం పొత్తుపెట్టుకుంది. దీనిబట్టి ఎన్నికల ప్రక్రియ అధికారంలో ఉన్నవారికి అనుగుణంగా ఉన్నదని అర్థమవుతోంది" అని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో నుంచి అధికార పక్షంలోకి వెళ్లడం కూడా ఒకలాంటి రిగ్గింగేనన్నారు. స్కైలైన్ డైలీ ఎడిటర్ కేఎస్ రంగసాయి సభాధ్యక్షత వహించిన ఈ సదస్సులో తాటికొండ కృష్ణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్ ఆస్తుల ఈడీ అటాచ్‌మెంట్ చెల్లదు

- సీఐడీ జప్తు చేయని ఆస్తుల విషయంలో పీఏవో ఉత్తర్వులను సమర్థించిన హైకోర్టు
- డిపాజిటర్ల ప్రయోజనాలు కాపాడేందుకు పీఎంఎల్‌ఏ చట్టంలో ప్రొవిజన్ లేదని వెల్లడి
- ఏపీ డిపాజిటర్ల చట్టంలోని నిబంధనలు బాధితులకు రక్షణగా ఉన్నాయని స్పష్టీకరణ

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సీఐడీ జప్తు చేసిన అగ్రిగోల్డ్ ఆస్తులను తిరిగి జప్తు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఇచ్చిన ప్రొవిజనల్ అటాచ్‌మెంట్(పీఏవో) ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. ప్రత్యేక కోర్టు అనుమతితో ఏపీ డిపాజిటర్స్ యాక్ట్ నిబంధనలు అనుసరించి సీఐడీ చేసిన ఆస్తుల జప్తును సమర్థించింది. సీఐడీ జప్తు చేయని ఆస్తుల విషయంలో పీఎంఎల్‌ఏ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవచ్చని ఈడీకి స్పష్టం చేసింది. వాటి విషయంలో ఈడీ ఇచ్చిన ప్రొవిజనల్ అటాచ్‌మెంట్ ఆర్డర్స్ అమల్లో ఉంటాయని పేర్కొంది. అగ్రిగోల్డ్ వ్యవహారంలో ఈడీ తన దర్యాప్తు కొనసాగించుకోవచ్చని తెలిపింది. బ్యాంకుకు తనఖా పెట్టి ఆస్తులు, అప్పుల రికవరీ ట్రిబ్యునల్ వేలంలో కొనుగోలు చేసిన ఆస్తులు, అగ్రిగోల్డ్ సంస్థపై కేసు నమోదు చేయకముందు కొనుగోలు చేసిన భూములను, అపార్ట్‌మెంట్‌ను సీఐడీ జప్తు చేసిన వ్యవహారాన్ని ఏలూరు ప్రత్యేక కోర్టులోనే తేల్చుకోవాలని యునియన్ బ్యాంక్, బీఎల్‌జీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, ఆల్ ఇండియా అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, పార్చ్యూన్ అపార్ట్‌మెంట్ ఓనర్స్ అసోసియేషన్‌ను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి తీర్పు ఇచ్చారు.

అగ్రిగోల్డ్‌కి సంబంధించిన ఆస్తులను జప్తు చేస్తూ ఈడీ, రాష్ట్ర సీఐడీ పోలీసులు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఆస్తుల జప్తు ఉత్తర్వులను సవాల్ చేస్తూ అగ్రిగోల్డ్ ఫామ్స్ ఎస్టేట్స్ యాజమాన్యం, అగ్రిగోల్డ్ నుంచి కనుగోలు చేసిన భూముల్లో కట్టిన అపార్ట్‌మెంట్‌ను జప్తు చేయడాన్ని సవాల్ చేస్తూ ఏలూరు పార్చ్యూన్ అపార్ట్‌మెంట్ ఓనర్స్ అసోసియేషన్, అగ్రిగోల్డ్ సంస్థపై కేసు నమోదు చేయకముందే ఆస్తులు కొనుగోలు చేసినందున వాటిని ఈడీ, సీఐడీ జప్తు చేయడానికి వీల్లేదని ఆల్ ఇండియా అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆస్తులను తనఖా పెట్టుకొని రుణాలు ఇచ్చినందున వాటిని వేలం వేసే హక్కు తమకే ఉంటుందని యునియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రుణాల రికవరీ ట్రిబ్యునల్ ఆక్షన్ ద్వారా అగ్రిగోల్డ్ ఆస్తులు కొనుగోలు చేశామని, వాటిని జప్తు చేయడానికి వీల్లేదని బీఎల్‌జీ ఇన్‌ఫ్రా వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించాయి. ఈ వ్యాజ్యాలపై న్యాయస్థానం తుది విచారణ జరిపింది. ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి ఇటీవల నిర్ణయాన్ని వెల్లడించారు.

### తీర్పులో ఏముందంటే

"అధిక వడ్డీలు, ప్రయోజనం ఆశచూపి డిపాజిటర్ల వద్ద అగ్రిగోల్డ్ సంస్థ సొమ్ము వసూలు చేసింది. ఇచ్చిన హామీకి అనుగుణంగా సొమ్ము చెల్లించడంలో సంస్థ విఫలమైందనేది ప్రాథమిక ఆరోపణ. ఇది ఏపీ డిపాజిటర్ల చట్టంలోని సెక్షన్ 5ని ఉల్లంఘించడమే. ఆర్థిక నేరాల విషయంలో నిందితుల నుంచి సాధ్యమైనంత రికవరీ చేసి కష్టార్జితం కోల్పోయినవారికి తిరిగి చెల్లించడమే చట్టాల ముఖ్య ఉద్దేశం. ఆస్తులు జప్తు చేసినంత మాత్రాన చట్టం ఉద్దేశం నెరవేరదు. బాధితులకు ఎలాంటి ప్రయోజనం కలగదు. పీఎంఎల్‌ఏ చట్టంలో డిపాజిటర్ల ప్రయోజనాలు కాపాడేందుకు ఎలాంటి ప్రొవిజన్ లేదు. డిపాజిటర్లకు రక్షణ కల్పించే విషయంలో ఏపీ డిపాజిటర్ల చట్టంలోని సెక్షన్లు ఉపయుక్తంగా ఉన్నాయి. జప్తు చేసిన సంస్థ ఆస్తులు విక్రయించి బాధితులకు సమానంగా పంచేందుకు డిపాజిటర్ల చట్టం అవకాశం కల్పిస్తోంది. డిపాజిటర్ల చట్టాన్ని అనుసరించి ఏలూరు ప్రత్యేక కోర్టు ఇచ్చే ఉత్తర్వులు డిపాజిటర్ల ప్రయోజనాలు కాపాడతాయి. ఈ నేపథ్యంలో 2015లో సీఐడీ జప్తు చేసిన అగ్రిగోల్డ్ ఆస్తులను తిరిగి జప్తు చేస్తూ 2020 డిసెంబరు 4న, 2021 నవంబరు 30న ఈడీ ఇచ్చిన ప్రొవిజనల్ అటాచ్‌మెంట్ ఉత్తర్వులను కొట్టివేస్తున్నాం. సీఐడీ జప్తు చేయని ఆస్తుల విషయంలో పీఎంఎల్‌ఏ యాక్ట్ ప్రకారం ఈడీ చర్యలు తీసుకోవచ్చు. వాటి విషయంలో ఈడీ ఇచ్చిన ప్రొవిజనల్ అటాచ్‌మెంట్ ఆర్డర్స్ అమల్లో ఉంటాయి. ఈడీ తన దర్యాప్తును కొనసాగించుకోవచ్చు" అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

## వైసీపీకి అడ్డాగా నెల్లూరు ఎస్పీ ఇల్లు

- ఆయనను ఎన్నికల విధుల నుంచి తప్పించాలి
- ఇసుక అక్రమ రవాణాను వెంటనే ఆపాలి
- టీడీపీకి ఓటేస్తే ఎన్‌ఆర్‌ఐలను తొక్కేస్తానని బాపట్ల వైసీపీ అభ్యర్థి హెచ్చరించారు
- ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలి
- సీఈవోకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల ఫిర్యాదు

అమరావతి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డిని వెంటనే ఎన్నికల విధుల నుంచి తొలగించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాను కలసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "నెల్లూరు ఎస్పీ మామ దుగ్గిరెడ్డి గురవారెడ్డి అధికార వైసీపీ జడ్పీటీసీగా పని చేశారు. ఎస్పీ ఇంటికి గురవారెడ్డి వైసీపీ కార్యకర్తలను తీసుకుని రోజు భోజనానికి వస్తున్నారు. ఎస్పీ ఇల్లు వైసీపీ కార్యాలయంలా మారింది. ఎస్పీని వెంటనే నెల్లూరు జిల్లా నుంచి బదిలీ చేయాలి. ఆయనకు నైతిక విలువలు ఉంటే వెంటనే అక్కడ నుంచి తప్పుకోవాలి. గురవారెడ్డి నెల్లూరు ఎంపీ విజయసాయిరెడ్డిని గెలిపించాలని రోజు ప్రచారం చేస్తూ ఎస్పీ ఇంటిలో ఉంటే ప్రజల్లోకి ఏమి మెసేజ్ వెళుతుంది? తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండలం మున్నంగి గ్రామంలో ఇసుక రీచ్‌లో విపరీతంగా అక్రమ మైనింగ్ జరుగుతుంది. ఇది వెంటనే ఆపాలి. అక్రమ మైనింగ్ ద్వారా వచ్చిన డబ్బుతో వైసీపీ గెలవాలని చూస్తోంది. అక్రమ ఇసుక రవాణా జరగడం లేదని ప్రతి జిల్లా కలెక్టరు, సీఎస్‌కు మూడు రోజులకొకసారి నివేదిక ఇవ్వాలి. అయితే సీఎస్‌ను కూడా ఏ జిల్లా కలెక్టరు పట్టించుకోవడం లేదు. వైసీపీ వాళ్ల ఇసుక అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన డబ్బుని ఎన్నికలకు వాడుతున్నారు. ఇది వెంటనే ఆపాలి. అక్రమ మార్గంలో ఎన్నికల్లో గెలవాలని సీఎం జగన్ ప్లాన్. అందుకే రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఎవ్వరు అక్కడకు వెళ్లడంలేదు. బాపట్ల జిల్లా ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అశోక్‌బాబు బాగా డబ్బుతో మదించి ఉన్నారు. ఆయన శుక్రవారం ప్రెస్ మీట్‌లో... 'ఎన్‌ఆర్‌ఐలు అందరు వైసీపీకి ఓట్లు వెయ్యకుండా టీడీపీకి సపోర్టు చేస్తున్నారు. టీడీపీకి ఓట్లు వేయాలని చూస్తున్నారు. అలా గనుక జరిగితే మీ మీ దేశాలకు వెళ్లరు. తొక్కేస్తా' అంటూ ఎన్‌ఆర్‌ఐలపై బెదిరింపులకు దిగుతున్నారు. ఆయనపై ఈసీ చర్యలు తీసుకోవాలి. ఆయన అలా మాట్లాడుతుంటే అక్కడ ఉన్న పోలీసులు అరెస్టు చేయ్యవద్దా..! డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏ ఒక్క పోలీసూ వారి వారి విధులు నిర్వహించకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు" అని వర్ల విమర్శించారు.

## ఫైబర్ నెట్ ప్రసారాలలో అంతరాయం

- జగన్ బొమ్మ మార్చటానికి సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లో తీవ్ర జాప్యం
- ఇప్పటికీ పూర్తిగా అందుబాటులోకి రాని ప్రసారాలు

విజయవాడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఏపీ ఫైబర్ నెట్ ప్రసారాలలో తీవ్ర అంతరాయాలు నెలకొన్నాయి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ చిత్రాలను తొలగించటానికి వీలుగా సాఫ్ట్‌వేర్ అప్డేట్ చేపట్టడంలో నెలకొన్న నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. ఇప్పటికి సగానికి పైగా జిల్లాల్లో ఏపీ ఫైబర్‌నెట్ ప్రసారాలు నిలిచిపోయాయి. ఏపీ ఫైబర్‌నెట్‌ను కూడా ప్రభుత్వం తన ప్రచారానికి వాడుకుంటోంది. ముఖ్యమంత్రి జగన్‌కు సంబంధించిన ప్రచారాన్ని పెద్ద ఎత్తున ఏపీ ఫైబర్‌నెట్ ద్వారా నిర్వహిస్తున్నారు. సెటాప్ బాక్స్ ఆన్‌చేయగానే.. టీవీ తెరపై ముఖ్యమంత్రి జగన్ బొమ్మ కనిపిస్తుంది. ఆ తర్వాత వచ్చే ఇంటర్ ఫేజ్‌లో కూడా ముఖ్యమంత్రి బొమ్మలు, పథకాల ప్రచారం కనిపిస్తుంటుంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో దీనిపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు అందాయి. దీంతో ఫైబర్‌నెట్‌లో ముఖ్యమంత్రి బొమ్మలను, పథకాల ప్రచారాల పోస్టర్లను తొలగిస్తూ సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ ప్రారంభించారు. ఈ ప్రక్రియలో అంతులేని జాప్యం చోటు చేసుకోవటం వల్ల ఫైబర్‌నెట్ ప్రసారాలలో అవాంతరాలు తలెత్తాయి. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో ప్రసారాలు నిలిచిపోయాయి. ఫైబర్ నెట్ సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్‌లో భాగంగా సిబ్బంది తగిన విధంగా స్పందించకపోవటమే ఈ సమస్యకు కారణమని తెలుస్తోంది. ఏపీ ఫైబర్‌నెట్ సాంకేతిక సిబ్బంది ఆ సంస్థ ఉన్నతాధికారి ఫంక్షన్‌కు హాజరు కావటం, ఆ పనుల్లో పాలు పంచుకోవటం వల్ల కూడా నిర్ణీత సమయంలో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయలేదు. దీంతో మూడు రోజులకు పైగా ఫైబర్ నెట్ ప్రసారాలు ఆగిపోయాయి. ఆ తర్వాత సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసినా.. ఆపరేటర్ల స్థాయిలో అప్‌డేషన్ చేసుకునే అవకాశాన్ని కల్పించలేదు. ఆపరేటర్ల స్థాయిలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కాకపోవటం వల్ల ఇప్పటికీ కూడా చాలా ప్రాంతాలకు ఏపీ ఫైబర్ నెట్ ప్రసారాలు అందటం లేదు.

## తిరుమల ఘాట్‌లో ప్రమాదం

- చెట్టును ఢీకొన్న కారు: బెంగళూరు భక్తురాలి మృతి



భవాని మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, ప్రమాదానికి గురైన కారు

తిరుమల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ భక్తురాలు మృతి చెందింది. మరో భక్తుడికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురు పిల్లలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బెంగళూరుకు చెందిన మురళీధర్, భవాని దంపతులు 10 మంది కుటుంబ సభ్యులతో మూడు కార్లలో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. శనివారం సాయంత్రం 6 గంటలకు తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మురళీధర్, భవానీ, వారి ఇద్దరు పిల్లలు ప్రజ్వల్, నిసర, మురళీధర్ అన్న కుమార్తె రక్షితతో కలిసి సొంత్రో కారులో తిరుమల నుంచి బయలుదేరారు. ఏనుగుల ఆర్చి దాటిన తర్వాత కారు అదుపుతప్పి ఎడమవైపున్న అడవిలోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో భవాని మృతి చెందింది. కారు నడుపుతున్న ఆమె భర్త మురళీధర్ తీవ్ర గాయాలతో తిరుపతి బర్డ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పిల్లలు ముగ్గురూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.



కాకినాడ సముద్ర తీరంలో సైనికుల యుద్ధ విన్యాసాలు

## ముగిసిన ఇండో-అమెరికా సైనిక విన్యాసాలు

సర్పవరం జంక్షన్, మార్చి 30: కాకినాడ సముద్ర తీరంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న 'ఎక్స్ టైగర్ ట్రయంఫ్-24' సీ ఫేజ్ విన్యాసాలు శనివారం ముగిశాయి. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట నేవల్ ఎన్‌క్లేవ్‌లో భారత్-అమెరికా యాంఫీబీఎస్ విన్యాసాల్లో భాగంగా ఇరుదేశాలకు చెందిన సుమారు 1100 మంది త్రివిధ దళాల సైనికులు, అధికారులు ఈ నెల 27 నుంచి 30 వరకు నిర్వహించిన సైనిక విన్యాసాలు దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణాన్ని తలపించేలా జరిగాయి. నేవీ రియల్ అడ్మిరల్ ఫ్లాగ్ ఆఫీసర్ రాజేష్ ధనకర్, ఆర్మీ మేజర్ జనరల్ అఖిలేష్‌కుమార్, అమెరికా నేవీ రియర్ అడ్మిరల్ వైస్ కమాండర్ జాక్విన్ మార్టినెజ్ పాల్గొని త్రివిధ దళాలు నిర్వహించిన విన్యాసాలను తిలకించి పలు సూచనలు చేశారు.



## రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం) : 6.22

సహరి (సోమవారం) : 4.47

## ఉష్ణోగ్రతలు

| ప్రాంతం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నెల్లూరు | 38.0 | 25.0 |
| కావలి | 37.0 | 25.0 |
| కందుకూరు | 37.0 | 26.0 |
| ఆత్మకూరు | 41.0 | 24.0 |
| ఉదయగిరి | 36.0 | 24.0 |





సాంకేతిక విప్లవంలో ప్రధానమైనది సోషల్ మీడియా. అరచేతిలోని ఆండ్రాయిడ్‌తో ప్రపంచం ఓ కుగ్రామంగా మారిన నేపథ్యంలో ప్రపంచదేశాల్లో ఏం జరుగుతుందో మారుమూల గ్రామాలకు కూడా తెలిసిపోతోంది. పట్టణాల నుంచి పల్లెల వరకు ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, టెలిగ్రాం తదితర యాప్‌లను వినియోగించే వారి సంఖ్య క్రమంగా పెరిగిపోతోంది. ఏదైనా విషయం గురించి, వ్యక్తుల గురించి తెలియచేయాలన్నా, వ్యతిరేకంగా ప్రచారం చేయాలన్నా సోషల్ మీడియానే వేదిక అవుతోంది. ఈ క్రమంలో ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల్లో ప్రసారానికి రాజకీయ పార్టీలకు సోషల్ మీడియానే ఓ ప్రధాన అస్త్రంగా మారింది. అయితే, తస్మాత్ జాగ్రత్త! సోషల్ మీడియాలో ఎన్నికల ప్రసారం చేస్తే ఎన్నికల సంఘం చూస్తూ ఊరుకోదు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది.

# సాంకేతిక సమరం!

- ప్రచారంలో హైటెక్‌దే హవా!
- పెచ్చుమీరుతున్న రాజకీయ ప్రసారాలు
- సోషల్ మీడియాపై నిఘా
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే!

సాంకేతిక విప్లవం పెరిగిన నేపథ్యంలో ఈసారి ఎన్నికల ప్రసారంలో సోషల్‌మీడియా (సామాజిక మాధ్యమం) కీలక భూమిక పోషించనుందనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. అభ్యర్థులు పబ్లిసిటీ పొందేందుకు టెక్నాలజీని ఆశ్రయిస్తున్నారు. అందుబాటులో ఉన్న సామాజిక మాధ్యమాలను సాధ్యమైనంత వరకు వాడుకుంటూ ఓటర్లను ఆకట్టుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు. దాదాపు ఓటర్లలో ప్రతి ఒక్కరూ స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తుండటంతో తమ రాజకీయ ప్రత్యర్థుల ఫొటోలతో మల్టీ మీడియా గ్రాఫిక్స్ తయారుచేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. తమ పార్టీ అధినేతలను కథానాయకులుగా, ఇతర పార్టీల ముఖ్యనేతలను ప్రతినాయకుల పాత్రల్లో చూపుతూ షేర్‌చేసి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియా ఏది తెరిచినా ప్రస్తుతానికి ఇవే కనిపిస్తున్నాయి.

### సెక్షన్లు ఇవీ..!

**సెక్షన్ 123 :** జాతి, మతం, కులం, సంఘం, భాషను రెచ్చగొట్టేలా వ్యవహరించడం, ఒత్తిడి గురిచేస్తే ఈ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తారు. **సెక్షన్ 125 :** ఎన్నికల సందర్భంగా వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంపొందిస్తే మూడేళ్లపాటు జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది. ఒక్కోసమయంలో ఈ రెండింటినీ కూడా విధించే అవకాశం ఉంది. **సెక్షన్ 126 :** ఎన్నికల సమయానికి 48 గంటల ముందు బహిరంగ సభలు నిర్వహిస్తే శిక్షార్హులు. దీనికి రెండేళ్ల జైలు లేదా జరిమానా విధిస్తారు. **సెక్షన్ 127 :** ఎన్నికల సమావేశం సందర్భంగా ఎటువంటి అల్లర్లకు పాల్పడితే నేరుగా పోలీసు అధికారులు ఆ వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేస్తారు. ఈ సెక్షన్‌కు ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ.2 వేల జరిమానా విధిస్తారు. **సెక్షన్ 128 :** బహిరంగంగా ఓటేసినా 3 నెలల జైలు లేదా జరిమానా విధిస్తారు. **సెక్షన్ 129 :** అధికారులు, సిబ్బంది, పోలీసులు పోటీచేసే అభ్యర్థికి సహకరించినా, ప్రభావం కలిగించినా శిక్షార్హులు. దీనికి 3 నెలల జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది. **సెక్షన్ 130 :** పోలింగ్‌స్టేషన్‌కు 100 మీటర్ల లోపల ప్రచారం చెయ్యకూడదు. ఒకవేళ చేస్తే ఈ సెక్షన్ కింద జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తారు.



### ఇష్టానుసారం పోస్టింగ్‌లు కుదరవు

సామాన్యులతోపాటు ఉద్యోగులు సైతం ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో పోస్టులు పెడుతుంటారు. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ రావడంతో వీటిపై ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా ఉంచింది. ఏ పార్టీ అభ్యర్థి కోసం ప్రచారం చేసినా చర్యలు తప్పవని స్పష్టం చేసింది. జిల్లాలో ఉన్న పలుశాఖల అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వివిధ పార్టీలకు పరోక్షంగా సహకరించినా, ప్రయత్నించినా ప్రత్యర్థి పార్టీల వ్యక్తులకు సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు పెట్టినా ఇక అంతే సంగతులు. పోస్టింగులు ఊస్టింగ్ అవుతాయి. పోలింగ్ ముగిసి ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు ఉద్యోగులు అప్రమత్తంగా ఉండకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవలసి వస్తుందని ఎన్నికల సంఘం అధికారులు హెచ్చరిస్తున్నారు.

**సెక్షన్ 131 :** పోలింగ్ కేంద్రానికి సమీపంలో ప్రచారం చేస్తే ఏ పోలీసు అధికారి అయినా సరే అరెస్టు చేసి ఆ సామగ్రిని స్వాధీనం చేసుకోవచ్చు. ఈ కేసుకు 3 నెలల జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది. **సెక్షన్ 132 :** ఓటేసే సమయంలో నిబంధనలు పాటించని వారికి 3 నెలల జైలు, లేదా జరిమానా విధిస్తారు. **సెక్షన్ 134 :** అధికార దుర్వినియోగానికి పాల్పడితే జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది. **సెక్షన్ 134(బీ) :** పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలకు మారణాయుధాలతో వెళ్లడం నిషిద్ధం. అలా వెళ్లిన వారికి 2 నెలలు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. **సెక్షన్ 135 :** పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ పత్రం, ఈవీఎం అపహరిస్తే శిక్షార్హులు. ఈ కేసుకు ఏడాది జైలుశిక్ష, జరిమానా ఉంటుంది. **సెక్షన్ 135(బీ) :** ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల రోజు వేతన సెలవుగా మంజూరు చేసినా కేసు నమోదు చేస్తారు. ఈ కేసుకు కూడా జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. **సెక్షన్ 134(ఏ) :** ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల ఏజెంటు, పోలింగ్ ఏజెంటు, ఓట్ల లెక్కింపు సమయంలో ఏజెంటుగా వ్యవహరిస్తే శిక్షార్హులు. దీనికి 3 నెలలు జైలు, జరిమానా ఉంటుంది. **సెక్షన్ 49(పి) :** ఒక వ్యక్తి ఓటు మరోవ్యక్తి వేస్తే పోలింగ్ ఆఫీసర్‌కు సదరు ఓటర్ 49(పి) సెక్షన్ ప్రకారం తన ఆధారాలు చూపించాలి. ప్రిసైడింగ్ అధికారి సదరు ఓటర్‌కు ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. చూపించలేకపోతే కేసు నమోదు చేసి జైలుకు పంపుతారు.

- నెల్లూరు (విద్య)

## 'కోడ్' ఎఫెక్ట్!

### సచివాలయ ఉద్యోగులతో పెన్షన్ల పంపిణీ?

నెల్లూరు (హరనాథపురం) : సంక్షేమ పథకాల అమలులో అన్నీ తామై వ్యవహరిస్తున్న వలంటీర్ల కార్యకలాపాలకు బ్రేక్ పడింది. సామాజిక పెన్షన్ల పంపిణీ చేస్తున్న వలంటీర్ల విధులపై కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. వలంటీర్లతో డబ్బు పంపిణీ చేయించొద్దని, అలాగే కోడ్ పూర్తయ్యే వరకు వలంటీర్లకు ఇచ్చిన ఫోన్లు, ఇతర పరికరాలు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యామ్నాయం చూసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. సచివాలయాల్లో రెగ్యులర్ సిబ్బంది ద్వారా పెన్షన్లు పంపిణీ చేయించే ఏర్పాట్లు చేయిస్తున్నట్లు తెలిసింది.

### పీఆర్ ఏఈపై కేసు నమోదు

కలువాయి : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన పీఆర్ ఏఈ సాంబశివారెడ్డిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. నూకనపల్లి పంచాయతీలో సిమెంటు రోడ్డు వేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో, ఎంసీసీ నోడల్ అధికారి పభాకర్ ఫిర్యాదు మేరకు పీఆర్ ఏఈపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అయ్యప్ప తెలిపారు.

### ప్రభుత్వ టీచరు సస్పెన్షన్

నెల్లూరు : ఎన్నికల నియమావళిని అతిక్రమించి వైసీపీ సభలో పాల్గొన్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ప్రకాశం డీఈవో సుభద్ర శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉలవపాడు మండలం కరేడు గ్రామానికి చెందిన కేశవరపు జాలిరెడ్డి ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం బింగిపల్లి ఎంపీపీ స్కూల్లో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 2న కందుకూరు వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ కరేడులో నిర్వహించిన సభలో ఆ టీచరు పాల్గొన్నట్లు ఆధారాలతో సహా వీఎస్‌రెడ్డి పేరుతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందింది. దీనిపై విచారించిన అధికారులు నివేదిక అందజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే, 6న కరేడు ర్యాంపు వద్ద వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డికి స్వాగతం పలికే కార్యక్రమంలో బహిరంగంగా పాల్గొన్నాడని జాలిరెడ్డికి సంబంధించిన వీడియో ఆధారాలు మరోసారి ఎన్నికల కమిషన్‌కు పంపించారు. విచారణలో వాస్తవమని తేలడంతో జాలిరెడ్డిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకాశం డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. అంతేగాక సస్పెన్షన్ సమయంలో జిల్లా పరిధి దాటి వెళ్లకూడదని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

### ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

మర్రిపాడు : ఎన్నికల కోడ్‌ను ఖాతరు చేయని ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఫారుక్ అలీపై మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఉదయగిరి మండలం కృష్ణంపల్లి హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న ఆయన ఈ నెల 23న కృష్ణాపురంలో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డితో కలిసి రచ్చ బండ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురిత మవడంతో జిల్లా కలెక్టరు స్పందించారు. ఉదయగిరి ఎంఈవో విచారించి, నివేదిక ఇవ్వగా మర్రిపాడు ఎంపీడీవో మనోహర్‌రాజ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

### గౌరవప్రదంగా వ్యాపారాలు చేసుకోండి

నెల్లూరు (హరనాథపురం) : ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ గౌరవప్రదంగా వ్యాపారాలు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ యాలమూరి రంగయ్య నాయుడు కోరారు. శనివారం నెల్లూరులోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూపన్లతో ఎటువంటి లావా దేవీలు నడపొద్దని అన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోలు చేసినప్పుడు ఓచర్ పద్ధతిలో చెల్లింపులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ సమన్వయ కర్త ఏపీఎస్ కృష్ణమోహన్ మాట్లా డుతూ నిజాయతీగా, నిబంధనల ప్రకారం వ్యాపారం చేసే వారికి ఏమైనా ఇబ్బందుల కలిగితే 9849576708 నెంబరుకు ఫోన్ చేయాలని కోరా రు. సమా వేశంలో ఈసీ మెంబర్లు రమేష్‌బాబు, బలరామయ్య నాయుడు పాల్గొన్నారు.

### వైసీపీలోకి ఏఎస్ పేట దర్గా సజ్జదా

ఏఎస్‌పేట : ప్రభుత్వ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలోని దర్గా సజ్జదాగా ఉన్న హఫీజ్ పాషా తన కుటుంబసభ్యులతో కలిసి శనివారం వైసీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి సమక్షంలో వైసీపీలో చేరడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా దర్గా సజ్జదా హఫీజ్ పాషా, ఉప సజ్జదాగా చెప్పుకునే ఆయన తనయుడు జేసేద్ పాషా వైసీపీలో చేరారు. దీనిపై ఎన్నికల అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.



వైసీపీ ఎంపీ అభ్యర్థితో హఫీజ్ పాషా

### మంత్రి కాకాణి ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్లు


మనుబోలు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలోనే ఎన్నికల ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్లు జట్లకొండూరుకు చెందిన ఆవుల తులసీరామ్ యాదవ్, గోవిందరాజపురానికి చెందిన గుంజి రమేష్ పాల్గొన్నారు. దీనిపై తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ ఆ ఇద్దరు ఆపరేటర్లు రాజీనామా చేశారని, అయితే, వాటిని ఇంకా కలెక్టర్ ఆమోదించలేదన్నారు. ఆమోదం కాకుం డా ప్రచారాల్లో పాల్గొంటే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే దీనిపై ఫిర్యాదు లు అందాయని, ఎఫ్ఎస్‌టీ టీమ్ వెళ్ళిందని బదులిచ్చారు.



మంత్రి కాకాణి పక్కనే ఎండీయూ ఆపరేటర్లు (వృత్తంలో ఉన్నవారు)

## నేడు ఈస్టర్

నెల్లూరు(సాంస్కృతికం) : ఏసుక్రీస్తు పునరుత్థానంను క్రైస్తవులు ఈస్టర్ పండుగగా జరుపుకుంటారు. గుడ్‌ఫ్రైడే శుక్రవారం కల్వరిలో ఏసుక్రీస్తును ప్రజల పాపాల నుంచి విముక్తి కలిగించడం కోసం శిలువ మరణం పొందుతారు. ఆయన సమాధి చేయబడిన ఏసుక్రీస్తు 3వ రోజు సమాధి నుంచి లేచి దైవదూతగా పునరుత్థానం చెందుతారు. ఏసుక్రీస్తు లేచినందుకు ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ పండుగను జరుపుకుంటారు. ఈస్టర్ సందర్భంగా క్రైస్తవులందరూ చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేస్తారు. తమ పూర్వికుల సమాధులను శుభ్రం చేసి అందంగా అలంకరించి తమ పెద్దలను క్షమించి తనతోపాటు స్వర్గానికి తీసుకుని పొమ్మని పునరుత్థానుడైన యేసును చిత్తశుద్ధితో ప్రార్థనలు చేస్తారు.



## వామ్మో.. ఏం ఎండ!

నెల్లూరు (సిటీ), మార్చి 30 : భానుడు భగ్గుమన్నాడు. వీధుల్లో నిప్పులు చెరిగాడు. ఈ ఏడాది తొలిసారిగా శనివారం ఉష్ణోగ్రత 41 డిగ్రీలకు చేరుకుంది. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణుల హెచ్చరికలు జారీ చేశారు. సాధ్యమైనంత వరకు పగటిపూట ఇళ్లలో నుంచి బయటకు రావొద్దని వారు సూచించారు. కాగా, శనివారం కలువాయి, అనంతసాగరం, ఆత్మకూరు మండలాల్లో 41 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదవగా, అత్యల్పంగా ఏఎస్‌పేటలో 28.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



### అందరినీ కలుపుకొని వెళ్లండి..

# భారీ మెజారిటీతో గెలవాలి!

- అభ్యర్థులకు టీడీపీ అధినేత చంద్రబాబు దిశానిర్దేశం

నెల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : 'పాత, కొత్త నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకోవాలి. ఈ బాధ్యత పూర్తిగా అభ్యర్థులదే. ప్రచారంలో విస్తృతంగా పాల్గొని అన్ని స్థానాల్లో భారీ మెజారిటీతో గెలవాలి.'అంటూ తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అభ్యర్థులకు సూచించారు. శనివారం ఉదయం వింజమూరులో నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కావలి, ఉదయగిరి, కందుకూరు అభ్యర్థులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌లతో చంద్రబాబు భేటీ అయ్యారు. నియోజకవర్గాల వారీగా పార్టీ బలాలు, బలహీనతలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని నాయకులను కలుపుకొని వెళ్లే బాధ్యత అభ్యర్థులదేనని చంద్రబాబు స్పష్టం చేశారు. 'మీరు ఏం చేస్తారో నాకు తెలియదు. నియోజకవర్గంలో పార్టీ నాయకులంతా ఒకేతాటిపైకి రావాలి. ప్రచారంలో విస్తృతంగా పాల్గొనాలి. మీ గెలుపు బాధ్యతను వారు భుజాన వేసుకోవాలి. అలా వారిని సమన్వయపరుచుకునే బాధ్యత మీదే.' నంటూ చంద్రబాబు అభ్యర్థులను ఆదేశించినట్లు తెలిసింది. అలాగే వైసీపీ నుంచి పెద్ద ఎత్తున వలస వచ్చి, టీడీపీలో చేరుతున్నట్లు చెప్పారు. కొత్తవారిని, పాతవారిని సమన్వయపరుచుకొని పని చేయడంలోనే అభ్యర్థుల సక్సెస్ ఆధారపడి ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం గాలి వీస్తోందని, అభ్యర్థులు, నాయకులు సమైక్యంగా కృషి చేస్తే భారీ మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. పోలింగ్ రోజు వరకు ఒక్క నిమిషం కూడా విశ్రమించకుండా కృషి చేయాలని, కేడర్‌ను నడిపించాలని పార్టీ నాయకులకు చంద్రబాబు సూచించారు. కావలి, వింజమూరు ప్రజాగళం సభలు విజయవంతానికి కృషి చేసిన నాయకులను అభినందించారు. కాగా, జలదంకి మండలానికి చెందిన పలువురు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం ఉదయం 11 గంటల ప్రాంతంలో చంద్రబాబు హెలికాప్టర్‌లో ప్రొద్దుటూరు బయలుదేరి వెళ్లారు.



సమావేశం అనంతరం చంద్రబాబుతో కలిసి వెలుపలకు వస్తున్న అభ్యర్థులు వేమిరెడ్డి, కాకర్ల, కావ్య



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన జలదంకి ఎంపీపీ వెంకట రమణయ్య

### టీడీపీలో భారీగా చేరికలు

జలదంకి : వైసీపీకి కంచుకోట అయిన జలదంకి మండలంలో ఆ పార్టీకి బీటలు వారాయి. ప్రజాగళం పేరుతో వింజమూరుకు వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు సమక్షంలో ఎంపిపి గోచిపాతల వెంకటరమణయ్యతో పాటు నలుగురు ఎమ్పీటీసీ సభ్యులు, కో-ఆప్షన్‌సభ్యుడు జలదంకి సొసైటీ డైరెక్టర్ గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు, జలదంకి, బ్రాహ్మణక్రాక ఉపసర్పంచ్‌లు కూరపాటి మాలకొండారెడ్డి, దగుమాటి మాల్యాద్రిరెడ్డి, పలు పంచాయతీలకు చెందిన వార్డు సభ్యులు చేరారు. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, వైసీపీ నేత చేవూరి జనార్దన్ రెడ్డిల టీడీపీలో చేరడంతో అధికార పార్టీకి గట్టిదెబ్బ తగిలింది.

సార్వత్రిక ఎన్నికల క్రతువు మొదలైనప్పటి నుంచి నెల్లూరులోని కాంట్రాక్టర్ల పంట పండింది. అలా బిల్లు అప్‌లోడ్ చేయగానే ఇలా సొమ్ములు వారి బ్యాంకు ఖాతాలో జమైపోతున్నాయి. కాంట్రాక్టర్లంతా వైసీపీ నాయకులే కావడంతో చకచక బిల్లులను ఇంజనీరింగ్ అధికారులు పూర్తి చేసి సీఎఫ్ఎంఎస్‌కు పంపేస్తున్నారు. కార్పొరేషన్‌లోని ఖజానాకు బిల్లులు హోరెత్తుతుండగా, కార్యాలయంలో కాంట్రాక్టర్లు క్యూ కట్టిమరీ తమ బిల్లులను అప్‌లోడ్ చేయించుకుంటున్నారు. కాంట్రాక్టర్ల కోసంగానే ప్రభుత్వం నుంచి అదనంగా రూ. 20 కోట్లు మంజూరు చేయడం గమనార్హం. గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) పనులు మినహా మిగతావన్నీ మంజూరైనట్లు తెలుస్తోంది.

- 'కార్పొరేషన్' ఖజానాకు బిల్లుల హోరు
- కార్యాలయంలో బారులు తీరుతున్న కాంట్రాక్టర్లు
- ఎన్నికల వేళ హడావిడిగా మంజూరు
- అదనంగా రూ.20 కోట్ల కేటాయింపు, చెల్లింపు
- జీజీఎంపీ బిల్లుల మంజూరుకూ ఆదేశాలు?

# ఉన్నదంతా ఊడ్చేద్దాం!

నెల్లూరు (సిటీ), మార్చి 30 : నెల్లూరులోని మున్సిపల్ డివిజన్లలో వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు కాంట్రాక్టర్లుగా ఉన్నారు. ప్రస్తుతం సార్వత్రిక పోరు జరుగుతుండటంతో వారిని ఆర్థిక పరిపుష్టులను చేసేందుకు పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నిటినీ మంజూరు చేసేస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాలలో ఇటీవల అభివృద్ధి పనుల పేరిట సీసీరోడ్లు, కల్వర్టులు, రోడ్లు ఆధునీకరణ, డ్రైనేజీ కాలువ నిర్మాణాలు జోరుగా నిర్వహించారు. అవసరమున్నా, లేకున్నా కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం చకచక నిర్మాణాలు చేపట్టారు. ఈ బిల్లు లన్నీ ఇంజనీరింగ్ అధికారులు అదే వేగంతో అప్‌లోడ్ చేసి సీఎఫ్ఎంఎస్‌కు పంపారు. కార్పొరేషన్ ఖజానాలో నిల్వతో సంబంధం లేకుండా ప్రభుత్వం నుంచి రూ.20 కోట్ల వరకు కేటాయింపులు చేసు కుని పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ జమ చేశారు. ఈ బాధ్యతను అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య నేత తన భుజాలపై వేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

### జీజీఎంపీ పెండింగ్

గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) పేరిట ఒక్కో సచివాలయానికి మూడు విడతల్లో రూ.60 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. 166 సచివాలయాలు ఉండగా సుమారు రూ.40 కోట్ల వరకు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. వీటిని కూడా స్థానికంగా ఉండే వైసీపీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తి తమ అనుకూల ప్రాంతాలలో పనులు చేపట్టారు. ప్రస్తుతం సీఎఫ్ఎంఎస్‌లో ఇవీ పెండింగ్ ఉన్నట్లు తేలడంతో వెంటనే వాటిని మంజూరు చేయించాలని వైసీపీ అభ్యర్థులపై ఒత్తిడి పెరగడంతో వాటినీ రేపోమాపో విడుదల చేసేందుకు యంత్రాంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు వైసీపీ అధిష్ఠానం నుంచి కార్పొరేషన్‌కు సమాచారం అందినట్లు ప్రచారం జరుగుతోంది.



### నాణ్యత మాకెందుకు?

చేసిన పనికి చేసినట్టు బిల్లులు మంజూరవుతుండటం, ఎన్నికల సమయంలో అందరి దృష్టి ఓట్లు రాబట్టుకోవడంలో ఉండటం, నిఘా వ్యవస్థలన్నీ ఎలక్షన్ మూడ్‌లోకి వెళ్లిపోవడంతో కాంట్రాక్టర్లు తమ చేతివాటానికి పదును పెట్టారు. చకచక పనులు చేసేస్తే సొమ్ము చేతికందుతుందని భావిస్తున్న అనేక మంది కాంట్రాక్టర్లు నిర్మాణాల్లో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. 12వ డివిజన్‌లో ఓ కాంట్రాక్టరు సీసీ రోడ్డు నిర్మించగా అందులో నాణ్యతలే దంటూ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు సమాచారం. మరో కాంట్రాక్టరు డ్రైనేజీ కాలువ నిర్మించగా దానికి ఆనుకుని ఉన్న రైతుల కాలువ నుంచి బయటకు వచ్చే వ్యర్థాల ముఖద్వారాన్ని మూతేయగా కాలువ నిండా నీరు నిల్వఉండటంతో అయినా బిల్లుల మంజూరుకు సిద్ధమ య్యారు. నెల్లూరురూరల్లోని మరో డివిజన్‌లో ఏకంగా క్వాలిటీని పరిశీలించే వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను పనుల వద్ద లేకుండా ఇంజనీరింగ్ అధికారులు ఆదేశించడం గమనార్హం.

### నేడు సెలవు అయినా పని చేయనున్న బ్యాంకులు

నెల్లూరు (హరనాథపురం) : ఆదివారం సెలవు రోజు కూడా బ్యాంకులు పని చేయనున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా చాలా మంది ఆదాయ పన్నులు, ఇతర ఆర్థిక కార్యకలాపాలను పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే కావటంతో బ్యాంకులకు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు వచ్చింది. ఆర్థిక కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకొని ఆదివారం కూడా బ్యాంకులలో రోజువారీ కార్యకలాపాలు నడవనున్నాయి. అలాగే ఎల్ఐసీ కార్యాలయాలు కూడా ఆదివారం తెరిచే ఉంటాయి.

# నిర్వహణ లేక నీరుగారిన లక్ష్యం

- నిరుపయోగంగా సౌరవిద్యుత్ ఆధారిత నీటి పథకాలు
- 2015లో కేంద్రం ఏర్పాటు
- మొరాయించిన సౌర పలకలు
- తీరని తాగునీటి ఇబ్బందులు

సీతారామపురం, మార్చి 30: జనాభా 250 మంది లోపు ఉండి, ఓవర్ హెడ్ ట్యాంకులు లేని, విద్యుత్ సమస్య ఉన్న గ్రామాలు, కాలనీలకు చేతి పంపుల నీరే ఆధారం. ఇలాంటి ప్రాంతాల్లో సౌర విద్యుత్ ఆధారంగా చేతిపంపులకు మోటార్లు అమర్చి సమస్యను పరిష్కరించేందుకు కేంద్రప్రభుత్వం 2015లో శ్రీకారం చుట్టింది. ఒక్కోదానికి రూ.4.90లక్షలు వ్యయం ఖర్చు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థకు పనులు అప్పగించింది. బోరు సమీపంలో 5వేల లీటర్ల సామర్థ్యం ఉన్న సింథటిక్ ట్యాంకులు, దాని పైన నాలుగు సౌర పలకలు ఏర్పాటు చేశారు. సౌర విద్యుత్ ఆధారంగా మోటార్లు ఆటోమేటిక్ ఆన్‌అయి బోరు నీరు ట్యాంకులో చేరేలా వీటిని అమర్చారు. ట్యాంకు నిండగానే మోటారు ఆగిపోతాది. చేతి పంపును సాధారణంగానూ వినియోగించుకునే వీలు ఉంటుంది. సాధారణంగా చేతిపంపుల్లో 80 నుంచి 120 అడుగుల వరకు పైపులు అమర్చుతారు. సౌర నీటి పథకంలో 200అడుగుల్లోని నీరు కూడా ట్యాంకుకు చేరేలా చర్యలు తీసుకున్నారు.

### మండలంలో ఎక్కడెక్కడ ఏర్పాటు..

పెద్దనాగంపల్లి ఎస్సీ కాలనీ, గోనువారిపల్లి, చింతూడు, రంగనాయుడుపల్లి ఎస్టీకాలనీ, పండ్రంగి గ్రామాల్లో తాగునీటి పథకాలకు సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసింది. మొదట్లో కొన్నినెలలు సౌర పథకాలు సక్రమంగా పనిచేయడంతో నీటి ఇబ్బందులు తీరాయని కాలనీల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. మరమ్మతులకు గురైతే వాటిని పట్టించుకునేవారు లేకపోవడంతో ఈ పథకాలు నిరుయోగంగా ఉన్నాయి. పండ్రంగి గ్రామంలో తప్ప మిగతా గ్రామాల్లో ఇవి నిరుప యోగంగా ఉన్నాయి. మా గ్రామాల్లో తాగునీటి సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని ప్రజలు వాపోతు న్నారు. కొన్నిచోట్ల సౌర పలకలు ఏర్పాటు చేసిన నెలల కిందటే ఊడిపోయినా ఇంతవరకు వాటిని అతికించి ఉపయోగంలోకి తెచ్చే పనులు చేపట్ట లేదు. ఉన్నతాశయంతో ఏర్పాటు చేసిన వీటిని వినియోగంలోకి తెస్తే లక్ష్యం నెరవేరడంతో పాటు పంచాయతీలకు విద్యుత్ బిల్లుల సమస్య ఉండదని పల్లెవాసులు చర్చించుకుంటున్నారు.


పెద్దనాగంపల్లి ఎస్సీ కాలనీలోని సౌర విద్యుత్ ఆధారిత నీటి పథకం

# అధ్వానపు రోడ్లు..అవస్థల ప్రయాణం!

ఏఎస్ పేట, మార్చి 30 : మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా చౌటభీమవరం నుంచి ఆత్మకూరు-వింజమూరుకు వెళ్లే ప్రధాన రహదారి ఇరవై ఏళ్లుగా అధ్వానంగా ఉంది. ప్రజలు రాకపోకలు సాగించాలంటే అవస్థలు పడుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ రోడ్డు మాత్రం మారలేదు. ఆ ఊరు నియోజకవర్గ కేంద్రానికి నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్నది. ప్రతిరోజూ విద్యార్థులు ఆత్మకూరు, వింజమూరుల్లోని పాఠశాలలు, కళాశాలలకు, వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో తారురోడ్డు వేయాలని గ్రామస్థులు కొన్నేళ్లుగా అధికారులు, నాయకుల చుట్టూ తిరిగి అర్జీలు అందించినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. వర్షం కురిస్తే బురదతోపాటు పెద్ద గుంతలతో రాకపోకలు సాగించడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది గ్రామ యువకులు సొంత నిధులతో రోడ్డుపైన గుంతలకు మట్టి వేసి చదును చేశారు. ముస్తాపురం నుంచి ఏఎస్ పేట వరకు రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. ఆదమరిస్తే ప్రమాదాలు తప్పవు. ప్రతిరోజూ హైదారాబాదు, బెంగళూరు నుంచే కాక పలు రాష్ట్రాల నుంచి యాత్రికులు ఏఎస్ పేటకు దర్గాకు వస్తుంటారు. రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు ఈ మార్గంలో తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల దర్గాలో గంధోత్సవం నిర్వహిస్తే దేశం నలుమూలల నుంచి యాత్రికులు వచ్చారు. ఆత్మకూరు-వింజమూరు ప్రధాన రహదారి నుంచి వెళ్లే దూబగుంట రోడ్డు పరిస్థితి అలాగే ఉన్నది. గుడిపాడు నుంచి కొత్తపల్లి రహదారితో పాటు పలు గ్రామీణ రహదారులు దారుణంగా ఉన్నాయి. పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.


ఏఎస్ పేట-ఆత్మకూరు రోడ్డు దుస్థితి

## చంద్రబాబుతో చింతల శ్రీను భేటీ



సీతారామపురం, మార్చి 30: ప్రజాగళం కార్యక్రమం కోసం వింజమూరుకి వచ్చిన చంద్రబాబునాయుడును శనివారం మండల సీనియర్ నాయకులు చింతల శ్రీనివాసులు కలిశారు. మండల సమస్యలను అధినేత దృష్టికి తీసుకెళ్లాడు. విషయాలన్నీ ఓపిగ్గా ఆలకించిన టీడీపీ అధినాయకుడు ఈ ఎన్నికల్లో నియోజకవర్గ అభ్యర్థి కాకర్ల సురేష్‌ని అత్య ధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

## ఎన్నికల సిబ్బందికి ముగిసిన శిక్షణ

ఉదయగిరి రూరల్: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో రెండు రోజులుగా ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు జరుగుతున్న శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నెహ్రూబాబు సిబ్బందికి సలహాలు అందజేశారు.

## సర్టిఫికెట్ల గడువు నేటితో ముగింపు

ఉదయగిరి, మార్చి 30: విశ్రాంత ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్లను ఆదివారం సాయంత్రంలోపు అందజేయాలని ఉదయగిరి సబ్ ట్రెజరీ సీనియర్ అసిస్టెంట్ బొమ్మతట్టు శ్రీహరి తెలిపారు. శనివారం ఆయన ఈ విషయంపై మాట్లాడారు. వివిధ కారణాలతో నెలాఖరులోగా అందించలేకపోయినా విశ్రాంత ఉద్యోగులు ఆన్‌లైన్‌లో లేక స్వయంగా అందజేయాలన్నారు. ఉదయగిరి సబ్ ట్రెజరీ పరిధిలో 784మంది విశ్రాంత ఉద్యోగ పెన్షనర్లు ఉన్నారని, వీరిలో 15మంది అందజేయలేదన్నారు..

## మద్యం దుకాణాల తనిఖీ



ఉదయగిరి, మార్చి 30: పట్టణంలోని గండిపాళెంకు వెళ్లే మార్గంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను శనివారం ఒంగోలు విజిలెన్స్ స్పెషల్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. మద్యం దుకాణాల్లో నిల్వలు, నగదు బ్యాలెన్స్ రికార్డులు పరిశీలించి సలహాలు అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయపాలన పాటించి ప్రభుత్వ ధరలకే మద్యం విక్రయించాలన్నారు. ప్రతివ్యక్తికి మూడు మద్యం సీసాలకు మించి ఇవ్వరాదన్నారు. వారి వెంట స్పెషల్ స్క్వాడ్ బృందం సీఐ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## పదవీ విరమణ హెచ్‌ఎంకు సన్మానం



సంగం, మార్చి 30: వెంగారెడ్డిపాళెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తూ శనివారం పదవీ విరమణ చేసిన సీహెచ్ ఈశ్వరయ్యను సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఉపాధ్యాయురాలు రోజా రమణి, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా..

- టీడీపీ విజయానికి కృషి చేయండి : ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, మార్చి 30: నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయానికి అన్నివర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతిచ్చి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారా యణరెడ్డి కోరారు. శనివారం ఆయన పట్టణంలోని బార్, క్లాత్, గోల్డ్ అండ్ సిల్వర్, ప్రొవిజన్స్, ఆయల్, డిస్ట్రిబ్యూషన్ అసోషియేషన్స్ అధ్యక్షులు, వ్యాపారులను కలిసి మద్దతు అడిగారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చి నారా చంద్రబాబునాయుడు సీఎం కావడం తథ్యమన్నారు.


టీడీపీ మద్దతుదారులు, అభిమానులతో ఆనం రామనారాయణరెడ్డి

## వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

ఆత్మకూరు మార్చి 30: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమని, కేంద్రం నిధులతోనే కొంత మేర అభివృద్ధి పనులు చేసినట్లు బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి తెలిపారు. శనివారం ఆత్మకూరులోని జేఆర్‌పేటలో పార్టీ నూతన కార్యా లయాన్ని ప్రారంభించి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో రాబోయేది ఎన్డీయే ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. ఆత్మకూరులో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనా రాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి వీపీఆర్ గెలుపు ఖాయమన్నారు. వేమిరెడ్డి ప్రభాకరర్‌రెడ్డి విజయానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, పట్టణ, రూరల్ అధ్యక్షులు కరటంపాటి సుధాకర్, వాసిపల్లి సుధాకర్‌రెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.


బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నేతలు

## పుచ్చకాయలకు భలే డిమాండ్!

- సైజులు బట్టి ధరలు
- రూ.50 నుంచి 150 వరకు విక్రయం


ఉదయగిరిలో విక్రయానికి సిద్ధంగా పుచ్చకాయలు

ఉదయగిరి, మార్చి 30: ఈ ఏడాది వేసవికాలంలో ముందస్తుగానే ఎండల తీవ్రత పెరగడంతో పుచ్చకాయల అమ్మకాలకు భలే డిమాండ్ పెరిగింది. సహజంగానే ఈ సీజన్‌లో కాయలకు గిరాకీ ఎక్కువ. ఉదయగిరి ప్రాంతంలో సైజును బట్టి పుచ్చకాయ ధర రూ.50 నుంచి రూ.150 వరకు అమ్ముతున్నారు. అలాగే కిలో రూ.25ల చొప్పున విక్రయిస్తున్నారు.

## పల్లెల్లో ప్రత్యేక బలగాల కవాతు

అనంతసాగరం, మార్చి 30: సార్వత్రిక ఎన్నికల నేప థ్యంలో గుడిగుంట పంచాయతీ లోని ఎగువపల్లి, యాకర్ల పాడులో శనివారం పోలీసులు ప్రతేక బలగాలు కవాతు నిర్వహించారు. సోమశిల పోలీసుసేష్టన్ పరిధిలో ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.


కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు







## అనివేటి మండపానికి విరాళం

కందుకూరు : గ్రామదేవత అంకమ్మ ఆలయ పునర్ని ర్మాణానికి కందుకూరు వాసి, సినీనటుడు ఇంటూరి మల్లి కార్జునరావు శనివారం రూ. 50,116 విరాళం అందజేశారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి సమక్షంలో ఆలయ క మిటీ సభ్యులకు ఈ మొత్తాన్ని ఆయన అందించారు. అనం తరం మల్లికార్జునరావు మాట్లాడుతూ అంకమ్మ ఆలయ పునర్నిర్మాణం మొదటిదశ ఎమ్మెల్యే పర్యవేక్షణలో విజయ వంతంగా పూర్తయిందని, అనివేటి మండపానికి తమవం తు భాగస్వామ్యంగా ఈ విరాళం అందించినట్లు తెలిపారు.

## మూలపడ్డ చెత్త తరలింపు వాహనాలు

అల్లూరు, మార్చి 30: చెత్తపై పన్ను వసూలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగా తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించేందుకు వాహనాలను కూడా ఏర్పాటు చే సింది. అయితే ఆ వాహనాలు అల్లూరు నగర పంచాయతీలో మూల పడ్డాయి. సచివాలయాల దగ్గర వాటిని పడేసి అధికారులు పట్టించుకోకుండా వదలేశారు. మొదట్లో కొద్దిరోజులు మాత్రం చెత్తను సేకరించారు. కానీ ప్రస్తుతం ఆ వాహనాలు మూలన పడిఉన్నాయి. వాటిని వినియోగం లోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



# కావలి
## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



## నాలుగేళ్లుగా నిండని చెరువులు

- పంటలు సాగుచేయని రైతులు
- రాళ్లపాడు నీళ్లివ్వాలని వినతి

లింగసముద్రం, మార్చి 30: మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో లింగసముద్రంలోని పాత, కొత్త చెరువుల్లో అరకొరగా నీరుచేరాయి. ఆ నీటితో పంటలు పండించలేమని రైతులు సాగుకు స్వస్తి పలికారు. పాత చెరువు కింద లింగసముద్రం, తిమ్మారెడ్డిపాలెం, శింగరపాలెం, గంగపాలెం గ్రామాలకు చెందిన సుమారు 700 ఎకరాల ఆయకట్టు ఉంది. నాలుగేళ్లుగా చెరువు నిండక చెరువులోనూ, ఆయకట్టులోనూ చిల్లచెట్లు పెరిగాయి. అయితే కొద్దిమంది రైతులు బోర్ల కింద తిండి గింజల కోసం వరిపైరు, పశువుల మేతకు జొన్న సాగు చేశారు. గత ఏడాది కూడా కొత్త చెరువులో చుక్క నీరు లేకపోవడంతో సుమారు 115 ఎకరాల ఆయకట్టు బీడుగా మారింది. పంటలు పండక రైతులు, రైతు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.గ్రాసం లేక పశువులు కూడా అల్లాడుతున్నాయి.

### రాళ్లపాడు నీరివ్వాలి

లింగసముద్రం పాత, కొత్త చెరువులు నిండితేనే రైతులు పంటలు సాగు చేస్తారు. నాలుగేళ్ల నుంచి సరిగా నీరు రాక పోవడంతో సాగు లేదు. ఈ చెరువులకు రాళ్లపాడు ప్రాజెక్టు దక్షిణం కాలువ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరివ్వాలి. అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టాలి. -పొలిమేర వెంకటేశ్వర్లు రైతు, తిమ్మారెడ్డిపాలెం


నాలుగేళ్లుగా నీళ్లులేక చిల్లచెట్లు మొలిచిన లింగసముద్రం పాత చెరువు



# తెలుగుదేశంలోకి తెట్టు గ్రామస్థులు

కందుకూరు,మార్చి30: : గుడ్లూరు మండలం తెట్టు గ్రామానికి చెందిన పలు బీసీ కుటుంబాలు శనివారం వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరాయి. గ్రామపార్టీ అధ్యక్షుడు మద్దసాని శ్రీనివాసులు ఆధ్వర్యంలో వారంతా స్థానిక పార్టీ కార్యాలయానికి తరలివచ్చి ఇంటూరి సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పి నాగేశ్వరరావు పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జనిగర్ల నాగరాజు, మద్దసాని కృష్ణ, యర్రంశెట్టి వెంకటేశ్వర్లు, కుందుర్తి రాంబాబు, తాళ్లపాలెం బాలకృష్ణ, దారా వెంకటరావు, చిత్తారి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీలోకి చీమలపెంట వాసులు

లింగసముద్రం : కందుకూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో శనివారం రాత్రి మండలంలోని చీమలపెంట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గంగినేని మధుసూదనరావు, 8, 9 వార్డు సభ్యులు చలంకూరి అంజమ్మ, మదమంచి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచి కరణం నారాయణ, మాజీ ఉప సర్పంచి కల్లగుంట నరసింహం, బొల్లినేని నాగేశ్వరరావు, ఆంజనేయులతోపాటు ఇంకా పలు కుటుంబాల వారు టీడీపీలో చేరారు.


కందుకూరు : ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరిన తెట్టు వైసీపీ కార్యకర్తలు

## జీసస్ మార్గం ఆచరణీయం : కావ్య

కావలిటౌన్, మార్చి30: జీసస్ మార్గం ఆచరణీయమని కావలి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలో ఆరాధన టీవీ, డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం జరిగింది. ఏబీఎం కాంపౌండ్ వద్ద కావ్య కృష్ణారెడ్డి ర్యాలీని ప్రారంభించారు. ట్రంకురోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఆరాధన టీవీ కో-ఆర్డినేటర్ పాడేటి థామస్, పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏసుబాబు, బోగిరి జయసుందరరావు, శివప్రసాద్‌రెడ్డి, విన్సంట్, జీవన్ పాల్గొన్నారు.

- ప్రజలు మార్పు కోరుకుంటున్నారు..

కావలి : ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని టీడీపీ. జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి శనవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావలిలో శుక్రవారం నిర్వహించిన ప్రజాగళం విజయవంతం చేసిన ప్రజలకు, అభిమానులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజాగళం సభకు పెద్దఎత్తున విచ్చేసి టీడీపీపై ప్రజలు అభిమానం చూపారంటే రాష్ట్రంలో మార్పు కోరుకుంటున్నారనేందుకు సంకేతామన్నారు. నియోజకవర్గంలో ప్రజల ఆదరణ చూస్తుంటే టీడీపీ ఘన విజయం సాధించబోతుందన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ప్రజలు చాలా కష్టాలు పడ్డారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాన్ని జగన్ అప్పులపాలు చేశాడని, ఒకటోతేదీకి ఉద్యోగులెవరికి జీతాలు అందటం లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఉద్యోగులందరికి ఒకటో తేదీకి జీతాలు అందుతాయన్నారు. పింఛన్ రూ.4 వేలకు పెంచి మీ ఇంటికి అందచేసే బాధ్యత టీడీపీ తీసుకుంటుందన్నారు. రాష్ట్రం భవిష్యత్తుకోసం చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి

## మాలకొండ ఆదాయం రూ.8,72,379

వలేటివారిపాలెం, మార్చి 30: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి 8,73,379 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 7,650, కుంకుమార్చన ద్వారా రూ. 30,360, వివాహాల ద్వారా రూ. 13 వేలు, తలనీలాల ద్వారా రూ. 33,150, వాహనపూజల ద్వారా రూ. 3,160, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 3,01,500, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 6,00, రూముఅద్దెల ద్వారా రూ. 32,460, కవర్లు ద్వారా రూ. 5,400, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 1,87,220, అన్నదానం ద్వారా రూ. 2,49,263, విరాళాల రూపంలో రూ. 8,616 ఆదాయం లభించినట్లు ఆయన తెలిపారు.

## పదవీ విరమణ సన్మానం


వెంకట సీతారామశర్మ దంపతులను సన్మానిస్తున్న డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు, ఎంఈవో తదితరులు

ఉలవపాడు : మండలంలోని పెదపట్టపుపాలెం ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నాదెండ్ల వెంకట సీతారామశర్మ ఆదివారం పదవీ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం జ రిగిన కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కే శ్రీనివాసరావు, ఎంఈవో ప్రసాదరావులు పాల్గొని సీతారామశర్మ సేవలను కొనియాడారు. అనంతరం హెచ్‌ఎం సలీం బాషా ఆధ్వర్యంలో సీతారామశర్మ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచు ఆవుల జయరాం, గ్రామపెద్దలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబు నిజాలు తెలుసుకుని మాట్లాడాలి

కావలిటౌన్ : చంద్రబాబునాయుడు నిజాలు తెలుసుకుని మాట్లాడాలని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ముసునూరులోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 14ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు కావలి పర్యటనలో తనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సముచితం కాదన్నారు. వైసీపీ కావలిని అభివృద్ధి చేయలేదని అంటున్న చంద్రబాబు ఆయనేం చేశారో చెప్పాలన్నారు. సమావేశంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## ప్రజాసేవలోనే సంతృప్తి : కంచి



ఆత్మకూరు : ప్రజాసేవే పరమావధిగా తాను పలు సేవకార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం సంతోషకరంగా ఉందని సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో అవుట్ పేషంట్లకు, వారి కుటుంబసభ్యులకు ప్రతిరోజు అన్నదానం కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్నదానం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ఓ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ అంత్యక్రియల సహాయార్థం గా రూ.10 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కైలాశ రథంతో పాటు ఆరు శవపేటికలను అందుబాటులో ఉంచామన్నారు. వీటితో పాటు దేవాలయాల అభివృద్ధికి నిధులు అందజేయడం సంతోషకరంగా ఉందన్నారు. ముందుగా ఆయన సాంబశివ చారిటబుల్ ట్రస్ట్, తెలుగుభారతి సేవా సంసమితి సభ్యులు, అభిమానులతో కలిసి అన్నపూర్ణేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఎస్సీపాలెంలో టీడీపీ నేతల ప్రచారం


ఎస్సీపాలెంలో ఇంటింటి ప్రచారంలో తెలుగు తమ్ముళ్లు

బిట్రగుంట : బోగోలు మండలం ఎస్సీపాలెం దళితవాడల్లో మండల తెలుగు యువత అధ్యక్షుడు అన్నంగి ఆది శేషయ్య యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం జరిగింది. టీడీపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్యక్రిష్ణారెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పెయ్యల శీనయ్య, రాజు శ్రీనివాసులురెడ్డి, కాకి తిరుపతి, ఇష్టాటి సుబ్బారెడ్డి, అట్ల రమేష్‌రెడ్డి, మానికల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్ డంపింగ్‌యార్డు పరిశీలన

కందుకూరు, మార్చి 30: పట్టణంలోని గుర్రం వారిపాలెంలో ఉన్న డంపింగ్‌యార్డును సబ్ కలెక్టరు విద్యాధరి శనివారం రాత్రి పరిశీలించారు. రెండురోజులుగా డంపింగ్‌యార్డులో మంటలు చెలరేగి పొగ వ్యాపించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఆమెకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా డంపింగ్‌యార్డు వల్ల పడుతున్న ఇబ్బందులను ఆమెదృష్టికి తీసుకువచ్చి ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన ఆమె సమస్య పరిష్కారానికి తక్షణం చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.


డంపింగ్‌యార్డు సమస్యను సబ్ కలెక్టరుకు వివరిస్తున్న స్థానికులు

## వినియోగదారుల హక్కుల ఫోరం ఈసీగా కిషోర్

బిట్రగుంట, మార్చి 30: బోగోలు మండలం రామస్వామిపాలెంకు చెందిన ఎల్.కిషోర్‌ను మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమిస్తూ శనివారం మండల ఏపీ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం కన్వీనర్ జయానందం గుర్తింపు కార్డును అందచేశారు.వినియోగదారుల భద్రతే లక్ష్యంగా తాను కృషి చేస్తానని కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్డీ అక్బర్, ట్రెజరర్ చంద్రహాస్, తదితరులు పాల్గొన్నారు.


కిషోర్‌కు గుర్తింపు కార్డు అందచేస్తున్న జయానందం

## బోగోలు వైసీపీలో వర్గపోరు

బిట్రగుంట, మార్చి 30: బోగోలులో కొంతమంది వైసీపీ నేతల వైఖరి కారణంగా వర్గపోరు రోజురోజుకు పెరుగుతోంది. ఈ క్రమంలో పలువురు ఆ పార్టీ నాయకులు టీడీపీలోకి చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. త్వరలో కావలి టీడీపీ అభ్యర్థి కావ్యక్రిష్ణారెడ్డిని సంప్రదించి పార్టీలో చేరతామని అసమ్మతి వైసీపీ నేతలు పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ అవసరం లేదు : మహీధర్‌రెడ్డి

కందుకూరు, మార్చి 30: తనకు ఎమ్మెల్సీ పదవి వద్దని ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో వైసీపీ నేతల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆ పార్టీ అభ్యర్థులు విజయసాయిరెడ్డి, బుర్రా మధుసూదన్‌యాదవ్‌లతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. మహీధరరెడ్డి మాట్లాడుతూ తనకు ఇచ్చిన ఆఫర్‌ను తాను కోరుకోవటం లేదన్నారు. నేడు రాజకీయాలు చాలా కాస్ట్‌లీగా మారిపోయాయని, తాను ఏనాడూ కులరాజకీయాలు చేయలేదన్నారు. తనకు టికెట్ రానప్పుడు పోటీచేయాలని కొందరు ఒత్తిడి చేశారని తెలిపారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ కందుకూరులో మహీధరన్న సహకారం లేకుండా తాను, మధుసూదన్ గెలవలేమని అన్నారు.

## టీడీపీలో న్యాయవాది చేరిక

కందుకూరు : పట్టణానికి చెందిన వైసీపీకి చెందిన న్యాయవాది ఉప్పుటూరి రాజేంద్ర ప్రసాద్ టీడీపీలో చేరారు. టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో శనివారం ఆయన పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఉన్నం వీరాస్వామి, దామా మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**మక్కా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు** : కందుకూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు శనివారం రాత్రి పట్టణంలోని మక్కా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలతో కలిసి ఆయన ప్రార్థనల్లో పాల్గొన్నారు. టీడీపీకి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు షేక్ ఫిరోజ్, మియా, రూబీ, గౌస్, సలాం, మున్నా, జమీల్, ఖలీల్, నజీర్, షాకీర్, సలీం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

## ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

- జిల్లాలో ఇప్పటివరకు రూ.75.47 లక్షలు సీజ్
- ఫిర్యాదు వచ్చిన వెంటనే పరిష్కరిస్తాం
- ప్రచారంలో పాల్గొన్న ఒక ఉద్యోగి సస్పెన్షన్
- 20 మంది వలంటీర్లపై వేటు
- ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ వెల్లడి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 30 : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఈనెల 16వతేదీ నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక ఇప్పటివరకు తీసుకున్న చర్యలను కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోలు రూంలో శనివారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన వివరించారు. సీ విజిల్, సువిధ యాప్ ద్వారా ఇప్పటివరకు 334 ఫిర్యాదులు రాగా వీటిలో 211 ని ఆమోదించామన్నారు. ఎన్నికల కమిషన్‌కు 29 ఫిర్యాదులు వెళ్లగా 25ను పరిష్కరించి నివేదికను సమర్పించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.75.47 లక్షల సొత్తును సీజ్ చేయగా అందులో రూ.29లక్షలు నగదు ఉందన్నారు చీరలు, కుక్కర్లు, ఇతర వస్తువులు ఉన్నాయని తెలిపారు. కోడ్ అమలులోకి వచ్చాక ప్రచారంలో పాల్గొన్న ఒక రెగ్యులర్ ఉద్యోగితోపాటు ఏడుగురు కాంట్రాక్టు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. 20మంది వలంటీర్లను తొలగించగా ఒక రేషన్ డీలర్‌పై కూడా వేటు వేసినట్లు పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈసీ 33శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్లకు అవకాశం కల్పించిందని, వచ్చేనెల 18నుంచి 22లోపు సంబంధిత ఆర్వో కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకుంటే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చును పరిశీలించేందుకు, ఓటర్లను ప్రలోభపెట్టేలా డబ్బు, ఇతర వస్తువుల రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24 ఎఫ్ఎస్‌టీ, 40వీఎస్‌టీ, 25 ఎస్ఎస్‌టీ, 9 వీవీటీ, 9 అకౌంటింగ్, 50 ఎంసీసీ టీములు, 263 మంది సెక్టార్ ఆఫీసర్లను నియమించినట్లు కలెక్టర్లు తెలిపారు. జిల్లాలో 2,183 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 486 సమస్యాత్మకమైనవిగా గుర్తించి ప్రత్యేక బలగాలను నియమించామని తెలిపారు. వచ్చేనెల 12న పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల మొదటి విడత ర్యాండమైజేషన్ నిర్వహిస్తామని తెలిపారు. మే 2న ఎన్నికల పరిశీలకులు, పోటీ చేస్తున్న అభ్యర్థుల సమక్షంలో రెండవ విడత ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలో రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ అనంతరం ఐదు నియోజకవర్గాలకు ప్రత్యేకంగా రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తామని తెలిపారు. వైపాలెంకి మార్కాపురంలో, దర్శి, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాలకు స్థానికంగా మధ్యంతర స్ట్రాంగ్‌రూంలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో ఓటు నమోదు కోసం 8,457 దరఖాస్తులు రాగా 3వేలను పరిష్కరించామన్నారు. మరో 5,457 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఆర్.శ్రీలత, సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ పాల్గొన్నారు.

## కబ్జా స్థలంలో ఫ్లెక్సీ ఏర్పాటు

- స్పందించిన కమిషనర్
- ధ్వంసమైన శిలాఫలకం సంగతేంటి..?


కబ్జా చేసేందుకు ప్రయత్నించిన స్థలంలో మున్సిపాల్టీ స్థలమంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కనిగిరి, మార్చి 30 : కనిగిరిలో రూ.30కోట్ల విలువైన భూమి కబ్జాపై అధికారులు కదిలారు. ఇది మున్సిపాలిటీ స్థలం అంటూ శనివారం ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఆంధ్రజ్యోతిలో శనివారం 'రూ.30కోట్ల స్థలం కబ్జాకు పన్నాగం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు స్పందించి కబ్జా చేసేందుకు చదును చేసిన మున్సిపాలిటీ స్థలంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు అయితే నామమాత్రపు ఫ్లెక్సీ ఎన్ని రోజులు ఉంటుందోనని స్థానికులు అంటున్నారు. ఆ స్థలంలో మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి డాక్టర్ ఉగ్ర ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో శిలాఫలకం వేశారు. దానిని కూడా కబ్జాదారులు ధ్వంసం చేశారు. మరి ఆ శిలాఫలకం సంగతేంటో మున్సిపల్ అధికారులే చెప్పాలి. ఆనవాళ్లుగా ఉన్న శిలాఫలకంతోపాటు, హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కమిషనర్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ స్థలాలు, ప్రభుత్వ స్థలాలు, పోరంబోకు స్థలాలు వంటివి ఆక్రమించినా, కబ్జా చేసినా చట్టరీత్యా నేరమన్నారు. వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. మున్సిపాలిటీ స్థలాలు ఎవరైనా ఆక్రమిస్తే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు.

## దొంగతనంగా ట్రాక్టర్ల విక్రయం

**పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఆరు వాహనాలు**


పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ట్రాక్టర్లు

దర్శి, మార్చి 30 : దొంగ ట్రాక్టర్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రాయలసీమకు చెందిన కొంతమంది వ్యక్తులు అక్కడి ట్రాక్టర్లను ఏజెంట్ల ద్వారా దర్శి ప్రాంత రైతులకు విక్రయించారు. అక్కడ రైతుల వద్ద ట్రాక్టర్లను మోసగాళ్లు ఫ్యాక్టరీల్లో పనికి పెట్టిస్తామని ఆశచూపి ట్రాక్టర్లను వారు తీసుకొని ఇక్కడ రైతులకు తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్కడ ట్రాక్టర్లను ఫ్యాక్టరీలో పనికి పెట్టినందుకు నెలకు రూ.25వేలు బాడుగ చెల్లిస్తామని చెప్పి అక్కడి రైతులను నమ్మించి ట్రాక్టర్లను మోసగాళ్లు తీసుకుంటున్నారు. ఒకటి రెండు నెలలు నమ్మకంగా వారికి రూ.25 వేలు చొప్పున బాడుగ చెల్లిస్తున్నారు. ఇక తమకు ఇబ్బంది లేదని ఆ రైతులు ట్రాక్టర్లు వదిలేసిన క్రమంలో ఆ ట్రాక్టర్లును ఇక్కడి రైతులకు అతితక్కువకు రూ.2లక్షలకే విక్రయిస్తున్నారు. ఇక్కడి రైతులు ఇంత తక్కువగా ఎలా వస్తుందనే ఆలోచన లేకుండా కొంతమంది కొనుగోలు చేశారు. అక్కడ బాడుగకు ఇచ్చిన కొందరు రైతులకు అనుమానం వచ్చి తమ ట్రాక్టర్లు ఏ ఫ్యాక్టరీలో పెట్టారనే విషయమై వాకబు చేయగా అసలు విషయం బయటపడింది. సత్యసాయి జిల్లా, తాడిమర్రి మండలానికి చెందిన ఎనిమిది ట్రాక్టర్లను అక్రమార్కులు దర్శి ప్రాంత రైతులకు విక్రయించినట్లు తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాడిమర్రి పోలీసులు శనివారం దర్శికి వచ్చి ఈ ప్రాంతంలో విక్రయించిన ఆరు ట్రాక్టర్లను పట్టుకొని దర్శి పోలీస్‌స్టేషన్ వద్దకు తరలించారు. ఇంకా రెండు ట్రాక్టర్లు పట్టుకునేందుకు గాలిస్తున్నారు. కడప, ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన కొంతమంది మాయగాళ్లు ఎలాంటి పెట్టుబడులు లేకుండా రైతులను నమ్మించి ట్రాక్టర్లు తీసుకొని దొంగతనంగా విక్రయించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ముఠా ఇంకా అనేక ప్రాంతాల్లో ట్రాక్టర్లను విక్రయించి ఉండవచ్చని భావిస్తున్నారు. పూర్తి స్థాయిలో విచారిస్తే ట్రాక్టర్ల అక్రమ వ్యాపారం గుట్టు రట్టు అవుతుంది.

# సమరోత్సాహం

- అన్నింటా ముందున్న టీడీపీ అభ్యర్థులు
- ఇంటింటా సూపర్ సిక్స్‌పై ప్రచారం
- క్షేత్రస్థాయి నేతలతో సమావేశాలు
- జనసేన, బీజేపీతో సమన్వయం
- నేడు జిల్లాకు చంద్రబాబు
- మార్కాపురంలో తొలి ఎన్నికల సభ


టీడీపీలో చేరిన వారితో అభ్యర్థి జనార్దన్, రియాజ్

ఒంగోలు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెలుగుదేశం పార్టీశ్రేణుల్లో సమరోత్సాహం కనిపిస్తోంది. మరో పక్షంరోజుల్లో నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభం కానుండగా ఆ లోపుగానే ఆయా నియోజకవర్గాల టీడీపీ అభ్యర్థులు ఒక రౌండ్ ఎన్నికల ప్రచారం పూర్తిచేసేలా సాగుతున్నారు. గతానికి భిన్నంగా చాలా ముందుగానే అభ్యర్థులను అధిష్ఠానం ప్రకటించడంతో వారు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. దాదాపు ఏడాది కాలంగానే అధినేత ఆదేశాలతో బాదుడే బాదుడు, బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ, యువగళం ఇలా పలురకాల కార్యక్రమాలలో ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, వారి సారథ్యంలో పార్టీ ముఖ్య నేతలు ప్రజల మధ్యనే ఉన్నారు. ఇక ఎన్నికల షెడ్యూల్ విడుదల సమయానికి అభ్యర్థుల ఎంపికను అధినేత కొలిక్కి తెచ్చారు. ఒక్క దర్శి మినహా మిగతా స్థానాలలో ఇన్‌చార్జీలుగా పనిచేస్తున్న వారినే ఎంపిక చేయగా దర్శిలో కూడా తాజాగా ఆ ప్రాంతానికి సుపరిచితులైన గొట్టిపాటి కుటుంబానికి చెందిన మహిళనే అభ్యర్థిగా ప్రకటించారు. మరోవైపు పార్లమెంట్ స్థానం నుంచి కూడా సుపరిచితమైన మాగుంటనే బరిలో దిగుతున్నారు. ఇవన్నీ టీడీపీకి కలిసి వస్తుండగా ఆయా నియోజకవర్గాలలో అభ్యర్థులుగా నిలుస్తున్న వారు మరింత స్పీడ్ పెంచారు.

### వైసీపీ నుంచి కొనసాగుతున్న వలసలు

ఒక వైపు మండల, క్లస్టర్ స్థాయి ముఖ్యనేతలతో నిరంతరం సమావేశాలు, ఆయా ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షలు, ఇంకొక వైపు అంతోఇంతో అసంతృప్తితో కాస్తంత దూరంగా ఉంటున్న వారిని దగ్గరకు చేర్చుకోవడం, ఇతర పార్టీల నుంచి పార్టీలోకి వచ్చే వారిని గుర్తించి వారిని పార్టీలోకి ఆహ్వానించడం చేస్తున్నారు. మరోవైపు పగలు ఆత్మీయ సమావేశాలు, సాయంత్రానికి బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో ఏదో ఒక ప్రాంతంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించి మ్యానిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కొందరు అభ్యర్థులు ఇతర ప్రాంతాల్లో నివశించే తమ నియోజకవర్గానికి చెందిన సాఫ్ట్‌వేర్ రంగంలోని యువతతో పొరుగు ప్రాంతాల్లోనూ సమావేశాలు నిర్వహించి వారి నుంచి సహకారం పొందే ప్రయత్నం చేశారు. అదే సమయంలో కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉన్న బీజేపీ, జనసేన పార్టీశ్రేణులను సమన్వయం చేసుకోవడంలో సక్సెస్ అయ్యారు. అలాగే అధికార వైసీపీ నుంచి పార్టీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. ఇలా పక్షంరోజులకుపైగా జిల్లాలోని వివిధ నియోజకవర్గాలలో బిజీబిజీగా అభ్యర్థులు, వారికి మద్దతుగా ముఖ్య నేతలు విస్తృత ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తుండటం టీడీపీ శ్రేణులలో జోష్ పెంచుతున్నది.

### దర్శి శ్రేణులలోనూ ఉత్సాహం

ఇప్పటివరకు అభ్యర్థి ఎంపికలో ఉన్న గందరగోళం కూడా తొలగిపోవడంతో దర్శి నియోజకవర్గ శ్రేణులు ఉత్సాహంగా కనిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఆయా నియోజకవర్గాలలో శనివారం కూడా ఒకవైపు వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు, మరోవైపు ఇంటింటి ప్రచార కార్యక్రమాలు జోరుగానే సాగాయి. ఈ నేపథ్యంలో జిల్లాకు ఆదివారం టీడీపీ అధినేత నారా చంద్రబాబు వస్తున్నారు. జిల్లాలో తొలి ఎన్నికల ప్రచార సభను ఆయన మార్కాపురంలో నిర్వహించనున్నారు. పార్టీ పరంగా తూర్పు ప్రాంతంతో పోల్చితే పశ్చిమం కొద్దిగా వెనుకంజలో ఉందన్న భావన అధిష్ఠానంలో ఉన్నట్లు సమాచారం. దీంతో తొలిసభను పశ్చిమప్రాంతంలో ప్రత్యేకించి మార్కాపురంలో చంద్రబాబు నిర్వహించడం ద్వారా అక్కడి కేడర్‌ను మరింత కదిలించేలా ఉన్నట్లు సమాచారం. కాగా టీడీపీ అధికారంలోకి వచ్చాక పశ్చిమప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టే యోచనలో ఉన్న విషయాన్ని చంద్రబాబు ఇప్పటికే పలుమార్లు వెల్లడించారు. ప్రధానంగా పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల కోరికలైన మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేసి సాగు, తాగునీరు అందించడం, నాలుగు నియోజకవర్గాల ప్రజల దాహార్తి తీర్చే వాటర్‌గ్రిడ్ నిర్మాణం, దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి నిమ్జ్ వంటి వాటి ద్వారా ఉపాధి మార్గాల పెంపు తదితర అంశాలపై మరోసారి మార్కాపురం సభలో బాబు మరింత స్పష్టత ప్రజలకు ఇచ్చే అవకాశం ఉంది.




వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డి, టీడీపీలో చేరిన వారితో ఎంపీ మాగుంట...నారాయణరెడ్డి, కండ్లగుంటలో కరపత్రాలను పంచిపెడుతున్న అభ్యర్థి బీఎన్

# కోడ్ ఉల్లంఘిస్తున్నా చర్యలకు వెనుకంజ

- అధికార నేతల అండదండలతో మరింత రెచ్చిపోతున్న వలంటీర్లు
- అనుకూలంగా ప్రచారాలు చేస్తున్నట్లు ఆధారాలు ఉన్నా పట్టించుకోరు
- మండలస్థాయి అధికారులు తొలగిస్తున్నట్లు ప్రకటనలు ఇస్తున్నా చర్యలు శూన్యం



చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రచారంలో పాల్గొన్న జూనియర్ సహాయకుడు మధుసూదన్‌రెడ్డి
శుక్రవారం సమావేశంలో పాల్గొన్న కేఎస్‌పల్లి వలంటీర్ నవీన్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 30 : ఎన్నికల ప్రవర్తనా నియామావళిని ఉల్లంఘించి కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, ఒప్పంద ఉద్యోగులు, వలంటీర్లు అధికారపార్టీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నా చర్యలు శూన్యం. కోడ్ వచ్చిన మొదటి రెండు, మూడు రోజులు కొన్నిచోట్ల మాత్రమే వలంటీర్లపై సత్వర చర్యలు తీసుకున్నారు తప్ప ఆ తర్వాత పట్టించుకుంటున్న పరిస్థితి లేకుండా పోయింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలతోపాటు ఒంగోలు కార్పొరేషన్, మార్కాపురం మునిసిపాలిటీతోపాటు కనిగిరి, చీమకుర్తి నగరపంచాయతీల్లో పట్టణ, గ్రామ వలంటీర్లు 90శాతం మందికిపైగా అధికార పార్టీ నేతలు చెప్పిన విధంగా నడుచుకుంటున్నారు. తమ గ్రూపుల్లో కాకుండా వ్యక్తిగతంగా వారి పరిధిలోని ప్రజలకు సమాచారం చేరవేస్తూ అధికార పార్టీకి అనుకూలంగా ఓట్లు వేయాలని లేకుంటే పథకాలు తీసివేస్తామంటూ బెదిరింపులకు శ్రీకారం చుట్టారు. కొన్ని ప్రాంతాల్లో అయితే ఏకంగా అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఆయా నియోజకవర్గాల అభ్యర్థులతో కలిసి ప్రచారంలో ముందుండి పనిచేస్తున్నారు. ఆ సమయంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. జిల్లావ్యాప్తంగా ప్రతి రోజు పదుల సంఖ్యలో అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న వలంటీర్లపై ఫిర్యాదులు వస్తున్నా మండల స్థాయి అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా సుమారు 100 మందికిపైగా వలంటీర్లు ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే కేవలం పదిమందిని మాత్రమే తొలగించారు. ఎక్కడైనా వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులు చేసినా ఆధారాల లేవంటూ వాటిని తొక్కిపెడుతున్నట్లు సమాచారం. ఇంకొకవైపు అధికారపార్టీ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నట్లు ఫొటోలు బహిర్గతం అయితే ఆ మరుసటి రోజు వారిని తొలగిస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటనలు ఇచ్చి ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. మండల స్థాయిలో తొలగించిన వలంటీర్లను ఏరోజుకారోజు జిల్లా కేంద్రానికి సమాచారం ఇవ్వాల్సి ఉంది. కానీ ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీంతో వలంటీర్లు బహిరంగంగా అధికారపార్టీ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నా తమకు ఏమి కాదులే అన్న భరోసాతో మరింత రెచ్చిపోతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

## ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటికి డాక్టరేట్


ఆకుపాటికి డాక్టరేట్‌ను అందిస్తున్న వర్సిటీ ప్రతినిధులు

పామూరు, మార్చి 30 : పామూరు ఎంపీటీసీ సభ్యులు ఆకుపాటి వెంకటేష్‌కు ప్రతిష్టాత్మకమైన ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చి యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ వరించింది. తమిళనాడులోని హోసూర్ వర్సిటీలో ఏర్పాటు చేసిన సామాజిక సేవా విభాగంలో ఆకుపాటికి గౌరవ డాక్టరేట్‌ను, జ్ఞాపిక, డాలర్‌ను ప్రదానం చేశారు. అనంతరం ఆయన్ని ఘనంగా సన్మానించారు. సామాజిక సేవలో ఆకుపాటి సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందన్నారు. దేవాలయాలు, మసీద్, చర్చిలకు వాటర్ ఫ్రిజ్‌ల బహూకరణ, రక్తదాన శిబిరాలు, కరోనా సమయంలో మాస్కులు, శానిటైజర్లు, సోపుల పంపిణీ, పేదలకు బియ్యం, నిత్యావసారాలను ఆకుపాటి అందజేశారని గుర్తుచేశారు.

# కుంట భూమి మళ్లీ ఆక్రమణ

- నీళ్లు బయటకు పంపేందుకు పైపుల ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు


ఎక్స్‌కవేటర్‌తో తొలగించిన కుంట కట్ట
నీటిని మళ్లించేందుకు సిద్ధంగా ఉన్న పైపులు

దర్శి, మార్చి 30: కుంట పోరంబోకు భూమిని ఆక్రమించేందుకు మళ్లీ యత్నాలు మొదలయ్యాయి. ఎంతో విలువైన ఈ భూమిని ఎలాగైనా స్వాహా చేయాలని కొంతమంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గతంలో సాగు చేసుకుంటున్నామని కొందరు ఎస్టీలు తమకు హక్కులు కల్పించాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అదేవిధంగా కొంతమంది ఎస్సీలు కూడా అందులో కొంత తాము సాగు చేసుకుంటున్నామని తమకు హక్కులు కల్పించాలని కూడా తిరుగుతున్నారు. రికార్డుల ప్రకారం కుంట పోరంబోకు భూమిని అన్యాక్రాంతం చేసే అవకాశం లేనందున ఆ భూమిలోకి వెళ్లొద్దని అధికారులు తేల్చిచెప్పారు. దర్శి రెవెన్యూలోని 1071 సర్వే నెంబర్‌లో 6.50 ఎకరాల కుంట పోరంబోకు భూమి ఉంది. గతంలో ఆ ప్రాంత రైతుల అవసరాల కోసం మధ్యలో కుంటను నిర్మించారు. సాగర్ జలాలు వచ్చిన తర్వాత ఆ ప్రాంత భూములన్నీ మాగాణిగా మారాయి. కుంటతో అవసరం లేకపోవడంతో అందులో కొంతభూమిని ఇప్పటికే పలువురు ఆక్రమించి అనుభవిస్తున్నారు. ప్రస్తుతం ఎకరన్నర భూమి మాత్రమే ఖాళీగా ఉంది. మధ్యలో కొంతభాగం కట్ట ఉంది. దర్శి - పొదిలి ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకొని ఈ భూమి ఉండడంతో అక్రమార్కులు ఎలాగైనా స్వాహా చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అక్కడ ఎకరం రూ.కోటి పలుకుతుంది. ఒకపక్క ఎస్టీలు, మరో పక్క ఎస్సీలు తాము సాగు చేసుకుంటున్నామని ఇరువర్గాలు పోటీపడుతుండగా, ప్రస్తుతం ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు ఈ భూమిపై కన్నేసినట్లు తెలిసింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరి ఇష్టానుసారంగా వారు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఆ భూమిని చదును చేసి నీటిని పక్కకు మళ్లించేందుకు పైపులను సైతం సిద్ధం చేశారు. ఇప్పటికే కుంట కట్టను సగానికిపైగా ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. దశలవారీగా ఆ కట్టను పూర్తిగా తొలగించే సూచనలు కనిపిస్తున్నాయి. ఆక్రమణదారులు అక్కడకు వెళ్లి పనులు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోటడంలేదు. ఎవరో ఒకరు ఫిర్యాదు చేస్తే తప్ప స్పందించడం లేదు. అనేకసార్లు పలువురు ఆక్రమించేందుకు ప్రయత్నించగా అధికారులు వెళ్లి తాత్కాలికంగా నిలుపుదల చేశారే తప్ప పటిష్ట చర్యలు తీసుకోలేదు. గతంలో కుంట వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును ఆక్రమణదారులు తొలగించినా అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం ఎన్నికల తరుణం కావడంతో అధికారుల పట్టించుకోరనే ఉద్దేశం తో కొందరు ఎంతో విలువైన కుంట భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

## నియోజకవర్గ కేంద్రాల్లోహెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 30 : సార్వత్రిక ఎన్నికల్లో ఏమైనా సమస్యలు ఉన్నా, ఫిర్యాదులు ఉన్నా వెంటనే తెలిపేందుకు నియోజకవర్గ కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ హెల్ప్‌డెస్క్‌లు 24 గంటలు పనిచేస్తాయన్నారు. ప్రజలు ఎన్నికలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే ఈ హెల్ప్‌డెస్క్‌కు తెలియజేయాలన్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

| నియోజకవర్గం | ఫోన్ నెంబర్లు |
|---|---|
| ఒంగోలు | 08592-288099 |
| సంతనూతలపాడు | 08592-273100, 6305621139 |
| కొండపి | 08598-294717, 9032319379 |
| దర్శి | 8639370180 |
| కనిగిరి | 630144912 |
| మార్కాపురం | 9281034442 |
| గిద్దలూరు | 8639383409 |
| యర్రగొండపాలెం | 6281735787 |
| జిల్లా కమాండ్ | 08592-288599 |